




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 14-06-2026 ఆదివారం | సంపుటి : 14 | సంచిక :178 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on







## కుప్పకూలిన విమానం

### ఐదుగురు వాయుసేన సిబ్బంది దుర్మరణం



**న్యూఢిల్లీ, జూన్ 13 (ఏఎంఎస్) :**

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. భారత వైమానిక దళానికి చెందిన 'ఏఎన్32' రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి కూలిపోయింది. ఈ దుర్ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోపైలట్‌ను చికిత్స నిమిత్తం తక్షణమే సైనిక ఆసుపత్రికి తరలించారు.



ఈ ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తునకు (కోర్ట్ ఆఫ్ ఇంక్వైరీ) ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు.

**అమరులైన వీరుల వివరాలు:**

ఈ ప్రమాదంలో విధి నిర్వహణలో ఉంటూ వీరమరణం పొందిన వారిని స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ (వాయు) విభాగాలకు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్ ఆలమ్‌లుగా వాయుసేన గుర్తించింది.

**రక్షణ మంత్రి దిగ్భ్రాంతి..**

విమాన ప్రమాదంలో వాయుసేన సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. "దేశానికి వారు అందించిన అసమాన సేవలను ఎన్నటికీ మరువలేం. మృతుల కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించాను" అని రక్షణ మంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు.

**శత్రుదుర్భేద్యమైన 'ఏఎన్-32' ప్రత్యేకతలు:**

ప్రమాదానికి గురైన 'ఏఎన్32' జెట్ అత్యంత దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. ఎంతటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని ప్రయాణించేలా దీనిని రూపొందించారు. ముఖ్యంగా ఎత్తైన వ్యూహాత్మక ప్రాంతాల్లోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ ఇది సమర్థంగా పనిచేస్తుంది. సుమారు 7.5 టన్నుల బరువైన సరకును, 50 మంది ప్రయాణికులను లేదా 42 మంది పారాట్రూపర్‌లను ఒకేసారి తరలించే సామర్థ్యం దీనికి ఉంది. దేశంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మారుమూల ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి రక్షణ సామగ్రి, ఆహార పొట్లాలు చేరవేయడానికి (ఎయిర్ డ్రాపింగ్) వాయుసేన ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తుంది.



# భాగ్యనగరంలో వాన దంచికొట్టుడు

- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- పోలీస్ శాఖకు డీజీపీ కీలక ఆదేశాలు
- జలమయమైన హైవేలు, రహదారులు
- రంగంలోకి హైడ్రా, మున్సిపల్ శాఖలు



**హైదరాబాద్, జూన్ 13 (వుదయం) :**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శనివారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగర పరిధిలో అధికారులు, సిబ్బంది అంతా అత్యంత అప్రమత్తంగా (హైఅలర్ట్) ఉండాలని స్పష్టం చేశారు. పోలీస్, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు నిరంతరం సమన్వయంతో పనిచేస్తూ ప్రజా రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన 'హైడ్రా', విద్యుత్ శాఖ, వాటర్ బోర్డుతో పాటు సంబంధిత విభాగాలన్నీ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మున్సిపల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో సీఎం సమీక్షించారు. నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తుగానే సిబ్బందిని, సహాయక బృందాలను మోహరించాలని ఆదేశించారు.

**స్తంభించిన రవాణా..**

జాతీయ రహదారులపై నిలిచిన నీరు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. శంషాబాద్ వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న మున్సిపల్ సిబ్బంది భారీ మోటార్ల ద్వారా నీటిని తోడేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. అటు షాద్‌నగర్ పరిధిలోనూ జాతీయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**రంగంలోకి డీజీపీ..**



వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన హైదరాబాద్‌లోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ సి.వి. ఆనంద్ స్వయంగా పర్యటించారు. తీవ్రంగా ప్రభావితమైన మల్కంపేట చెరువు పరిసరాలు, టోలిచౌకీ ప్రాంతాల్లో పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సైబరాబాద్ సీపీ రమేష్‌తో కలిసి నీటమునిగిన కాలనీలు, రహదారులు, ట్రాఫిక్ మళ్లింపులపై సమీక్ష జరిపారు. నగరంలోని కీలక జంక్షన్లలో అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావిత జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది అంతా అలర్ట్‌గా ఉంటూ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని డీజీపీ ఆదేశించారు.

## వేటకు భారత్ బ్రహ్మాస్త్రం

**న్యూఢిల్లీ జూన్ 13 (ఏఎంఎస్) :**

దేశ రక్షణ రంగంలో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించింది. శత్రుదేశాల నుంచి పొంచివున్న విభిన్న రకాల వ్యూహాత్మక ముప్పులను సమర్థంగా తిప్పికొట్టేలా మన రక్షణ సామర్థ్యాలను సరికొత్త శిఖరాలకు చేర్చింది. బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, యాంటీ షిప్ వార్‌ఫేర్ (యుద్ధనౌకల విధ్వంసక) విభాగాలలో సరికొత్త సాంకేతికతను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ విజయవంతంగా పరీక్షించింది. ఈ అద్భుత విజయంతో.. శత్రుదేశాలు ప్రయోగించే సుదూర, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల దాడులను గాల్లోనే తుత్తునియలు చేసే తిరుగులేని సామర్థ్యం భారత్‌కు సొంతమైంది.

## సింగరేణిలో రూ.1,600 కోట్ల బొగ్గు మాయం

# కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించండి

**హైదరాబాద్, జూన్ 13 (వుదయం) :**

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి కాలరీస్ సంస్థలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయంటూ వస్తున్న వార్తలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై స్పందిస్తూ ఆయన శనివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. "సింగరేణి సంస్థ నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ప్రముఖ మీడియా సంస్థల్లో కథనాలు రావడం కలకలం రేపుతోంది. ఇంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆస్తి అపహరణకు గురికావడం వెనుక ఎవరి హస్తం ఉందో తేల్చాలి. ఈ వ్యవహారంపై తక్షణమే ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే గనుల వద్ద భద్రతను మరింత కఠినతరం చేయాలి" అని కిషన్‌రెడ్డి ఆ లేఖలో డిమాండ్ చేశారు.

**రూ.51,500 కోట్ల ప్రభుత్వ బకాయిలు..**

**పెరిగిన ఆర్థిక ఒత్తిడి**

సింగరేణి సంస్థను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభాన్ని కేంద్రమంత్రి ఈ లేఖలో ప్రముఖంగా ప్రస్తావించారు. "రాష్ట్ర ప్రభుత్వమే సింగరేణి సంస్థకు రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. ప్రభుత్వ విభాగాల నుంచి రావలసిన ఈ భారీ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల సంస్థపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి నెలకొంది. తక్షణమే అంతర్గత నియంత్రణ వ్యవస్థ (ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్), భద్రతా ప్రమాణాల (సేఫ్‌గార్డ్స్) పనితీరును ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సింగరేణి సంస్థ యొక్క పారదర్శకత, విశ్వసనీయత, పని సామర్థ్యాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి" అని హితవు పలికారు.

**కార్మికుల భవిష్యత్తును కాపాడదాం..**

సింగరేణి నల్ల సూర్యుల సంక్షేమంపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. "ప్రస్తుతం సింగరేణిలో 40 వేల మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా విధుల్లో ఉన్నారు.



వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఆ కార్మిక కుటుంబాల సంక్షేమంతో పాటు సంస్థ ఉజ్వల భవిష్యత్తును కాపాడటం మనందరి ఉమ్మడి బాధ్యత. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ లేఖపై సానుకూలంగా స్పందించి, తక్షణ చర్యలకు ఉపక్రమించాలి" అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## టీవీకే ప్రభుత్వం బీజేపీకి 'జిరాక్స్ కాపీ

**చెన్నై జూన్ 13 (ఏఎంఎస్) :**



తమిళనాడులో కొత్తగా అధికారంలోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం సర్కారుపైనా, ముఖ్యమంత్రి విజయ్ రాజకీయ తీరుపైనా డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టీవీకే సర్కార్ కేంద్రంలోని బీజేపీకి 'జిరాక్స్ కాపీ' లా మారిందని ఆయన మండిపడ్డారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కొనుగోలు చేస్తూ, రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం లేకుండా చేయాలనే కుట్రకు అధికార పార్టీ పాల్పడుతోందని ఆరోపించారు. శనివారం చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'లో జరిగిన డీఎంకే మహిళా విభాగం విస్తృత స్థాయి సమావేశంలో స్టాలిన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల సిరా గుర్తు చెరగకముందే షాపింగ్! దేశంలోని ఇతర రాష్ట్రాల్లో బీజేపీ ఏ రకమైన అప్రజాస్వామిక వ్యూహాలతో ప్రతిపక్షాలను బలహీనపరుస్తుందో.. సరిగ్గా అదే బాటలో తమిళనాడులో టీవీకే ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి విజయ్ విపక్ష ఎమ్మెల్యేల కోసం 'షాపింగ్' (కొనుగోళ్లు) మొదలుపెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. "ఎన్నికలు ముగిసి కనీసం 21 రోజులు కూడా గడవలేదు.. ఓటర్ల వేలికి ఉన్న సిరా గుర్తు కూడా ఇంకా చెరగలేదు.. అప్పుడే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అధికార పార్టీ గూటికి చేరారు. వారికి ఎలాంటి ఆఫర్లు ఇచ్చి లోబర్చుకున్నారో సీఎం విజయ్ సమాధానం చెప్పాలి.

# కేసీఆర్ మళ్లీ సీఎం కావాల్సిందే: కేటీఆర్

## నాపై కోపంతో నేతన్నల పొట్ట కొట్టొద్దు

**సిరిసిల్ల, జూన్ 13 (వుదయం) :**

తనపై ఉన్న రాజకీయ కోపాన్ని సిరిసిల్ల నేతన్నల మీద చూపించవద్దని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) హితవు పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నల కోసం ప్రవేశపెట్టిన ఎన్నో అద్భుతమైన పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందని విమర్శించారు. స్థానిక చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే 'బతుకమ్మ చీరల' ఆర్డర్లను రద్దు చేసి వారి పొట్ట కొట్టారని మండిపడ్డారు. సిరిసిల్లలో ఉన్నవి పెద్ద పరిశ్రమలు కావని, కేవలం నేతన్నల రక్తాన్ని నమ్ముకున్న చిన్న కుటీర పరిశ్రమలని.. వాటిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**సంచులు కూడా ఢిల్లీకేనా?..**

**రేవంత్ సర్కార్‌పై విమర్శలు**

రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం కొనేందుకు ఈ ప్రభుత్వానికి కనీసం గన్నీ



సంచులు (గోనె సంచులు) సరఫరా చేసే మొహం లేదు. ఇక్కడున్న సంచులన్నీ కాంగ్రెస్ అధిష్టానానికి, రాహుల్ గాంధీకి డబ్బులు మూట గట్టి పంపేందుకే ఢిల్లీకి వెళ్లాయని ప్రజలు అనుకుంటున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న ఆరు గ్యారెంటీలు వందల రోజులైనా అమలుకు నోచుకోలేదని, ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అక్రమంగా కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు.

**మళ్లీ కేసీఆర్ రావాలి..**

**కార్యకర్తలకు పిలుపు**

రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు నడుం బిగించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది ముఖ్యం కాదు.. ప్రతి ఒక్కరూ అక్కడ గులాబీ జెండాను, కేసీఆర్‌ను మాత్రమే చూడాలి. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి మళ్లీ పట్టాలెక్కాలంటే కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 'ఈగల్ ఫోర్స్' మెరుపు దాడి..

- 18 నెలల నిఘా.. రూ.కోటి విలువైన గంజాయి సీజ్
- అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠా

**ఖమ్మం జూన్ 13 (వుదయం) :**

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోణంలో 'ఈగల్ ఫోర్స్' పోలీసులు అత్యంత భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. గత 18 నెలలుగా కంటిమీద కునుకు లేకుండా అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. ఎట్టకేలకు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మెరుపు దాడిలో దాదాపు రూ.కోటి విలువైన 200 కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేశారు. నిందితుల నుంచి 104 ప్యాకెట్ల గంజాయితో పాటు, స్మగ్లింగ్‌కు ఉపయోగించిన రెండు వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.2,800 నగదును స్వాధీనం చేసుకున్నారు.






# యుద్ధానికి ముగింపు పలికే సమయమొచ్చింది


**వాషింగ్టన్/టెల్ అవీవ్ :**

పశ్చిమాసియాలో గత కొంతకాలంగా రగులుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఇరాన్ సంక్షోభాన్ని ముగించే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శరవేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు ఆయన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ 'యాక్సియోస్' ఒక ప్రత్యేక కథనంలో వెల్లడించింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొద్ది రోజుల్లోనే కుదిరే అవకాశం ఉందని, "ఇది ఇరుపక్షాలకు అత్యంత ప్రయోజనకరమైన ఒప్పందం.. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ స్పష్టం చేసినట్లు సమాచారం.

**భేషజాలు వీడి వెనక్కి తగ్గిన నెతన్యాహు!**

అమెరికా-ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన చర్చలు ఇప్పటికే తుదిదశకు చేరుకున్నాయని ఇరుదేశాల ఉన్నతాధికారులు ధ్రువీకరిస్తున్నారు. గతంలో ఇరాన్‌లో పాలన మార్పే (రెజీమ్ చేంజ్) ఏకైక లక్ష్యమంటూ భీష్మించుకు కూర్చున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. ఇప్పుడు ట్రంప్ హయాంలో మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల దృష్ట్యా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా ప్రతిపాదిస్తున్న ఈ చారిత్రక ఒప్పందాన్ని తాము అడ్డుకోలేమనే క్షేత్రస్థాయి అభిప్రాయానికి ఇజ్రాయెల్ వచ్చినట్లు సమాచారం. ఇరాన్ అణు కార్యక్రమంపై ఇజ్రాయెల్‌కు ఉన్న తీవ్రమైన భద్రతా ఆందోళనలను ఈ ఒప్పందంలో ట్రంప్ పరిగణనలోకి తీసుకుంటారని నమ్ముతున్నట్లు నెతన్యాహు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.

**ఇజ్రాయెల్‌లో అంతర్గత కలవరం..**



రక్షణ మంత్రి కీలక వ్యాఖ్యలు ట్రంప్ చొరవతో ఒప్పందం ఖరారవుతున్నప్పటికీ, ఇజ్రాయెల్ రక్షణ వర్గాలు మాత్రం దీనిపై పూర్తి సంతృప్తిగా లేవు. అమెరికా ఆంక్షల సడలింపును ఆసరాగా చేసుకుని ఇరాన్ తిరిగి చమురు విక్రయాల ద్వారా ఆర్థికంగా బలోపేతమవుతుందని, అదే సమయంలో తన అణు కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయకపోవచ్చని ఇజ్రాయెల్ అనుమానిస్తోంది. ఈ విషయమై ఆ దేశ రక్షణ మంత్రి కాట్జ్ మాట్లాడుతూ.. "అమెరికా తన సొంత వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఈ ఒప్పందం కుదుర్చుకుంటున్నప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమాలు, క్షిపణి క్షిపణి పరీక్షలు, ఆ దేశం పెంచి పోషిస్తున్న తీవ్రవాద ముఠాల నుంచి ఇజ్రాయెల్‌కు ఎదురయ్యే భద్రతా ముప్పులను అమెరికా విస్మరించకూడదని మేము ఆశిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.



# నీట్ రీఎగ్జామ్‌పై కేంద్రం వెరీ సీరియస్
## పారామిలిటరీ బలగాలతో భద్రత

**న్యూఢిల్లీ, జూన్ 13 :**
నీట్ 2026 పరీక్షకు కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక పోలీసులతోపాటు పారామిలిటరీ బలగాలతో భద్రత కల్పించేందుకు సిద్ధమైంది. ఈ నెల 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో ఉన్న ప్రధాన కేంద్రాల నుంచి నీట్ ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ జవాబు పత్రాలను దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు అక్కడి నుంచి పరీక్ష జరిగే పట్టణాలు, కేంద్రాలకు తరలించనున్నారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ పారా మిలిటరీ బలగాల భద్రత మధ్య రోడ్డు మార్గంలో, అవసరమైన చోట విమానాలు, హెలికాప్టర్లలో ఈ తరలింపు ప్రక్రియ జరగనుందని 'జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)' అధికారులు వెల్లడించారు.
ఇదిలా ఉండగా,
నీట్ పరీక్ష సమయాన్ని ఎన్‌టీఏ 15 నిమిషాలు పొడిగించింది. గత నెల 3న నిర్వహించిన నీట్ ఎగ్జామ్ రద్దైయిన విషయం తెలిసిందే. పేపర్ లీకేజీల కారణంగా పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది.

# మన దృఢ వైఖరి ఎక్కడ?

**నావికులు మరణిస్తే కనీస స్పందనేది?**
**కేంద్రంపై కేరళ మాజీ సీఎం విజయన్ ఆగ్రహం**
**తిరువునంతపురం, జూన్ 13 :**
గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతంలో భారతీయ నౌకలపై అమెరికా దాడి చేసిన విషయం తెలిసిందే.ఈ దాడిలో ముగ్గురు భారతీయ మరణించారు. తాజాగా ఈ ఘటనపై కేరళ ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ కేంద్రంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం దృఢమైన



వైఖరిని అవలంబించడంలో విఫలమైందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా ఫేస్‌బుక్ వేదికగా విమర్శలు గుప్పించారు."గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా సైన్యం జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించడం అత్యంత బాధాకరం," అని విజయన్ పేర్కొన్నారు." ఈ సమస్యపై స్పందన కేవలం నిరసన తెలపడానికే పరిమితం కాకూడదు," అని ఆయన అన్నారు. అమెరికాను బాధ్యురాలిగా చేయాలని, ఆ ప్రాంతంలో సైనిక చర్యలకు ముగింపు పలికేలా ఒత్తిడి తీసుకురావాలని కూడా విజయన్ కేంద్రాన్ని కోరారు. "భారతీయ నావికుల మరణాలకు అమెరికా పూర్తి బాధ్యత వహించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలి' అని ఆయన రాసుకొచ్చారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్
# తిరస్కరణ శోచనీయం

**జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్**
**కామారెడ్డి, జూన్ 13 (వుదయం ప్రతినిధి):-**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల సందర్భంగా వేసిన రాజ్యసభ నామినేషన్‌ను కుట్రపూరితంగా సాంకేతిక కారణాలతో ఎన్నికల కమిషన్ తిరస్కరించడం శోచనీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయగానే హడావిడిగా రిటర్నింగ్ అధికారి నామినేషన్ తిరస్కరించడం కుట్ర పూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఒక మహిళ నేతను అందులోనూ బలహీన వర్గాల కోసం నిజాయితీ, నిబద్ధత కలిగి గాంధేయ మార్గంలో పోరాడే మహిళా నాయకురాలిని రాజ్యసభకు వెళ్లకుండా బీజేపీ అడ్డుకోవడం తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించకుండా అపహాస్యం చేస్తూ కేంద్రంలో అధికారంలో ఉన్నామని ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం తగదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని రాజ్యాంగం విలువ



లను కాపాడాలన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశం సుప్రీం కోర్టులో విచారణలో ఉన్నందున న్యాయ వ్యవస్థ పై నమ్మకముందని న్యాయం తప్పకుండా గెలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆలయాల అభివృద్ధికి చర్యలు

**-రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క**
**మంచిర్యాల/జూన్ 13**
**(వుదయం ప్రతినిధి)**
ఆధ్యాత్మికతలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ విశ్వనాథ ఆలయ అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, రాజ్ ఠాకూర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోవు గోదావరి పుష్కరాల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు



కేటాయించడం జరిగిందని, ఇందులో భాగంగా 3 కోట్ల రూపాయల గోదావరి పుష్కరాల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు, నగర పాలక సంస్థ పరిధిలో 1 కోటి 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో డివిజనల్ కార్యాలయాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు సతీష్ కుమార్ కు పితృవియోగం

**పరామర్శించిన పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు**
**జయశంకర్ భూపాలపల్లి జూన్ 13(వుదయం జిల్లా ప్రతినిధి)**
భూపాలపల్లి జిల్లా సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్ కు పితృవియోగం జరిగింది. తన తండ్రి ఎర్రం సమ్మయ్య వడదెబ్బ తగలడంతో శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. కాగా భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి అంత్యక్రియల్లో పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్ ను టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చింతల కుమార్ యాదవ్, హనుమకొండ జిల్లా



అధ్యక్షులు టివి రాజు, ములుగు జిల్లా అధ్యక్షులు పిట్టల మధుసూదన్, భూపాలపల్లి జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి, రాంబాబు, ప్రవీణ్, భాస్కర్, జోవర్ధన్, హనుమకొండ జిల్లా నాయకులు అనిల్ రెడ్డి, వెంకట్,సీనియర్ జర్నలిస్ట్ చెరుకు సుధాకర్, పరామర్శించారు, మరో వైపు సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు జిల్లా నాయకులు గుర్రం దేవేందర్ లు పూలమాలవేసి నివాళులర్పించారు.టీయూడబ్ల్యూజే హెచ్ 143 నాయకులు మంతెన సమ్మయ్య, కక్కెర్ల జగన్, పృధ్వి లు పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు.అదేక్రమంలో టిఎస్ జేయు జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, నాయకులు గట్టు రవీందర్, కడపాక రవి, మారపల్లి చంద్రమౌళి, సతీష్ ను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.నవతెలంగాణ ఉమ్మడివరం జిల్లా రీజినల్ మేనేజర్ దేవేందర్ రావు వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి ములుగు జిల్లాల ఏడివిటీలు బాబు,ప్రశాంత్, గౌస్ పాషా,ప్రభాకర్ తోపాటు జిల్లాలోని ఆయా మండలాల నవతెలంగాణ విలేకరులు దూలం కుమారస్వామి, రహీం పాషా, రాజేందర్, సమ్మయ్య లు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


# పూసల కులానికి శుభవార్త
## డీఎన్‌టిగా అధికారిక గుర్తింపు



**ఆర్మూర్, జూన్ 13**
**, వుదయం ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎన్‌టీ (దినోటైడ్ ట్రైబల్స్ ) కులాల జాబితాలో పూసల కులానికి అధికారిక గుర్తింపు లభించడం పట్ల పూసల సమాజం హర్షం వ్యక్తం చేసింది. ఈ గుర్తింపు కోసం కృషి చేసిన కేంద్ర డీఎన్‌టీ కమిషన్ బోర్డు కార్యదర్శి అప్పారావు, ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, మాజీ బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఐఏఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
త్వరలో డీఎన్‌టీ సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం మరింత ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ విజయానికి పూసల సంఘాలు, నాయకులు, యువత, మహిళలు, కుల పెద్దలు అందించిన సహకారం అమూల్యమని జిల్లా అధ్యక్షుడు రంగన్న తెలిపారు.
ఈ కార్యక్రమంలో మధుబాబు, వినోద్ కుమార్, నరేష్, రవి, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిబుల్ ఐటీ ఫలితాలలో విజయం సాధించిన భరత్ విద్యార్థిని.

**మధిర, జూన్ 13, వుదయం ప్రతినిధి:**
పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 600/573 మార్కులను సాధించడమే కాకుండా,టీజేఆర్జేసీ స్టేట్ 8వ ర్యాంకును సైతం కైవసం చేసుకున్న భరత్ విద్యార్థిని కే.వీ.మనోన్వితా ను భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం వెంకట



రెడ్డి,విద్యాలత అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు ముందు ఇంకా ఎన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ విలువలతో కూడిన విద్యను అందించడానికి తమ విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా హై స్కూల్ ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు,డీన్ రవీందర్ రెడ్డి ,ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ ఉమా,ఇంచార్జ్ బెల్లంకొండ స్రవంతి,ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ కే.ప్రియాంక మరియు ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

# ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలి

**అంగన్వాడి టీచర్ నల్ల భారతి.**
**నర్సంపేట వుదయం**
**ప్రతినిధి జూన్ 13.**
నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట అంగన్వాడి కేంద్రంలో వేసవి సెలవుల అనంతరం ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్వాడి కేంద్రం పునఃప్రారంభం కానున్న సందర్భంగా అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సమావేశాన్ని స్థానిక కౌన్సిలర్ మరియు కమిటీ చైర్మన్ శ్రీమతి రామోజు రోజారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ అంగన్వాడి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పూర్వ ప్రాథమిక విద్యకు పిల్లల హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పాఠశాల ఆవరణలో అంగన్వాడి కేంద్రం నూతన భవన నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవులు పొడిగించిన నేపథ్యంలో జూన్ 5 నుంచి 15 వరకు ఎనిమిది పని దినాలకు సంబంధించిన రేషన్‌ను లబ్ధిదారుల ఇళ్లకు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. స్థానిక అంగన్వాడి టీచర్ నల్లా భారతి మాట్లాడుతూ ప్రాజెక్టులోనే అత్యధిక లబ్ధిదారులు ఉన్న కేంద్రంగా తమ అంగన్వాడి కేంద్రం కొనసాగుతోందని, రెండు యాప్‌ల ద్వారా



సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తూ ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు అందించిన సహకారాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని లబ్ధిదారులను కోరారు. అలాగే పాఠశాల ఆవరణలో అంగన్వాడి కేంద్ర నూతన భవన నిర్మాణానికి కౌన్సిలర్ ప్రత్యేకంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశా కార్యకర్త రమ మాట్లాడుతూ పిల్లలకు 18 నెలల వయస్సు తర్వాత ఐదు సంవత్సరాల వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్‌ఏ ద్రావణం ఇవ్వడం ఎంతో అవసరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మరియు ఏ ఎల్ ఎం ఎస్ సి చైర్మన్ రోజారాణి, అంగన్వాడి టీచర్ భారతి, ఎం.డి. గౌసియా, ఆయా సునీత, ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీ సభ్యులు, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు రాధిక, ఆశా కార్యకర్తలు రమ, అనిత, మానస, రమ్య, అభినయశ్రీ, శ్రావణి, కవిత, అనూష, లాస్య, మౌనిక, దివ్య, స్వప్న, లక్ష్మి, షబానా, ఆసిఫా, రేష్మా, పర్వీన్‌తో పాటు తల్లులు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

## నల్గొండను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**
నల్గొండ జిల్లా బత్తాయి సాగులో తిరిగి పూర్వవైభవం సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో బత్తాయి సాగును మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.నల్గొండ పేరు బత్తాయి, ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ముఖ్యంగా సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు తిరిగి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అవసరమైతే హైదరాబాద్‌లో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సిట్రస్ రైతుల సమస్యలు, ఆధునిక సాగు పద్ధతులు, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలపై చర్చిస్తామని మంత్రి రుణాలు వంటి పథకాల ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు.అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.
ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజిరెడ్డి, రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి, చెవిటి వెంకన్న, పావని రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, వివిధ జిల్లాల రైతులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుదాం. భవిష్యత్ తరాలను రక్షిద్దాం.



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 13.**
ప్రజా-పాలన ప్రగతి-ప్రణాళిక ముగింపు సమావేశంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ కోసం విశేష కృషి చేస్తున్న ఎర్రబోయిన రాజశేఖర్‌ను జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ కలిసి రాజశేఖర్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మానవ మనుగడను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల భూమి, నీరు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని వివరించారు.
అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగితేనే హరిత లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న ఎర్రబోయిన రాజశేఖర్ సేవలను అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల భూమి, నీరు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని వివరించారు. అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగితేనే హరిత లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

**జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ కలిసి రాజశేఖర్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మానవ మనుగడను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల భూమి, నీరు, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని వివరించారు.అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగితేనే హరిత లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.**
న్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న ఎర్రబోయిన రాజశేఖర్ సేవలను అధికారులు ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



### నిరుడు సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో

## తెలంగాణ రక్షణ సేన పార్టీలో భారీ చేరికలు



- మిస్ ఇండియా 2026 ఫస్ట్ రన్నర్-అప్ సాయి ప్రియ రెడ్డికి ఘన సన్మానం
- కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసిన సాయి ప్రియ రెడ్డి
- రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పార్టీలో చేరికలు జోరందుకున్నాయి
- నిరుడు సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికలు

**గండిపేట్ జూన్ 13 (వుదయం):** తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతం దిశగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చేరికలు ఊపందుకున్నాయి.నిరుడు సర్వేష్ ముదిరాజ్, శ్రీనాథ్ ప్రతికంతం ఆధ్వర్యంలో పలువురు యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు శనివారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది.ఇటీవల నిర్వహించిన మిస్ ఇండియా-2026 పోటీల్లో ఫస్ట్ రన్నర్అప్‌గా నిలిచి రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చిన సాయి ప్రియ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.యువతకు ఆదర్శంగా నిలిచిన సాయి ప్రియ రెడ్డి సేవలను నాయకులు కొనియాడారు .ఈ సందర్భంగా సాయి ప్రియ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు.ఆమెతో రాష్ట్ర అభివృద్ధి, యువత పాత్ర, మహిళా సాధికారత వంటి అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.సాయి ప్రియ రెడ్డికి కవిత శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు కృషి చేస్తున్న నిరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, యువత, మహిళలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తులు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై చేరుతున్నారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం, స్థానిక అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరికీ నాయకులు కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.రానున్న రోజుల్లో సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో మరిన్ని చేరికలు జరిగే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి.నిరుడు సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

## ఎస్‌బీఐ ఆర్‌సెటీలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాల ప్రదానం

**సంగారెడ్డి జూన్ 13 (వుదయం):** సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ)లో మగ్గం శిక్షణ పూర్తి చేసుకున్న శిక్షణార్థులకు తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ ఆమెకు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శిక్షణార్థులు కరతాళధ్వనులతో ఆమెను ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా బ్యూటీ పార్లర్ శిక్షణ పొందుతున్న 34 మంది శిక్షణార్థినులు రూపొందించిన వధువు అలంకరణ ప్రదర్శనను నిర్మలా జగ్గారెడ్డి తిలకించారు. అమ్మవారి వేషధారణ, భారతమాత వేషధారణతో పాటు వివిధ సాంప్రదాయ అలంకరణలతో చేసిన ప్రదర్శనలు ఆమెను ఆకట్టుకున్నాయి. సంస్థ డైరెక్టర్ ఎం. రాజేష్ కుమార్ మాట్లాడుతూ, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో గ్రామీణ యువతకు పూర్తిగా ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు. శిక్షణతో పాటు భోజనం, వసతి గృహ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన వారిలో అధిక శాతం మంది స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. "ఆడపిల్ల అబల కాదు... ఆది పరాశక్తి" అని కొనియాడుతూ, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. అన్యాయాన్ని ధైర్యంగా ప్రశ్నిస్తూ తమ హక్కుల కోసం నిలబడాలని సూచించారు. శిక్షణార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను నిరంతరం అభ్యసిస్తూ స్వయం ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవితం గడపాలని ఆమె ఆకాంక్షించారు. భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ సేవలను స్మరించుకుంటూ, ఆమె నాయకత్వం మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ నాయక్, సంస్థ సమన్వయకర్తలు శివశంకర్, నర్సింలు, లక్ష్మీప్రియ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.




## రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

### డీసీసీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి
### ఓటు చోరీతో పాటు సీటు చోరీకి వెనకాడని భాజపా
### గజ్వేల్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం




**గజ్వేల్, జూన్ 13 (వుదయం ప్రతినిధి) :** కేంద్రంలోని బీజేపీ సర్కార్ దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేయడమే కాకుండా, అధికారం కోసం సీటు చోరీకి కూడా దిగజారిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం గజ్వేల్‌లో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ఇంతకాలం ఓటు చోరీకి పాల్పడిన భాజపా.. ఇప్పుడు ఏకంగా సీటు చోరీకి కూడా వెనకాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



దేశంలో కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే క్రమంలో అగ్రనేతలపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని, చివరకు గాంధేయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సభ్యత్వం దక్కకుండా కుట్రలు చేశారని ఎద్దేవా చేశారు. ఎలాంటి క్రిమినల్ కేసులు లేనప్పటికీ, కావాలనే బీజేపీ నేతల ఫిర్యాదుతో ఆమె నామినేషన్ పత్రాలను తిరస్కరించడం సిగ్గుచేటని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ దేశాన్ని అప్పులపాలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీజేపీ మినహా ఇతర పార్టీల ఉనికి లేకుండా చేయాలని చూస్తున్న ప్రధాని మోడీకి భవిష్యత్తులో అదే గతి తప్పదని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కుల మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ అసలు నైజాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధికి అడ్డుతగులుతున్న బీజేపీ నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.
రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ అండ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సాగుకు సరిపడా ఎరువుల సరఫరా విషయంలో గతంలో రైతులు ఇబ్బందులు పడ్డారని, అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నట్లు వారు వివరించారు.
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు నరేందర్ రెడ్డి, విజయ మోహన్ (మార్కెట్ కమిటీ చైర్మన్లు), సర్దార్ ఖాన్ (మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్), నాయిని యాదగిరి (పీసీసీ కార్యదర్శి), సమీర్ (జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు), మొనగారి రాజు, రాములు గౌడ్ (పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు), గుంటూకు శ్రీనివాస్ (మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు)
సుఖేందర్ రెడ్డి, కనకయ్య** (మండల పార్టీ అధ్యక్షులు) రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, డాక్టర్ వహీద్,అజర్ (యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు) మరియు వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కల్పించాలి


### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్, జూన్ 13 (వుదయం ప్రతినిధి )** జగద్గిరిగుట్ట 126 డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో పర్యటించారు. అనంతరం వార్డ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరుతుందని, అర్ధరాత్రి వేళలో ప్రెజర్ తో త్రాగునీటిని సరఫరా చేయడం వల్ల త్రాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ జీవనోపాధి కోసం డబ్బాలను ఏర్పాటు చేసుకొని చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటే అధికారులు డబ్బాలను తొలగించాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారని రాజీవ్ గృహకల్ప వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఉండేది అధికంగా పేదలేనని, జీవనోపాధి కోసం కూలి పనికోసం, ఉద్యోగాలకు కోసం నగరానికి వెళ్లి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు అర్ధరాత్రి వేళల్లో ప్రెజర్ తో నీటిని సరఫరా చేయడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేసి అర్ధరాత్రి వేళల్లో కాకుండా సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేయాలని అన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం సంక్షేమ సంఘాల సభ్యులు, గృహకల్ప వాసులు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతాం

### ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**దుండిగల్, జూన్ 13, (వుదయం ప్రతినిధి )** సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట లోని లహరి గ్రీన్ పార్క్ లో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను కల్పిస్తూ గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ సందర్భంగా లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సునీతా మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తెర అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెలగపూడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సభ్యులు మురళి, ప్రశాంత్, కాటం శ్రీనివాస్, నాయకులు ఎస్వి.సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






## ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి బైక్ ధ్వంసం
## శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో వర్షం బీభత్సం

- గాలి వాన ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలివేత సింగపూర్ ఆదర్శ్ నగర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- శంకర్‌పల్లిలో కుండపోత వర్షం.. ప్రజల్లో ఆందోళన అదృష్టవశాత్తూ తప్పిన ప్రాణనష్టం



**శంకర్‌పల్లి, జూన్ 13 (వుదయం) :** శంకర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు విరిగి పడగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.దీంతో కొన్ని ప్రాంతాల్లో సాధారణ జనజీవనం తాత్కాలికంగా అస్తవ్యస్తమైంది.శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగపూర్ ఆదర్శ్ నగర్‌లో గాలి వేగానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.మోయిన్ ప్లంబర్ ఇంటి ముందు, సింగాపురం రామచందర్ నివాసం ఎదుట ఉన్న స్తంభాలు నేలకొరిగి స్థానికులను భయాందోళనకు గురిచేశాయి. భారీ గాలుల కారణంగా చెట్లు కూడా ఒరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగించాయి.ఈ ఘటనలో ఒక విద్యుత్ స్తంభం సమీపంలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనంపై పడటంతో బైక్ పూర్తిగా ధ్వంసమైంది.వాహనం నుజ్జునుజ్జు అయినప్పటికీ, సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.సంఘటన జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై అధికారులకు సమాచారం అందించారు.సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగడంతో మండలంలోని పలు గ్రామాలు తడిసిముద్దయ్యాయి.విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పరిస్థితిని సమీక్షించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

## జగదేవపూర్‌లో వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలు

### ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..
### కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న బీఆర్ఎస్ శ్రేణులు




**జగదేవపూర్, జూన్ 13 (వుదయం ప్రతినిధి):** సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పనగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి పేరిట అర్చన,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పార్టీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.
ఈ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు
ఇంద్రసేనా రెడ్డి (పీఏసీఎస్ చైర్మన్) బాలేశం గౌడ్ (మాజీ ఎంపీపీ)రంగారెడ్డి (మాజీ ఆత్మ కమిటీ చైర్మన్)
కిరణ్ గౌడ్ (మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు) సంతోష్ రెడ్డి (జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు) కావ్య దర్గయ్య (మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు) సుధాకర్ రెడ్డి (మాజీ రైతు బంధు అధ్యక్షులు) శ్రీనివాస్ రెడ్డి (మాజీ కొండపోచమ్మ చైర్మన్) కవిత (మండల మహిళా అధ్యక్షురాలు) ఏక్బాల్ (మాజీ కోఆప్షన్ సభ్యులు) ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మండల నాయకులు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వంటేరు ప్రతాపరెడ్డికి డిజిటల్ మాధ్యమాల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఒకటో వార్డులో తాగునీటి ఎద్దడికి చర్యలు



**జిన్నారం జూన్ 13(వుదయం ప్రతినిధి) :** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు లో కౌన్సిలర్ బాలు గారి మాధవి శ్రీనివాస్ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. శనివారం వార్డులో బోర్ వేయించారు. తాగునీటి ఇబ్బందులు తెలుసుకున్న కౌన్సిలర్ ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కరించారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడేదే లేదని కౌన్సిలర్ పేర్కొన్నారు. నీటి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ కు స్థానికులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు నర్సింలు శివశంకర్ శ్రీనివాస్ సత్యనారాయణ బుచ్చమ్మ బాలకృష్ణ మధు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



"కలిసుంటేనే బలం.. విడిపోతే పతనం...


కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

'ఐకమత్యమే మహాబలం..కలిసుంటే బలం.. విడిపోతే పతనం.. మన ఉమ్మడి ప్రత్యర్థి అయిన బీజేపీ నుంచి ఎదురయ్యే సవాలును తిప్పికొట్టడానికి మిత్రపక్షాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి.. అలాగే, మిత్రపక్షాలను ఒకరినొకరు కించపరచుకోవద్దు.. దేశం, రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడదాం...'"

-కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## వే'మన' పద్యం

గంగిగోవుపాలు గరిటెడైనను చాలు
కడివెడైన నేమి ఖరము పాలు
భక్తిగలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ! వినుర వేమ!



## సంపాద కీయం

# చెప్పుకోవటానికి ఏముంది..?

ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టి పన్నెండేళ్లు పూర్తయ్యాయి. వరుసగా మూడోసారి అధికారంలో కొనసాగుతున్న ఆయన, స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా పనిచేసిన నాయకునిగా చరిత్ర సృష్టించినట్లు చెప్తున్నారు. 1952 నుంచి జవహర్‌లాల్ నెహ్రూ పాలనను సాంకేతికంగా లెక్కించి ఆ రికార్డును బుధవారం నాడు మోడీ అధిగమించినట్లు ప్రచారం చేస్తున్నారు. 1947 నుంచి ఐదేళ్ల పాటు సాగిన నెహ్రూ పాలనను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. ఈ చర్యతో మోడీని తిరుగులేని నాయకునిగా చిత్రీకరించడానికి సంఘ్‌పరివార్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు, గోడీ మీడియా ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, ఈ ప్రచార హోరును పక్కనబెట్టి ఈ పన్నెండేళ్ల పాలన దేశ ప్రజల జీవితాలపై ఎలాంటి ముద్ర వేసిందన్నది పరిశీలిస్తే ఏమున్నది గర్వకారణమన్న మహాకవి మాటలే గుర్తుకువస్తాయి.మోడీ పాలన అనగానే 2016 నవంబరు 8న ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తొలుత గుర్తుకొస్తుంది. ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా కుదిపేసింది. అసంఘటిత రంగం, చిన్న పరిశ్రమలు, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు కోలుకోలేని దెబ్బతిన్నారు. బ్యాంకుల ముందు క్యూలలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచాన్ని కుది పేసిన కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహ రించిన తీరు దేశ ప్రజలకు ఎప్పటికీ పీడకలే! అకస్మాత్తుగా ప్రకటించిన దేశ వ్యాప్త లాక్‌డౌన్ లక్షలాది వలస కార్మికులను రోడ్డున పడేసింది. వందల కిలోమీటర్లు కాలినడకన స్వగ్రామాలకు వెళ్లిన వారి దృశ్యాలు మనదేశ సామాజిక వాస్తవికతను ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టాయి. రెండో దశ కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత, పడకల లభ్యత లేకపోవడం, ఔషధాల కొరత కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గంగానదిలో తేలిన మృతదేహాలు, శ్మశానాల్లో కనిపించిన భయానక దృశ్యాలు ప్రభుత్వ వైఫల్యాలకు ప్రతీకలుగా మిగిలిపోయాయి.ఆర్థిక రంగంలోనూ మోడీ పాలన సాధించిన ఘన విజయాలు దాదాపు శూన్యం! రోజురోజుకి కృంగి కృశించి పోతున్న రూపాయి విలువే దీనికి నిదర్శనం.నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పెరిగిన ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను ఘోరంగా దెబ్బతీశాయి.వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల నిజ ఆదాయాలు అందుకు అనుగుణంగా పెరగడం లేదు. కార్పొరేట్ సంస్థలకు భారీ పన్ను రాయితీలు, రుణాల మాఫీలు ప్రకటిస్తూనే, సామాన్యులపై పరోక్ష పన్నుల భారం మోపిన ఘనత నరేంద్రమోడీ ప్రభుత్వానిది. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల లాభాలే లక్ష్యంగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రైతులపై రుద్దడానికి చేసిన ప్రయత్నం దేశ చరిత్రలోనే అతి పెద్ద రైతాంగ ఉద్యమానికి దారితీసింది. విదేశాంగ విధానంలోనూ 'విశ్వగురు'వంటి ప్రచార యావ తప్ప, జాతీయోద్యమ వారసత్వంగా నెలకొల్పిన విలువలను మంట గలిపిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కింది. ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు క్షీణించాయి. అన్ని రంగాల్లోనూ అమెరికా అడుగులకు మడుగులొత్తడమే లక్ష్యంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడులపట్ల మన దేశ వైఖరే దీనికి నిదర్శనం.రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చడం, ప్రజాసామ్య విలువలను తుంగలో తొక్కడంలో గత ప్రభుత్వాలతో పోలిస్తే మోడీ సర్కారుదే పై చేయి! పార్లమెంటు చర్చల సంప్రదాయం క్షీణించింది. దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రత్యర్థులను, మేధావులను, లౌకిక వాదులను, అభ్యుదయ శక్తులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఎన్నికల కమిషన్‌తో పాటు న్యాయవ్యవస్థ స్వతంత్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్రరాష్ట్ర సంబంధాల్లో సమాఖ్య స్ఫూర్తిని ఘోరంగా దెబ్బతీశారు. హిందూ మతోన్మాదం, మైనారిటీలపై విద్వేష ప్రచారం, గోగూండాల దాడులు, విద్వేష ప్రసంగాలు దేశ స్వాతంత్ర్య పోరాటం నిర్మించిన లౌకిక, బహుళత్వ విలువలకు సవాల్‌గా మారాయి. ఈ వాస్తవ పరిస్థితిని మోడీ ప్రచార యంత్రాంగం మసిపూసి మారేడు కాయ చేస్తోంది. అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం సాగదు. నాయకుల్ని వారి వాగాడంబరంతో కాకుండా, వారు సాధించిన ఫలితాలతోనే చరిత్ర అంచనా వేస్తుంది. దేశంలో నిరుద్యోగంతో యువత నిస్సహాయులైంది. లేబర్ కోడ్‌లతో కార్మికులు, ఉద్యోగులు భద్రత కోల్పోయారు. భవిష్యత్తుపై బెంగతో రైతాంగం చిక్కిపోతోంది. మనువాద శక్తుల విజృంభణతో మహిళలు,
దళితులు, మైనార్టీలు నిస్సహాయులుగా మారుతున్నారు. ఇవన్నీ పన్నెండేండ్ల కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలోని వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనాలని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఈ ఉద్యోగులకు జీతాలు ఎందుకు?

ప్రభుత్వంలోని చాలా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వకున్నా పని చేస్తారని చెప్పవచ్చు. ఎందుకంటే నెలకు వచ్చే జీతం కన్నా పది ఇరవై రెట్లు పై ఆదాయం వారికి అప్పనంగా వస్తోంది. ఆ విభాగాలేమిటో చెప్పే ముందు అదే రకపు ఓ విచిత్రం గురించి ప్రస్తావించాలి. దినపత్రికలను ఊర్లకు చేరవేసే జీపులు పొద్దున ఐదింటికే రోడ్ల మీదికి వస్తుంటాయి. డబ్బులు చెల్లించి చాలా మంది వాటిలో ప్రయాణిస్తుంటారు. అది తెలిసాక జీపు ఓనర్లు డ్రైవర్లకు జీతమివ్వడం మానేశారు. జీతం ఇవ్వలేదని ఒక్క డ్రైవర్ కూడా ఉద్యోగం వదిలేయలేదు. ఈ డ్యూటీ ఉంటే చాలు అనుకున్నారు. ఎందుకంటే ప్రయాణికుల వల్ల వారికి లభించే రూపాయలే మంచి గిట్టుబాటు అవుతాయి. అందుకే జీతం ఇవ్వకున్నా వాళ్లు డ్యూటీని చేస్తున్నారు. మన ప్రభుత్వం కూడా పై ఆదాయం ఉన్న ఉద్యోగులకు కూడా ఈ ఉదాహరణ సరిగ్గా సరిపోతుంది. మేము అలా పని చేయము అని వారు అంటే ప్రభుత్వానికి పోయేదేం లేదు, వారి స్థానంలో ఇచ్చినంత జీతంతో అవే డ్యూటీలు చేయడానికి యోగ్యతలున్న ఎందరో ఆఫీసుల ముందు బారులు తీరుతారు.

ఐదేళ్లకోసారి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీత భత్యాల సవరణ జరుగుతుంది. 2014లో గద్దెనెక్కిన కేసీఆర్ తెలంగాణ ధనిక రాష్ట్రమంటూ ఉద్యోగుల జీతాలను అడ్డంగా పెంచేశారు. ఆ తొందరపాటుకు రాష్ట్రం దివాళా తీసి చివరకు ఫస్ట్ తారీఖుకు జీతాలు చెల్లించలేని దుస్థితి ఆయన పాలనలోనే వచ్చింది. అందుకే 2023 నాటికే ఉద్యోగులకు బకాయి పడిన మరో వేతన సవరణ విషయంలో రేవంత్ ప్రభుత్వం కక్కలేని, మింగలేని పరిస్థితిలో ఉంది. వేతన సవరణ వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఉద్యోగులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఉద్యోగులను చల్లబరచడానికి వారి నాయకులతో మంత్రుల చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నెలకు లక్ష, రెండు లేదా మూడు లక్షలు ఆ పైన జీతం తీసుకొనేవారు 51 % ఫిట్ మెంట్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. అది వారి హక్కు. కానీ ఉద్యోగ విధులు నిజాయితీగా నిర్వహించినపుడే ఆ హక్కులు వారికి వర్తిస్తాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ జేబులు నింపుకునే వారికి జీతాలు పెంచమని అడిగే హక్కే ఉండదు.


ఇక ఉద్యోగుల విషయానికొస్తే పై సంపాదన లేని ప్రభుత్వ శాఖలు ఒక్కటీ కానరాదు. విద్యా శాఖలో క్లాసులు తీసుకొనే టీచర్లను ఇందుకు మినహాయించ వచ్చేమో! తతిమ్మా వాళ్లంతా సంపాదనపరులే. ఉంటే గింటే వారిలో ఓ 10 % నీతిమంతులు ఉండవచ్చు. రాష్ట్రంలో దాదాపు అన్ని శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు ఈ మధ్య వరుసగా అవినీతి శాఖ చేతికి చిక్కుతున్న వార్తలు చూస్తుంటే అదే ఆఫీసులో పనిచేస్తున్న మిగతా వారు అదే బాపతు కాదని ఎలా చెప్పగలం? వేరే ఊర్లో ఉన్న అదే శాఖలో పనిచేసేవారు సత్యవంతులని అనగలమా? ఈ లెక్కన దేశమంతా అన్ని శాఖల్లో అన్ని ఆఫీసుల్లో వీరే ఉంటారు. అంతేసి జీతాలు పొందుతున్నా ఆశ చావనట్లు లంచాలతో కోట్ల ఆస్తులను కూడబెడుతున్నారు.

వివిధ శాఖల్లో కొత్తగా ఉద్యోగ నియామకాలు జరుగుతుంటే ప్రభుత్వ ఆఫీసుల్లో లంచ గొండుల సంఖ్య పెరుగుతుందనే భయం సామాన్యుల్లో నెలకొంటుంది. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ట్రాన్స్ పోర్ట్, పోలీస్, మున్సిపల్, ఎక్సయిజ్, కమర్షియల్ టాక్స్, పబ్లిక్ వర్క్స్, లేబర్, పవర్ లాంటి అక్రమ ఆదాయమార్గాలున్న శాఖల్లో చేరడానికి పరీక్షల్లో పోటీ ఎక్కువ. ఎంతో విస్తారంగా చదివితే తప్ప ఈ శాఖల్లో చోటు లభించదు. ఉద్యోగంలో చేరాక ఆ చదువు, జ్ఞానం ఏమైతదో అర్థం కాదు. ప్రొబేషన్ లో ఉన్న ఉద్యోగులు కూడా జాబ్ పర్మనెంట్ అయ్యేదాకా ఆగకుండా వసూళ్లకు ఎగబడుతున్నారు. ఒకరు దొరికారన్న భయం ఇంకొకరి లేనట్లే ఉన్నది. ఆర్టీసీ ఉద్యోగులు జీతాలు పెంచమంటే సంస్థ నష్టాల్లో ఉంది కదా అని ప్రభుత్వాలు ఈజీగా అనేస్తుంటాయి. మరి పైన పేర్కొన్న శాఖల్లోని ఉద్యోగులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తమ జేబులు నింపుకుంటున్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిని పట్టుకొని వంద రూపాయలకు వదిలేస్తే ప్రభుత్వానికి రూ. 900 నష్టం జరుగుతుంది. ఓవర్ లోడ్ తో వాహనాలు నడిస్తే కనీస పెనాల్టీ రూ. 2000. అదేమీ చెక్ చేయకుండా లంచం తీసుకొని వదిలేస్తుంటారు. దాని వల్ల రాష్ట్రానికి కోట్ల ఆదాయం తగ్గిపోగా ఆ వాహనాల కారణంగా రోడ్లు చెడిపోవడం, కంట్రోల్ తప్పి ప్రమాదాలు కావడం జరుగుతుంది. హైదరాబాద్ లో రోడ్ల మరమ్మతుకు ప్రతి ఏడాది రూ. 600కోట్ల దాకా ఖర్చు అవుతోంది. పర్సంటేజీ తీసుకోకుండా పనులు ఖచ్చితంగా చేయిస్తే ప్రభుత్వ సొమ్ము వేల కోట్లలో ఆదా అవుతుంది. వ్యాపారుల దొంగ లెక్కలకు వాణిజ్య పన్నుల శాఖా ఉద్యోగులు ఆమోద ముద్ర వేసి అక్రమాస్తులు పోగేసుకుంటారు.

కాళేశ్వరంను కూలేశ్వరంగా మార్చిన ఘనతలో ఇరిగేషన్ సిబ్బంది పాత్ర ఇప్పటికే కొంత వెలుగు చూసింది. ఇలా చెప్పుకుంటూ పోతే లంచావతారాల లీలలకు హద్దులే లేవు. ఇక జీతాల సవరణ విషయానికొస్తే టిజి ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 11% పెంపుకు ముందుకొచ్చింది. ఆర్టీసీ సిబ్బంది పడే కష్టాలను ఆఫీసుల్లో నీడకు పనిచేసే చప్రాసీ కూడా ఎరగడు. ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాలను 51 % పెంచాలంటున్నారు. ఆర్టీసీ నష్టాలకు ఆ సంస్థ ఉద్యోగులు బాధ్యులు కారు. ప్రభుత్వ ఆదాయం కోట్లలో తగ్గిపోవడానికి మాత్రం అవినీతి ఉద్యోగులే కారణం అందుకే అక్రమ ఆదాయం ఉన్న శాఖల్లోని ఉద్యోగులకు జీతాలు పెంచే అవసరమే లేదు. అలా పని చేయమన్న వారిని ఇంటికి పంపించి తక్కువ వేతనాలకే పని చేస్తామని ఒప్పుకొనే వారికి అవకాశం ఇవ్వాలి. పాలకులు వ్యవస్థలను సరిదిద్దకపోతే యువత రంగంలోకి దిగుతున్న కాలమిది.

బద్రి నర్సన్
9440128169

# గోదావరి తీరాన 'దక్షిణకాశి' వైభవం



గోదావరి పుష్కరాలు అనగానే సాధారణంగా అందరి మదిలోనూ మెదిలే మొదటి పేరు రాజమహేంద్రవరం. అయితే, అంతటి ప్రాచీన పౌరాణిక వైభవం, చారిత్రక నేపథ్యం ఉన్న గోదావరి నదీ తీర సంస్కృతి కేవలం ఆంధ్ర ప్రాంతానికే పరిమితం కాలేదు. సహస్రాబ్దాల ఆధ్యాత్మిక వారసత్వాన్ని తన గర్భంలో దాచుకున్న తెలంగాణలోని గోదావరి తీర క్షేత్రాలు కూడా పుష్కరాల సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన, సమానమైన ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. ఈ సుదీర్ఘ నదీ పరివాహక ప్రాంతంలో 'దక్షిణకాశి'గా, వైష్ణవశైవ సంప్రదాయాల సంగమ క్షేత్రంగా విరాజిల్లుతున్న జగత్ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి. జగజ్జనకుడు బ్రహ్మదేవుడు, లక్ష్మీసమేతుడైన నరసింహస్వామి, యమధర్మరాజు, శివుడు ఒకేచోట కొలువై ఉన్న త్రిమూర్తి సాన్నిధ్య వైభవం, వేదపారాయణ సంప్రదాయాలు కలగలిసిన ధర్మపురి క్షేత్రానికి గోదావరి పుష్కరాల చరిత్రలో ఒక ప్రత్యేకమైన, అద్వితీయమైన స్థానం ఉంది.

ధర్మపురి పుష్కరాల ఆధునిక చరిత్రను పరిశీలిస్తే 2003 జూలై 30 నుంచి ఆగస్టు 10 వరకు జరిగిన ఉత్సవాలు ఒక మైలురాయిగా నిలిచాయి. ఆ సమయంలో ధర్మపురి శ్రీమఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణలో గోదావరి నదీ తీరాన అత్యంత వైభవంగా నిర్వహించిన 'శతచండీ సహిత ఋగ్వేద సంహితా యాగం' ఆధ్యాత్మిక లోకాన్ని ఎంతగానో ఆకర్షించింది. విశేషమేమిటంటే, అప్పట్లో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపిస్తున్న అప్పటి టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ యాగానికి రాజకీయాలకతీతంగా పూర్తి అండదండలు అందించారు. పార్టీ నిధుల నుండి లక్షలాది రూపాయల విరాళాన్ని సమకూర్చడమే కాకుండా, పుష్కరాల తొలి రోజే సతీసమేతంగా ధర్మపురి ఘాట్‌లో పవిత్ర స్నానమాచరించారు. ఆ సమయంలో ఆయన "ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలి" అని గోదావరి తల్లికి మొక్కుకోవడం, ఆ తర్వాతి కాలంలో అది సాకారం కావడం గమనార్హం. కాలక్రమంలో ఉద్యమం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ తన పూర్వ సంకల్పాన్ని మరువలేదు. సరిగ్గా 12 ఏళ్లకు, అంటే 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగిన 'గోదావరి మహా పుష్కరాల' (ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే బృహత్తర సంప్రదాయం) సందర్భంగా ఆయన ధర్మపురి క్షేత్రాన్ని ఎంచుకుని ప్రారంభ స్నాన సంకల్పం చేయడం విశేషం. గోదావరి తల్లికి కృతజ్ఞతగా సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నాడు తాము మొక్కుకున్న మొక్కుబడి కింద ఒక అద్భుతమైన స్వర్ణకంకణాన్ని తయారు చేయించి తెచ్చారు. ఆ స్వర్ణకంకణాన్ని దేవస్థాన ఆస్థాన వేదపండితుని హస్తానికి స్వయంగా తొడిగి తన భక్తిని చాటుకున్నారు. ఆ సమయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా ఉన్న కొప్పుల ఈశ్వర్ చొరవతో ధర్మపురి రూపురేఖలు మార్చడానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. స్నానఘట్టాల విస్తరణ, రహదారుల వెడల్పు, తాత్కాలిక వసతులు, పారిశుద్ధ్య ఏర్పాట్లు ముమ్మరంగా సాగాయి.అయితే, భక్తుల సంఖ్య అంచనాలను మించిపోవడంతో 2015 మహా పుష్కరాలు పాలకులకు, అధికారులకు ఒక పెద్ద పరీక్షగా మారాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలోని వివిధ గోదావరి ఘాట్లకు దాదాపు ఐదు కోట్లకు పైగా భక్తులు తరలిరాగా, అందులో అత్యధిక శాతం మంది ధర్మపురి క్షేత్రానికే పోటెత్తారు. ఫలితంగా ధర్మపురి పరిసర ప్రాంతాలలో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయింది. ఎంతలా అంటే, అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ వంటి ప్రముఖులే సాధారణ ప్రజలతో పాటు గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చింది. ఈ సంఘటనలు భవిష్యత్తులో రాబోయే పుష్కరాల కోసం తాత్కాలిక ఏర్పాట్లు సరిపోవని, శాశ్వత మౌలిక వసతుల కల్పన, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికలు ఎంత అత్యవసరమో స్పష్టమైన పాఠాలను నేర్పాయి. ఈ గత అనుభవాలు, సవాళ్ల నేపథ్యంలో గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు అత్యంత వైభవంగా జరగబోయే రాబోయే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటి నుంచే కసరత్తులు ప్రారంభం కావడం శుభపరిణామం. ప్రస్తుత జగిత్యాల జిల్లా పరిధిలోని ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గతంలో ఎదురైన రద్దీ సమస్యలను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలతో ప్రత్యేక నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డికి నివేదించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, అందులో మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను కీలక సభ్యునిగా నియమించింది. దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి, దేవాదాయ కమిషనర్, ఆలయ స్థపతి, ఆగమ సలహాదారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన అధికారుల బృందం ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, ఘాట్ల విస్తరణ, శాశ్వత పార్కింగ్ స్థలాల గుర్తింపు, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై నివేదికలను సిద్ధం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం కేవలం ధర్మపురినే కాకుండా, బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న యావత్ గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఒకే మాలగా అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక పర్యాటక కారిడార్‌గా మార్చాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా బాసర జ్ఞానసరస్వతి ఆలయాన్ని, కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పనులను సమీక్షించారు. శనివారం ధర్మపురి సమీపంలోని గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి ఉప



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# రక్త దానంతో ప్రాణదానం
# ఐక్యతతో జీవితాలకు సురక్ష

కృత్రిమంగా ప్రయోగశాలలో యతయారు చేయలేని అమూల్య జీవన పదార్థం రక్తం. రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్త విధులకు సత్సమానం లేదు. అనుక్షణం జీవ కణజాలానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఒసరఫరా చేస్తూ, వ్యర్థ పదార్థాలను విసర్జించే అమూల్య విధులను నిర్వహిస్తున్న రక్తం జీవితాలకే ఆధారం అవుతున్నది. ఒక వ్యక్తి ప్రమాదాలు, తీవ్ర వ్యాధులు, ప్రసవాలు, రక్త హీనత కలిగిన వ్యక్తులు, ఎముకల మజ్జ లోపాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సందర్భాల్లో రక్తం అందించాల్సి వచ్చినపుడు ఏమీ ఆశించకుండా స్వచ్ఛందం రక్త దాతలు దేవుళ్ల రూపంలో కలిపిస్తారు. రక్తం దానం చేయడంతో ప్రాణాలు నిలబడతాయి, 2026 ప్రపంచ రక్త దాతల దినం ఇతివృత్తంగా "ఒక బిందువు మానవత్వం : రక్త దానం చేద్దాం, ప్రాణాలు కాపాడుకుందాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినం వేదికగా రక్త దాన శిబిరాల నిర్వహణ, రక్త దాతల నిస్వార్థ సేవలను గుర్తించడం, విద్యాలయాల్లో సెమినార్లు లేదా కార్యశాలలు, అవగాహన ర్యాలీలు, సెలబ్రిటీలతో ప్రచారాలు, వీధి నాటికలు, ఫ్లాష్ మాబ్స్, సామాజిక మాధ్యమ ప్రచారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వాలు/ఎన్‌జీఓలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమన్వయం లాంటి అంశాలను నిర్వహించాలి లేదా అవగాహన పరచాలి. ఎవరు, ఎప్పుడు రక్త దానం చేయవచ్చు : రక్తం, ప్లేట్‌లెట్స్ లాంటి ఇతర రక్త ఉత్పత్తుల దాతల కొరత భారత్‌ను పట్టి పీడిస్తున్నది. యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో రక్త కొరత ఏర్పడడం సోచనీయం. 18 నుంచి 65 ఏండ్ల వయస్సు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఎప్పుడైనా రక్తదానం చేయవచ్చు. ప్రతి 3 నెలలకు ఒకసారి పురుషులు, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. రక్తదాత శరీర బరువు 45 కెజీలకు మించి ఉండాలి. రక్తంలో కనీస హిమోగ్లోబిన్ 12.5 గ్రా/డిఎల్ ఉండాలి. రక్తదానం వల్ల దాతకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. దాత శరీరంలో రక్త రాళ్లు (బ్లడ్ స్టోన్స్) ఏర్పడకుండా అడ్డుకోవడం, దాత ఆరోగ్యానికి ఊతం లభించడం, దాత మానసిక సంతృప్తి పెరగడం, ప్రాణ దానం చేశాననే భావనతో సంతృప్తి లభించడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడం, నూతన రక్త కణాలు ఉత్పత్తి కావడం లాంటి ప్రయోజనాలు రక్త దాతలకు కలుగుతాయి.

యువభారతంలో రక్త దాతల కొరత :

ప్రపంచవ్యాప్తంగా సాలీనా దాదాపు 120 మిలియన్ల రక్తదానాలు, భారత్‌లో 11.45 మిలియన్ల రక్త దానాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. భారత్‌లో 13 మిలియన్ల రక్త దానాల అవసరం ఉంది. అనగా, మన భారత్‌లో 12 లక్షల యూనిట్ల రక్త కొరత ఉన్నది. ప్రపంవ్యాప్తంగా 170 దేశాల్లో 12,700 బ్లడ్ బ్యాంకులు పని చేస్తున్నాయి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 1000 మందిలో 33 రక్తదానం చేస్తుండగా, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నలుగురు మాత్రమే రక్త దానానికి ముందుకు వస్తున్నారు. ప్రభుత్వాలు, బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవకులు, ఉన్నత విద్యా సంస్థలు కలిసి ప్రపంచ రక్త దాతల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అవగాహన కల్పించాలి. ఢిల్లీ లాంటి నగరాల్లో అవసరం కన్న అధికంగా రక్త దాతలు, బీహార్ లాంటి రాష్ట్రాల్లో రక్తదాతల తీవ్ర కొరత కనిపిస్తున్నాయి. రక్త దానంతో పాటు అవయవ దానాలు, పార్థివ గేహ దానాలను కూడా ప్రోత్సహించాలి, కొన ఊపిరితో ఉన్న అభాగ్యుల శ్వాసను నిలపాలి.

ప్రతి యువకుడు సాలీనా కనీసం 2 లేదా 3 సార్లు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రోగులకు రక్తం అవసరం అయినపుడు సంబంధిత రక్త గ్రూపు కలిగిన దాతలు ముందుకు రావాలి, మరో ప్రాణం నిలపడానికి వచ్చిన అద్భుత అవకాశాన్ని తీసుకోవాలి. రక్త కొరతతో ప్రాణాలు పోకుండా యువ దాతలు నడుం బిగించాలి. అభాగ్యుల ప్రాణాలు నిలుపడానికి డబ్బు మాత్రమే అవసరం కాదని, నిరుపేద యువకుడు కూడా రక్త దానం చేసిన మరొకరి ప్రాణం నిలుపవచ్చని తెలుసుకోవాలి. అత్యధిక యువత ఉన్న యువ భారతంలో రక్తం కొరత నేటికీ వేధించడం అవమానకరం అని భావిద్దాం, స్వచ్ఛంద రక్త దాతలుగా మారుదాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# భూసార పునరుద్ధరణ తో మానవ మనుగడ

నేలల తీరుతెన్నులే ప్రపంచ ఆహార భద్రత ను నిర్ణయిస్తాయి. భూమి లోని సహజ పోషకాలు వ్యవసాయానికి ఆవరణ వ్యవస్థకు ఉపయోగపడుతాయి. భూసారం సకల జీవ జాతులకు ఆహారం ఆవాసాన్ని అందించి మానవ నాగరికతకు పునాదిగా నిలుస్తుంది.*భూమి ప్రకృతి ప్రసాదితం భూమిని పెంచలేము ఉన్న భూమిని సంరక్షించుకుంటేనే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది. *ఎడారీకరణ* వ్యవసాయ యోగ్యమైన భూమి సారాన్ని కోల్పోవడమే ఎఢారీకరణ అంటారు.

ఎడారులు వేరు ఎడారీకరణ వేరుభూ క్షీణతకు మరొక రూపమే ఎడారీకరణ .మానవుని చర్యలు వాతావరణం మార్పులు కారణంగా భూమి ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోవడాన్ని ఎడారీకరణగా భావిస్తారు. భూమి మనుషులకే కాక సకల జీవ జాతులకు ఆహారాన్ని ఆవాసాన్ని అందించే ఏర్పాటు ప్రకృతి చేసింది.కాలుష్యం అడవుల నరికివేత యుద్ధాలు లాంటివి ఎడారీకరణ కు దారి తీస్తున్నాయి. ఎడారీకరణ వలన భూమి నిస్సారంగా మారుతుంది. ఆహార కొరతనీటి కొరతఏర్పడుతుంది.ఆర్థిక వ్యవస్థలో వలసలు 'పేదరికం' నిరుద్యోగం పెరుగుతుంది. 2026 సం" థీమ్ ప్రపంచ ఎడారీకరణమరియు కరువు నివారణ దినోత్సవం యొక్క ఇతివృత్తం*పచ్చిక బయళ్ళు (మేత భూములు) గుర్తించండి గౌరవించండి పునరుద్ధరించండి*. అనే నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు .2026సం" ప్రపంచ స్థాయి అధికారిక వేడుకలకు కెన్యా దేశం ఆతిథ్యం ఇస్తుంది. దాదాపు ఒక దశాబ్దం తర్వాత ఆఫ్రికా ఖండంలో ఈ వేదికలు జరగడం ప్రథమం.ఈ ఏడు థీమ్ ప్రకారంపచ్చిక బయల్లను పర్యావరణ వ్యవస్థను రక్షించడం .భూమి క్షీణతను( కోతను) నివారించడం . పశువుల పెంపకం దారుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడంపై దృష్టి పెడుతుంది. పర్యావరణ వేత్తలు ఆందోళనభూమిపై జనాభా రోజురోజుకు పెరుగుతోంది .పెరుగుతున్న జనం అవసరాలు తీర్చడానికి ప్రకృతి ప్రసాదించిన నిర్మిత భూ భాగంలోనే అధిక ఉత్పత్తి చేపట్టాలి .దీనికోసం భూమి శాస్త్రీయ పరిశోధనలు ఫలితాలు ఉపయోగించిఅధిక దిగిబడుల కోసం రసాయనిక ఎరువులు క్రిమి సంహారక మందులు జలవనరుల వినియోగం ప్రకృతి భరించలేని స్థాయిలో పెంచుకుంటు పోతున్నాం. 2014 సంవత్సరంలో150 కోట్ల హెక్టార్ల అటవీ భూములను చిత్తడి నేలలను పంట భూములుగా మార్చివేశాం 2050 సంవత్సరం నాటి కి భూవిస్తీర్ణం 10 శాతం వరకు పడిపోతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*భూమి నిర్జీవమై ఎడారిగా మారుతుంది* అడవులను చిత్తడి నేలను తోటలుగా' వ్యవసాయ భూములుగా మార్చడం వలన పొలాలు క్రమంగా భూసారాన్ని జీవాన్ని కోల్పోయి వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. పంటలు నిర్జీవమై భూమి ఎడారిగా మారిపోతుంది.*ఎడారీకరణ కారణాలు*జల వనరుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం. జీవ భౌతిక 'ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడం వలన భూమి ఉత్పాదకత తగ్గి ఎడారీకరణ సంభవిస్తుంది. సహజంగా భూసారాన్ని పెంచే వాన పాములు తేనే టీగలు వంటి పంట సహాయకారులు చనిపోతున్నాయి.వరదల సమయంలో భూమి పై సారవంతమైన మట్టి కొట్టుకుపోవడం చేత ఎడారీకరణ పెరుగుతుంది.*పట్టణీకరణ పారిశ్రామికీకరణనేడు ప్రపంచ వ్యాప్తంగా పట్టణీకరణ 'పారిశ్రామికీకరణ వేగంగా పెరుగుతుంది. ఇది భూమి క్షీణతకు దోహదపడుతుంది.భూమి క్రమంగా ఎడారిగా మారుతుందని భూతాపం పెరిగి భూమి ఉత్పాదక సామర్థ్యం దెబ్బతిని కరువు' కాటకాలు ఆకలి'చావులు సంభవిస్తున్నాయని పలు సామాజిక ఆర్థిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.*ఎడారీకరణ _ ప్రపంచ దేశాలకు సమస్య*ఎడారీకరణ సమస్య ప్రపంచ దేశాలకు పెద్ద సవాల్ గా పరిణమించింది. మానవుని స్వార్థ పూరిత చర్యలు తప్పిదాలు ప్రకృతి 'వాతావరణ మార్పులు ప్రకృతి విపత్తుల వల్ల భూమి ఉత్పాదకత తగ్గి ఎడారీకరణ పెరిగే ప్రమాదం వుంది. ఈ పరిస్తితి ఇలాగే కొనసాగితే విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని 'ఐ'రా'స హెచ్చరించింది.*యూ' ఎన్:సీ'సీ'డీ అంచనాలుఐ'రా'సకు చెందిన యూ'ఎన్సిసి:సీ'డీఅంచనాల ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములను వ్యవసాయం కొరకు వినియోగించడం నేల' నీరు ' సంరక్షణ చర్యలు ఆశించనంతగ లేకపోవడం పరిమితికి మించి సాగు చేయడం నీటి యాజమాన్యం సక్రమంగా లేకపోవడం భూగర్భ జలాల అపరిమిత వినియోగం ఏడారీకరణకు కారణాలని పేర్కొంది. ఈ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్ ప్రజలను ప్రభావితం చేస్తుంది.ప్రపంచం లో వ్యవసాయం కోసం ఉపయోగించే పొడి భూముల్లో 70 శాతం వివిధ కారణాలతో అంతరించి పోతున్నాయి. ఆఫ్రికా ఖండంలో భూమి ఎడారిగా మారడం వల్ల గత 5 ఏళ్ల లో 60 మిలియన్ల మంది ప్రజలు వలస వెళ్లుతున్నారు.*భారత దేశం భూమి క్షీణతభారత దేశం భౌగోళిక ప్రాంతం 328 మిలియన్ల హెక్టార్ల లో దాదాపు 97.85మిలియను హెక్టార్ల(29.7 శాతం) భూమి క్షీణతకు గురైంది.రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో28 రాష్ట్రాలలో భూమి ఎడారీకరణ అయ్యింది . ఇందులో 23.79 శాతంరాజస్థాన్ 'మహరాష్ట్ర 'గుజరాత్ కర్ణాటక' ఒడిషా' మధ్యప్రదేశ్ తెలంగాణలో ఎక్కువగా వుంది.రోడ్లు' భవనాలు నిర్మాణం 'గనుల తవ్వకం వల్ల వ్యవసాయం చెట్ల పెంపకానికి భూమి లభ్యత తగ్గిపోతుంది . ఎడారీకరణ మరింత పెరిగిందని ఐ'రా'స తమ నివేదికలో తెలిపింది.*ఆహార భద్రతకు ముప్పు* ఎఢారీకరణ జరగడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార సమస్య ఏర్పడి వ్యాధులతో మరణించే వారికంటే ఎక్కువ సంఖ్యలో కరువుతో మరణించే ప్రమాదం వుందని హెచ్చరించింది. కరువు వల్ల మృత్యు వాత పడిన.వారి సంఖ్య అధికంగా వుంది.ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 200 కోట్ల హెక్టార్ల భూమి సారాన్ని కోల్పోయింది . ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 360 కోట్ల హెక్టార్ల భూమి ఎడారీకరణ ప్రభావానికి గురైంది 3 వంతు భూమి ఎడారీకరణ ప్రమాదంలో వుంది.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే 10 సం"ల లో మనుషులకు ఆహారం పంటలు పండించదానికి అదనంగా,30 కోట్ల హెక్టార్ల భూమి అవసరం పడుతుందని అంచనా. భూ క్షయం వల్ల 2010 లో ప్రపంచ స్థూల ఉత్పత్తి 10 శాతం తగ్గిందని ఆర్థిక సర్వేలు తెలుపుతున్నాయి.*అంతరిక్ష పరిశోధనా సంస్థ అంచనా* ప్రకారం 29.32 శాతం భూమి క్షయానికి గురైనట్లు గుర్తించింది. దేశములో 28 రాష్ట్రాలలో భూమి క్షీణత పెద్ద ఎత్తున కొనసాగుతుంది.ఎడారీకరణ పెరిగిపోతుందని ఐ'సి'ఎ'ఆర్ సంస్థ అధ్యయనం ప్రకారం 2013 నాటికి ఎ 'పి 14.35 శాతం తెలంగాణ 31.4 శాతం 'కర్ణాటక 36.24 శాతం భూ భాగం ఎడారీకరణ ముప్పులో ఉన్నట్లు తెలిసింది. ఎ 'పి లోని అనంతరం తెలంగాణ లో నల్లగొండ జిల్లాలో అత్యధిక ఎడారీకరణ జరుగుతున్నట్లు అంచనాలు వున్నాయి.

*ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టాలిప్రభుత్వాలు 'ప్రజలు ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టాలి. మానవుడు తన స్వార్థం కోసం సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. సహజ వనరుల విధ్వంసాన్ని అరికట్టాలి .అనేక ప్రకృతివిపత్తులుసంభవిస్తున్నాయి.*ఎడారీకరణపై అవగాహన*ప్రపంచ దేశాల ప్రభుత్వాలు కరువు ఎడారీకరణ అంశాలపట్ల ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించడానికి ఐ'రా'స 1994 జూన్ 17 వ తేదీ నుండి ఎడారీకరణ కరువు నివారణ దినోత్సవం సుస్థిరాభివృద్ధి సుస్థిరాభివృది లక్ష్యంగా అన్ని దేశాలు భూక్షీణత తటస్తీకరణతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎడారీకరణ నివారణ సమగ్ర చర్యలు* కేంద్ర 'రాష్ట్ర 'స్థానిక ప్రభుత్వాలు 'పౌర సమాజం సమిష్టిగా ఆరోగ్యకరమైన భూమిని నిర్మించాలి.

1)నిరుపయోగ భూములను తిరిగి శశ్య శ్యామలం చెయ్యాలి.

నేదునూరి కనకయ్య
9440245771



# జాతీయం-అంతర్జాతీయం



## జులై 14

**రాహుల్ గాంధీ కీలక కార్యాచరణ**
**నీట్ లీకేజీపై కేంద్రంపై యుద్ధం విద్యార్థులు, మేధావులు, నిపుణులు ఒకే తాటిపైకి**



**న్యూఢిల్లీ, జూన్ 13 (ఎ.ఎం.ఎస్):** నీట్ పేపర్ లీకేజీ, సెంట్రల్ బోర్డు పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు తదితర సంఘటనలపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కీలక కార్యాచరణ చేపట్టారు. పరీక్షల కుంభకోణాలు అనే పేరుతో దేశవ్యాప్తంగా విద్యార్థులతో సదస్సులు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల లీకేజీల వల్ల నష్టపోయిన లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగ అభ్యర్థులు, విద్యావేత్తలు, యువజన సంఘాలను ఒకే తాటిపైకి తీసుకురావడమే ఈ దేశవ్యాప్త ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన స్పష్టం చేశారు.ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, స్థానిక కాంగ్రెస్ కమిటీలు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కోచింగ్ సెంటర్లు, పాఠశాలల్లో విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమవుతాయని వివరించారు. నీట్ పరీక్షల వికేంద్రీకరణ, పరీక్షల ఫీజుల రద్దు, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లను ఈ సదస్సుల ద్వారా వీధుల్లోకి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

షెడ్యూల్ ఇదే...
రాహుల్ గాంధీ నిర్వహించబోయే ఈ భారీ విద్యార్థి సదస్సుల షెడ్యూల్‌ను కేసీ వేణుగోపాల్ అధికారికంగా విడుదల చేశారు.జూన్ 17: కోచింగ్ హబ్‌గా పేరుగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో మొదటి భారీ సదస్సు ప్రారంభం కానుంది.జూలై 10: ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్) లో రెండవ సదస్సు జరుగుతుంది.
జూలై 11: బీహార్ రాజధాని పాట్నాలో మూడవ విద్యార్థి మహాసభను నిర్వహిస్తారు.జూలై 14: దేశ రాజధాని న్యూఢిల్లీలో ముగింపు సదస్సు భారీ ఎత్తున జరగనుంది.

# అఖండ కాంగ్రెస్..

## కల సాకారమయ్యేనా...?

**మళ్లీ హస్తం పార్టీలోకి దీదీ, శరద్ పవార్...?**
**రప్పించేందుకు కాంగ్రెస్ అగ్రనేతల యత్నాలు**

**న్యూఢిల్లీ, జూన్ 13 : (ఎ.ఎం.ఎస్)** : మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ , శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీఎస్.పీ) తిరిగి కాంగ్రెస్‌లో విలీనం కానున్నాయా? ప్రస్తుతం టీఎంసీలో నెలకున్న అంతర్గత సంక్షోభం నేపథ్యంలో గతంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకున్న నాయకులు మళ్లీ సొంతగూటికి చేరుకోడానికి ప్రణాళికలు రచిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, ఈ ప్రచారాన్ని అటు కాంగ్రెస్, ఇటు టీఎంసీలు ఖండించాయి. తృణమూల్ విలీనంపై వార్తలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఖండించారు. ఎలాంటి ఆధారాల్లేని పుకార్లని ఆయన కొట్టిపారేసినప్పటికీ మహారాష్ట్రకు చెందిన సీనియర్ నేత నానా పటోలే మాత్రం ఆ దిశగా అడుగులు పడుతున్నట్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

సారూప్యత కలిగిన పార్టీలు కాంగ్రెస్‌లో విలీనానికి సిద్ధమవుతున్నాయని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్‌లో విలీనం కావడానికి మమతా బెనర్జీ, శరద్ పవార్‌లు తమ మనసులను సిద్ధం చేసుకుంటున్నారు'' అన్నారు. ఇది కేవలం పొత్తు కాదు కానీ, విలీనం అని ఆయన నొక్కిచెప్పారు. ఎన్సీపీఎస్పీ విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలను శరద్ పవార్ ఇప్పటికే ఇచ్చారని, ఆ ప్రక్రియ ప్రస్తుతం నడుస్తోందని ఆయన చెప్పారు. "శరద్ పవార్ ముందే ప్రతిపాదన తెచ్చారు.. కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగింది..దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే... లౌకిక, బహుళత్వ సిద్ధాంతాలు కలిగిన పార్టీలన్నీ ఓట్ల చీలికను అడ్డుకోడానికి ఏకం కావాలని నేను భావిస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు.



ఇక, శివసేన (యూబీటీ) సీనియర్ నేత సంజయ్ రౌత్ సైతం రెండు రోజుల కిందట ఇటువంటి వ్యాఖ్యలే చేయడం విశేషం. కాంగ్రెస్ నుంచి విడిపోయి ఏర్పడిన చిన్న పార్టీలను తిరిగి విలీనం చేసే విషయంలో శరద్ పవార్ 'ముందుండి నడిపించాలని' సంజయ్ రౌత్ కోరారు. "కాంగ్రెస్ బలంగా ఉండాలి, దాని నుంచి పుట్టిన చిన్న పార్టీల నాయకులు పరిస్థితిని అర్థం చేసుకోవాలి'' అని రౌత్ అన్నారు.దీనిపై శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే స్పందిస్తూ 'మంచి ప్రతిపాదన' అని, ఆ తర్వాత ఏం జరుగుతుందో కాలమే చెబుతుందని అన్నారు. రౌత్ ప్రతిపాదనను తిరస్కరించకుండా "ముందు వర్షం పడనీ, అప్పుడు గొడుగు తీసుకోవాలో, రెయిన్‌కోట్ తీసుకోవాలో చూద్దాం'' అని ఆమె నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఇక, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ కూడా సంజయ్ రౌత్ చెప్పినట్టు చిన్న పార్టీలు కాంగ్రెస్‌లో విలీనమై రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. "సంజయ్ రౌత్ చెప్పిన దాంట్లో సారం ఉంది. సమయం ఆసన్నమైంది. కాంగ్రెస్ నుంచి విడిపోయి ప్రాంతీయ పార్టీలుగా మారిన పార్టీలన్నీ తిరిగి కలవాలి, రాహుల్ గాంధీని తమ నాయకుడిగా మనస్ఫూర్తిగా అంగీకరించాలి'' అని గెహ్లాట్ అన్నారు. "ఇండియా కూటమికి నాయకుడు రాహుల్ గాంధీ అనే సందేశం దేశవ్యాప్తంగా వెళ్లాలి. ఈ సందేశం స్పష్టంగా ఉండాలి. అప్పుడు ప్రజలు మిమ్మల్ని గెలిపిస్తారు. ఒకవైపు నరేంద్ర మోదీ, మరోవైపు రాహుల్ గాంధీ ఉన్నారని వారు చూస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాహుల్ గాంధీని తమ నాయకుడిగా అంగీకరించాయనే స్పష్టమైన సందేశం వెళితే, దేశంలో ఓటింగ్ సరళి మారడాన్ని మీరు చూస్తారు'' అని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శరద్ పవార్, మమతా బెనర్జీలు కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లి సొంతంగా రాజకీయ పార్టీలను ఏర్పాటుచేశారు
. కాంగ్రెస్‌తో విభేదించి 98లో తృణమూల్ కాంగ్రెస్‌ను మమతా బెనర్జీ, 99లో నేషనలిస్ట్ కాంగ్రెస్‌ను శరద్ పవార్ స్థాపించారు. సోనియా గాంధీ 'విదేశీయత అంశం' లేవనెత్తడంతో పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్‌లను కాంగ్రెస్ బహిష్కరించింది. ఈ ముగ్గురూ కలిసి ఎన్సీపీని ఏర్పాటుచేయగా.. కొన్నాళ్ల తర్వాత తారిఖ్ అన్వర్ సొంతగూటికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన ఎంపీగా ఉన్నారు. ప్రస్తుతం టీఎంసీ మాదిరిగానే 2023లో ఎన్సీపీ సంక్షోభం ఎదుర్కొంది. శరద్ పవార్ సోదరుడి కుమారుడు అజిత్ పవార్ నాయకత్వంలో తిరుగుబాటు చేయడంతో పార్టీ చీలిపోయింది. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతుతో పార్టీ పేరు, గుర్తును అజిత్ వర్గం దక్కించుకుంది.

ఆ తర్వాత మహారాష్ట్ర, జాతీయ స్థాయిలో బీజేపీశివసేన కూటమితో జతకట్టారు. ఈ వారం ఆరంభంలో కాంగ్రెస్, టీఎంసీ నాయకుల మధ్య వరుసగా జరిగిన భేటీలు ఈ విలీన పుకార్లకు మరింత ఆజ్యం పోశాయి. మంగళవారం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీతో భేటీ కాగా, మర్నాడు దీదీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో తృణమూల్ కాంగ్రెస్ బలమైన కూటమిని కోరుకుంటోందని, ప్రతిపక్ష కూటమిలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని తాము అంగీకరిస్తున్నామని అభిషేక్ బెనర్జీ చెప్పినట్టు సమాచారం. అయితే, విలీనానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదన అయినా టీఎంసీ నుంచే రావాలని
తాము మాత్రం ఈ విషయంలో ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది.



# వాయుసేన విమానం ఏఎన్-32కు ప్రమాదం

**రంగంలోకి రెస్క్యూ టీమ్‌లు**
**గౌహతి,వుదయం డెస్క్,**
అస్సాంలోని జోర్హాట్ ఎయిర్‌బేస్‌లో శనివారం భారతీయ వాయుసేన ఐఏఎఫ్ కు చెందిన ఏఎన్32 (AN 32) రవాణా విమానం ప్రమాదానికి గురైంది. సైనిక స్థావరం లోపల రన్‌వేపై విమానం ల్యాండ్ అయిన వెంటనే ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్‌బేస్ సిబ్బంది అత్యవసర సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంపై భారతీయ వాయుసేన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "జోర్హాట్‌లో ఈరోజు ఐఏఎఫ్‌కు చెందిన AN32 విమానం ప్రమాదానికి గురైంది. మరిన్ని వివరాలు త్వరలోనే తెలియచేస్తామని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర రెస్క్యూ టీమ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని రంగంలోకి దిగాయి. ఈశాన్య రాష్ట్రాల్లో భారత వాయుసేనకు చెందిన అతిముఖ్యమైన స్థావరాలలో రౌరియా ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఒకటి. అస్సాంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వైమానిక కార్యకలాపాలు నిర్వహించడంలో ఇది అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది.


# అయ్యో.. స్మృతి...?

- **కేంద్ర మాజీ మంత్రి ఇరానీ ఓటు గల్లంతు**

**న్యూఢిల్లీ, జూన్ 13 : (ఎ.ఎం.ఎస్):** కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత స్మృతి ఇరానీ ఓటు గల్లంతయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా మైదాన్ మైవా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో నుంచి ఆమె ఓటును తొలగించడం కలకలం రేపింది. ఈ ఘటన సంచలనంగా మారడంతో అధికారులు స్పందించి, విచారణకు ఆదేశించారు. అయితే అదే ప్రాంతానికి సంబంధించిన లోక్‌సభ, అసెంబ్లీ ఓటర్ల జాబితాల్లో మాత్రం ఆమె పేరు ఉన్నట్లుగా తెలిపారు. కాగా, జూన్



10వ తేదీన విడుదలైన పంచాయతీ ఓటర్ల జాబితాలో మాత్రం స్మృతి ఇరానీ పేరు లేదు. ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చి సంచనలంగా మారడంతో జిల్లా మెజిస్ట్రేట్ సంజయ్ చౌహాన్ స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. విచారణకు సంబంధించిన నివేదిక వచ్చిన తర్వాతే ఓటు తొలగింపుపై స్పష్టత వస్తుందని తెలిపారు.




# మూడేండ్లుగా కోమాలోనే..
# థాయిలాండ్ యువరాణి కన్నుమూత

థాయిలాండ్, జూన్ 13 : మూడేళ్లుగా కోమాలో ఉన్న థాయిలాండ్ యువరాణి బజ్రకితియాబా (47) కన్నుమూశారు. డిసెంబర్ 2022లో ఆమె స్పృహ కోల్పోయారు.
గుండె పనితీరు రెగ్యులర్‌గా లేని కారణంగా ఆమె గుండె కండరాలకు మైక్రోప్లాస్మా ఇన్‌ఫెక్షన్ అయ్యింది. రాజు వజిరలాంగ్‌కార్న్ పెద్ద కుమార్తె అయిన ఆమె, లాయర్‌గా శిక్షణ పొంది, అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించారు. ఆస్ట్రియాకు రాయబారిగా పని చేశారు. 2021లో ఆమెకు జనరల్ హోదా లభించింది. ఆమె మృతి పట్ల థాయిలాండ్ రాచకుటుంబం తీవ్ర సంతాపం ప్రకటించింది.

# పెరుగుతున్న నిరసనలు

**ఊపందుకుంటున్న ఉద్యమాలు**
**పలు దేశాల్లో జెన్ జెడ్ పోరాటాలు**
**ప్రభుత్వ వైఫల్యాలపై ఆగ్రహం**

**జకార్తా, జూన్ 13 :** నేపాల్, శ్రీలంక తో పాటు పలు దేశాల్లోనూ జెన్ జెడ్ ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. తాజాగా ఇండోనేషియా రాజధాని జకార్తాలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఇంధనం , ఆహార ధరలను తగ్గించాలని గళమెత్తారు. ఖరీదైన ప్రభుత్వ వ్యయ కార్యక్రమాలను వెనక్కి తీసుకోవాలని అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను కోరుతూ జకార్తాలో శుక్రవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్ అనంతరం, నిరసనకారులు నగరంలోని ఒక ముఖ్య ప్రదేశమైన హోటల్ ఇండోనేషియా ట్రాఫిక్ సర్కిల్ వైపు కవాతు చేయడానికి ప్రయత్నించారు. అధికారులు వారిలో చాలా మందిని అడ్డుకున్నారు . అధ్యక్ష భవనానికి దారితీసే వీధులను కూడా మూసివేశారు. అక్కడ ఆరు గురికి పైగా పోలీసులు , సైనికులను మోహరించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి పెరిగిన ఇంధన ధరల ఫలితంగా జీవన వ్యయాలు పెరిగాయని నిరసనకారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. వారిలో చాలామంది పసుపు రంగు యూనివర్సిటీ జాకెట్లు ధరించారు.



ప్రభుత్వ వ్యయాలలో వృథాగా కోతలు, ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడం, ఉచిత పౌష్టికాహార పథకం , గ్రామీణ ప్రాంతాల పునరుజ్జీవన ప్రణాళిక వంటి ప్రధాన ప్రభుత్వ కార్యక్రమాలను నిలిపివేయడం వంటి ఐదు కీలక డిమాండ్లను నిరసనకారులు వివరించారు. ఈ ఒక్క సంవత్సరంలోనే సుమారు 268 ట్రిలియన్ రూపియాలు (15 బిలియన్ డాలర్లు) ఖర్చయ్యే ఈ ఉచిత భోజన కార్యక్రమం, పేదరికం , పోషకాహార లోపాన్ని తగ్గించే లక్ష్యంతో ఉంది. అయితే, భారీ అవినీతి విచారణ నేపథ్యంలో ప్రబోవో ఇటీవల ఈ కార్యక్రమ అధిపతిని తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం అంగీకరించడం లేదు " అని ర్యాలీని నిర్వహించిన విద్యార్థి సంఘానికి అధ్యక్షత వహిస్తున్న యటలాతోఫ్ మాషుమ్ ఇమావాన్ అన్నారు. "ప్రబోవో తన తప్పును ఒప్పుకుని, దానిని కాదనడం మానేసే ధైర్యం చేయాలని మేము కోరుతున్నాం." అని యువ నేతలు తెలిపారు. గత ఆగస్టులో దేశవ్యాప్త నిరసనలు చెలరేగి, వేలాది మంది వీధుల్లోకి రావడం, భద్రతా దళాలతో జరిగిన ఘర్షణల్లో కనీసం 13 మంది మరణించిన విషయం విదితమే. అతిపెద్ద విద్యార్థి సమీకరణలలో శుక్రవారం నాటి ప్రదర్శన ఒకటి. అని విద్యార్థి సంఘాలు తెలిపాయి. ఇలాంటి నిరసనలు పశ్చిమ జావాలోని బండంగ్ నగరంలో, బోర్నియో ద్వీపంలోని పొంటియానాక్ నగరంలో కూడా జరిగాయి.

# శాంతి చర్చలు ఫలితం ఇచ్చేనా..?
# కీలకాంశాలపై ఇరాన్ ఆందోళన




**నిబంధనలు అమలు చేయకపోతే సంతకం చేసేది లేదని స్పష్టీకరణ**

**టెహ్రాన్, జూన్ 13 :** పశ్చిమాసియాలో ప్రత్యక్ష యుద్ధానికి తెరపడి..మరోమారు ఇరాన్అమెరికాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. శాంతి చర్చలపై ఇరుదేశాల మధ్య సందిగ్ధం నెలకొంది. శాంతి ఒప్పందంపై ట్రంప్ ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని,ఇరాన్ అభిప్రాయాలకు ప్రతికూలంగా ఉందని, కీలక అంశాలైన హర్మూజ్ టోల్ ఫీజు, యుద్ధం కారణంగా ఆర్థిక నష్ట పరిహారం తదితర అంశాలపై సరైన వివరణలేదని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఈ ఒప్పందం రెండు దశలతో కూడుకున్నదని, మొదటి దశలో అణు అంశంపై చర్చ జరగలేదని, దానిని రెండో దశకు వాయిదా వేశారని ఇరానియన్ ఫారిన్ మినిస్టర్ అబ్బాస్ అరఘ్చి తెలిపారు. అవగాహన ఒప్పందంలోని నిబంధనలను అమలు చేయకపోతే, తుది ఒప్పందంపై సంతకాలు జరగవని ఆయన స్పష్టం చేశారు. "అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలన్నదే ఈ ఒప్పందంలో పేర్కొన్న మొదటి అంశం,. "అంతర్జాతీయ చట్టం ప్రకారం హార్ముజ్ జలసంధి వద్ద 'టోల్' (సుంకం) వసూలు చేయడం సాధ్యం కాదు, కానీ సేవా రుసుములను మాత్రం వసూలు చేస్తారు. ఇరాన్‌కు పరిహారం చెల్లించే ప్రణాళిక కూడా ఉంది.' అని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ట్రంప్ మాత్రం అంత సిద్ధంగా ఉంది ఇరాన్ సంతకాలు చేయడమే ఆలస్యమని మీడియా ముందు ఆర్భాటం చేస్తున్నారు. శుద్ధి చేసిన యురేనియం అమెరికాకు చెందాలని ట్రంప్ మొండిపట్టుకుదిగుతున్నారని అంతర్జాతీయ మీడియాలు వార్తలు వెలువరించాయి.
ఈక్రమంలోనే రెండు దేశాల మధ్య శాంతి చర్చలకు ఆలస్యమైతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**శాంతి చర్చలపై ఇరుదేశాల మధ్య సందిగ్ధం నెలకొంది. శాంతి ఒప్పందంపై ట్రంప్ ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని,ఇరాన్ అభిప్రాయాలకు ప్రతికూలంగా ఉందని, కీలక అంశాలైన హర్మూజ్ టోల్ ఫీజు, యుద్ధం కారణంగా ఆర్థిక నష్టపరిహారం తదితర అంశాలపై సరైన వివరణలేదని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేస్తుంది. అవగాహన ఒప్పందంలోని నిబంధనలను అమలు చేయకపోతే, తుది ఒప్పందంపై సంతకాలు జరగవని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు ట్రంప్ మాత్రం అంత సిద్దంగా ఉంది ఇరాన్ సంతకాలు చేయడమే ఆలస్యమని మీడియా ముందు ఆర్భాటం చేస్తున్నారు. అంతర్జాతీయ మీడియాలు వార్తలు వెలువరించాయి.**


# అద్భుతం సృష్టించిన జయశ్రీ ఉల్లాల్

**ఫోర్బ్స్ జాబితాలో దక్కిన అత్యున్నత స్థానం**
**56,700 కోట్లకు పైగా సంపదతో నెంబర్‌వన్ పొజిషన్**



**న్యూయార్క్ , జూన్ 13:** ప్రపంచ సాంకేతిక రంగాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాసిస్తున్న వేళ.. అమెరికా ఐటీ కారిడార్ సిలికాన్ వ్యాలీలో ఒక భారత సంతతి మహిళ ఎవరూ ఊహించని అద్భుతాన్ని సృష్టించారు. ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్.. అగ్రరాజ్యంలో సరికొత్త రికార్డుని నెలకొల్పారు. 2026 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ ప్రకటించిన అమెరికాస్ రిచెస్ట్ సెల్ఫ్ మేడ్ విమెన్ (సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్న మహిళలు) జాబితాలో ఆమె అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక లిస్ట్‌లో నిలిచిన ఏకైక భారత సంతతి మహిళ జయశ్రీ కావడం విశేషం. ఫోర్బ్స్ జాబితా తాజా వివరాల ప్రకారం.. జయశ్రీ ఉల్లాల్ నికర ఆస్తి విలువ ఏకంగా 6.8 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 56,700 కోట్లకు పైగా)గా ఉంది. ఈ భారీ సంపదతో ఆమె ఫోర్బ్స్ వార్షిక జాబితాలో ఏడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత రియల్ టైమ్ మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తి 6.5 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ.. ప్రపంచ బిలియనీర్ల సరసన ఆమె అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నెట్‌వర్కింగ్, సెమీ కండక్టర్ రంగాలలో ఆమె మూడు దశాబ్దాలుగా అందించిన అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది. 2008 నుంచి ఆమె సారథ్యం వహిస్తున్న అరిస్టా నెట్‌వర్క్స్ సాధించిన విజయాలే ఆమెను ఈ స్థాయికి చేర్చాయి.
. . ఆ తర్వాత ప్రముఖ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్‌లో చేరి దాదాపు 15 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించారు. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వేగంగా విస్తరిస్తున్న కాలంలో సిస్కో నెట్‌వర్కింగ్ వ్యాపారాన్ని విస్తరించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అయితే 2008లో ఆమె తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అప్పటికే స్థిరపడిన సిస్కో లాంటి దిగ్గజ సంస్థను వదిలిపెట్టి.. కేవలం 50 మంది కంటే తక్కువ ఉద్యోగులు ఉండి, ఎలాంటి ఆదాయం లేని 'అరిస్టా నెట్‌వర్క్స్' అనే చిన్న స్టార్టప్ కంపెనీకి సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. భవిష్యత్తు అంతా క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెంటర్లదేనని ఆమె బలంగా నమ్మగా.. ఆ నమ్మకమే ఆమె జీవితాన్ని మార్చేసింది.

జయశ్రీ వ్యూహాత్మక నాయకత్వంలో అరిస్టా నెట్‌వర్క్స్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో తిరుగులేని శక్తులలో ఒకటిగా ఎదిగింది. పెద్ద ఎత్తున డేటా సెంటర్లు, ఏఐ వర్క్‌లోడ్‌లను నిర్వహించేలా హైపెర్ఫార్మెన్స్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్‌ను ఈ సంస్థ అభివృద్ధి చేసింది. 2014లో ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వెళ్లింది. 2024 నాటికి ఈ కంపెనీ ఏకంగా 9 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 75,000 కోట్లు) వార్షిక ఆదాయాన్ని ఆర్జించింది. ఇది మునుపటి ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి రేటు కావడం గమనార్హం
. ప్రస్తుతం అరిస్టా సంస్థలో జయశ్రీకి 3 శాతం వాటా ఉంది. దీంతో పాటు ఆమె ప్రముఖ క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ సేవలు అందిస్తున్నారు.



# ఎనిమిది మంది దుర్మరణం

**ఎనిమిది మంది దుర్మరణం -16 మందికి గాయాలు**

**ఖాట్మాండు, జూన్ 13:** నేపాల్ కవ్రేపలాంచోక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బనేపా నుంచి రోషి గ్రామీణ మున్సిపాలిటీ వైపు వెళ్తున్న ప్రయాణికుల బస్సు నమోబుద్ధ మున్సిపాలిటీ పరిధిలోని సెల్ఫీ డాండా ప్రాంతంలో అదుపుతప్పి సుమారు 300 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది.ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 16 మంది తీవ్రంగా గాయాలు కాగా.. వాళ్లలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే.. నేపాల్ సైన్యం, పోలీసులు, సాయుధ పోలీసు బలగాలు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. లోయలో పడిపోయిన బస్సు నుంచి క్షతగాత్రులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.
జిల్లా పోలీసు కార్యాలయం వివరాల ప్రకారం.. ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో కొందరిని గుర్తించగా.. మరికొందరి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.
గాయపడిన 16 మందిని ధులిఖేల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

# ఒకే వారంలో రెండుసార్లు అదృష్టం

**కెనడా మహిళకు జాక్‌పాట్ -లాటరీలో కోట్లాది రూపాయలు దక్కిన వైనం**

**కెనడా, జూన్ 13 :** సాధారణంగా జీవితంలో ఒక్కసారైనా అదృష్టం వరిస్తే చాలని చాలా మంది కోరుకుంటారు. అలాంటిది ఒకే ఒక్క వారంలో.. రెండు లాలరీ టిక్కెట్లు గెల్చుకుని కోట్లాది రూపాయలు సొంతం చేసుకుంటే ఏమనాలి. నక్కతోక తొక్కారని అనాలా, అదృష్ట దేవత వారి ఇంట్లోనే ఉందని అనాలా. ఏం అంటే ఏముందిలే.. రెండు సార్లు లాటరీ టిక్కెట్ గెల్చుకుని కోట్లాది రూపాయలు గెల్చుకున్న ఆ లక్కీ లేడీ ఎవరు, ఆమె కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి. కెనడాలోని ఒంటారియో స్టేట్ మిస్సిసాగ నగరానికి చెందిన ట్రాంగ్ ఫామ్ అనే మహిళకు ఈ అసాధారణ అదృష్టం దక్కింది. గత ఏడాది ఆమె తన ఆఫీసులోని నలుగురు సహోద్యోగులతో కలిసి ఒక లాటరీ టికెట్‌ను కొనుగోలు చేశారు. అందరినీ ఆశ్చర్య పరుస్తూ ఆ టికెట్‌కు ఏకంగా 60 మిలియన్ల కెనెడియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ.407 కోట్లకు పైగా) బంపర్ జాక్‌పాట్ తగిలింది. నిబంధనల ప్రకారం లభించిన ఆ భారీ మొత్తాన్ని ట్రాంగ్ ఫామ్‌తో సహా ఆ ఐదుగురు స్నేహితులూ సమానంగా పంచుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆమె కోటీశ్వరురాలైపోయారు.
మొదటి లాటరీ విజయం తెచ్చిన ఆనందం నుంచి ఇంకా పూర్తిగా బయటపడక ముందే.. ట్రాంగ్ ఫామ్‌ను మరో అదృష్టం వరించింది. తొలి జాక్‌పాట్ వచ్చిన కేవలం ఒకే ఒక్క వారం వ్యవధిలోనే ఆమె 'స్క్రాచ్ కార్డ్' అనే ఇంకొక లాటరీని కొనుగోలు చేశారు. నమ్మశక్యం కాని విధంగా ఈ రెండో ప్రయత్నంలోనూ ఆమెకు భారీ ప్రైజ్ మనీ దక్కింది. ఈ స్క్రాచ్ కార్డ్ లాటరీ ద్వారా ఆమె అదనంగా మరో 2,50,000 కెనడియన్ డాలర్లను (భారత కరెన్సీలో రూ.1.60 కోట్లకు పైగా) గెలుచుకున్నారు. అయితే ఈ రెండో లాటరీని ఆమె తన స్నేహితులతో కలిసి కొన్నారా లేదా ఒంటరిగా కొనుగోలు చేశారా అనే వివరాలు మాత్రం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సాధారణంగా ఒక మనిషి జీవిత కాలంలో ఒక్కసారి లాటరీ తగలడం అనేది చాలా అరుదైన విషయం. అలాంటిది కేవలం ఏడు రోజుల వ్యవధిలోనే ఒకే వ్యక్తికి రెండుసార్లు భారీ మొత్తంలో జాక్‌పాట్లు రావడం కెనడా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఇలా జరగడం దాదాపు అసాధ్యమని లాటరీ రంగానికి చెందిన పలువురు నిపుణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో.. నెటిజన్లు ట్రాంగ్ ఫామ్‌ను లక్కీ లేడీ అంటూ అభివర్ణిస్తున్నారు. అదృష్టం గట్టిగా ఉండి లక్ష్మీ దేవి తలుపు తడితే ఇలాగే ఉంటుందని కామెంట్లు చేస్తున్నారు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## చిత్రలేఖన పోటీల్లో 'సెయింట్ పీటర్స్' విద్యార్థుల ప్రతిభ!

**జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం!**

**జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో సెయింట్ పీటర్స్ స్కూల్‌కు ప్రథమ, ద్వితీయ బహుమతులు**





**హనుమకొండ టౌన్, జూన్ 13 (వుదయం ప్రతినిధి) :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలలో హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుతప్రతిభ కనబరిచారు. జూనియర్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీలలో సెయింట్ పీటర్స్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎ. ఉషశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, 6వ తరగతి విద్యార్థిని జె. అలెక్సియా ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ గణేష్, జిల్లా అటవీ శాఖ అధికారి నికితల చేతుల మీదుగా ఘనంగా బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాల కీర్తిని పెంపొందించిన విద్యార్థినులను సెయింట్ పీటర్స్ పాఠశాల ప్రిన్సిపాల్డాక్టర్ గోపు మాథ్యాస్ రెడ్డి, డైరెక్టర్ గోపు సునీత రెడ్డి ప్రత్యేకం గా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ఎన్నో బహుమతులు పొందాలని అన్నారు. విద్యార్థులను ఇంతటి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన పాఠశాల డ్రాయింగ్ టీచర్ రాపోలు శ్రీనివాస్ ను యాజమాన్యం అభినందించి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారు: ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హెచ్చరిక



**ఖమ్మం వుదయం బ్యూరో జూన్ 13**

కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామంలోని పగిడేరు వాగుపై నిర్మాణంలో ఉన్న లో–లెవెల్ బ్రిడ్జి పనులను ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఈరోజు (శనివారం) ఉదయం స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పనులు అకారణంగా నిలిచిపోవడం వల్ల గ్రామ ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ గారు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రూ. 75 లక్షల పరిపాలన అనుమతులతో అధికారులు మార్కింగ్ ఇచ్చి ప్రారంభించిన ఈ బ్రిడ్జి పనులను, కొంత మంది కాంగ్రెస్ నాయకులు కావాలనే అడ్డుకుంటున్నారని స్థానిక రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. బ్రిడ్జి పనులు చేస్తే సస్పెండ్ చేయిస్తాం, బదిలీలు చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అందుకే అధికారులు ఇక్కడికి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అభివృద్ధిని అడ్డుకోవడం తగదు – ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్థానిక రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలే తప్ప ఇలా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో తప్ప సాధించిందేమీ లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పాలను సాగిస్తూ, చివరకు ప్రజా ఉపయోగకరమైన బ్రిడ్జి పనులను కూడా ఆటంకపరచడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సోయి తెచ్చుకోవాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని హెచ్చరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తుమ్మలపల్లి పగిడేరు వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**రైతులకు సకాలంలో యూరియా, విత్తనా లు అందించాలి:**

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులందరికీ ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. యూరియాను యాప్‌ల ద్వారా కాకుండా నేరుగా షాపుల ద్వారానే, రైతు పాస్‌బుక్కులతో సంబంధం లేకుండా ప్రతి రైతుకు సరిపడా యూరియా బస్తాలను పంపిణీ చేయాలని తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల సంఖ్య పెంచాలి: అలుగుబెల్లి నర్సిరెడ్డి




**నల్గొండ13-06, వుదయం:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేయాలని పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసాచారి అధ్యక్షతన యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, పట్టణీకరణ కారణంగా నగర ప్రాంతాల్లో జనాభా పెరిగినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగినంతగా పెరగలేదన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, చండూరు వంటి పట్టణాల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో సుమారు 44 వేల మంది విద్యార్థులు చదువుకుంటుండగా, అందులో కేవలం 5 వేల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని పేర్కొన్నారు. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల మాదిరిగా కేశరాజుపల్లి, రామగిరి, జేబీఎస్, అక్కలాయిగూడెం పాఠశాలలను అభివృద్ధి చేస్తే ఆర్థికంగా వెనుకబడిన మరియు మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.టీచర్ల డిప్యూటేషన్లపై స్పందిస్తూ, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు జరగాలని, వ్యక్తిగత అవసరాల కోసం కాకూడదని చెప్పారు. అక్రమ డిప్యూటేషన్లను ఖండిస్తూ, అవసరమైతే వాటి రద్దు కోసం ప్రజలను కూడా సమీకరిస్తానని హెచ్చరించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాంలు, షూస్‌తో కూడిన కిట్లు అందించాలని కోరారు. జిల్లాలో మంజూరైన 124 ప్రీ–ప్రైమరీ సెక్షన్లకు అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అమలు చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు జూలైలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒకేసారి అల్పాహార పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి. నాగమణి, ఎడ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి. అరుణ, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, భాను ప్రకాష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## సారపాక బూత్-215కు బీఎల్ఏగా వారాల వేణు నియామకం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 13 (వుదయం ప్రతినిధి)**

మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్‌లోని డీవీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం పినపాక నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణా శిబిరం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అలీ, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వారాల వేణును సారపాక బూత్ నంబర్–215కు బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)గా నియమించారు. పార్టీ బలోపేతం, ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాల సమన్వయం వంటి కీలక బాధ్యతలను ఆయనకు అప్పగించారు.శిక్షణా శిబిరంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయి నాయకుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి బీఎల్ఏ ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా వారాల వేణు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సారపాక బూత్–215 పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఓటరును కలుస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, బీఎల్ఓలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్ పర్తి జూన్13 (వుదయం ప్రతినిధి):**

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని అర్వపల్లి, సీతంపేట గ్రామంలో వివో భవనం, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంతో పాటు సామాజిక, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ భవనాలు గ్రామ పాలనకు కేంద్ర బిందువులుగా, వివో భవనాలు గ్రామ ప్రజల సామాజిక అవసరాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్నామని చెప్పారు. సీతంపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళ సంఘాలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


## ఉప ముఖ్యమంత్రిని బట్టి విక్రమార్క ని కలిసిన ఎన్ హెచ్ ఎం జేఏసీ ఉద్యోగులు



**ధర్మసాగర్ జూన్ 13 (వుదయం ప్రతినిధి)**

మంచిర్యాల జిల్లాలో గౌరవ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ని ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమం ఎన్ హెచ్ ఎం జేఏసీ ఉద్యోగుల తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డా. మహేందర్ రావు పుట్ట ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, పెండింగ్ వేతనాలు, సర్వీస్ బెనిఫిట్స్ మరియు ఇతర సమస్యలపై ఉప ముఖ్య మంత్రి తో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని బట్టి విక్రమార్క ప్రత్యేకంగా పరిశీలించి, అందులో పేర్కొన్న అంశాలను స్వయంగా చదివి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలపై మరింత సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్‌లో తనను కలిసి వివరించాలని సూచించారు.ఈ సమావేశంలో డా. మహేందర్ రావు పుట్ట (ఎన్ హెచ్ ఎం జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపకులు) రాజేంద్ర ప్రసాద్ (హనుమకొండ జిల్లా సీనియర్ నాయకుడు) సంతోష్ డా. రామకృష్ణ , మధుబాబు, శశికాంత్, డి. వినోద్ , సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉపసర్పంచ్



**మహాదేవపూర్ జూన్ 13 (వుదయం ప్రతినిధి)**

మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్ పర్శబోయిన సమ్మయ్య శనివారం మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు అన్నారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య, తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శేఖర్ రెడ్డి, ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ సమ్మయ్య మంచిర్యాల పట్టణంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేర్యారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సమ్మయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. అదే క్రమంలో మాజీ ఎంపిటిసి కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధిని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వేగవంతం చేస్తుందని తెలిపారు. మంథని నియోజకవర్గంలో శ్రీధర్ బాబు చేసే అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే ప్రతిపక్షాల పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు.

## రాబోయే 5 రోజులు భారీ వర్షాలు – అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జూన్: 13వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు భారీ వర్షాలు, పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఉరుములు–మెరుపులు పడే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు.గంటకు 40–50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున, రైతులు, కూలీలు ఉరుములు వచ్చే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలవొద్దని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థ ఇళ్లలో ఉన్నవారు వీలైనంత త్వరగా పక్కా భవనాలకు తరలాలని, అత్యవసరం కానిదే ప్రయాణాలు చేయొద్దని ఆదేశించారు.అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## నిజాన్ని అబద్ధంగా అబద్ధాన్ని నిజంగా మార్చే సంస్కృతి కేసీఆర్ కుటుంబానికే సాధ్యం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి జూన్ 13(వుదయం జిల్లా ప్రతినిధి)**

సింగరేణిని సర్వనాశనం చేసిన వారే ఇప్పుడు దాని పరిరక్షకులుగా మాట్లాడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా మార్చే సంస్కృతి ఈ రాష్ట్రంలో ఒక్క కేసీఆర్ కుటుంబానికే అలవాటైందని ఘాటుగా విమర్శించారు.శనివారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆదాయ వనరుగా కాకుండా దోపిడీ కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. అందినకాడికి దోచుకుని, ఇప్పుడు సింగరేణి కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాట్లాడటం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనన్నారు.భూపాలపల్లికి రావాల్సిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటును రాజకీయ ప్రయోజనాల కోసం యాదాద్రికి తరలించారని ఆరోపించారు. ప్రాజెక్టు వ్యయాలను అమాంతం పెంచి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. నాసిరకం సామగ్రి, అవినీతి నిర్మాణాలతో ప్లాంటును పనికిరాని స్థితికి చేర్చారని అన్నారు.అలాగే సింగరేణి పరిధిలోని ప్రజల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను సిద్ధిపేట, హైదరాబాద్ వంటి ఇతర ప్రాంతాలకు తరలించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కాదా అని ప్రశ్నించారు. గనుల వల్ల ఇబ్బందులు పడుతున్న భూపాలపల్లి ప్రజలకు న్యాయం చేయకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం నిధులను మళ్లించారని ఆరోపించారు.మాజీ మంత్రి హరీష్ రావు భూపాలపల్లి పర్యటనలో సింగరేణిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సింగరేణిని బలహీనపరిచిన వారే ఇప్పుడు దాని గురించి నీతులు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారు అని వ్యాఖ్యానించారు.ప్రజల తీర్పును ఇంకా అర్థం చేసుకోని బి.ఆర్.ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో రాష్ట్రాన్ని నష్టపరిచిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పారని అన్నారు. అయినప్పటికీ తమ తప్పులను అంగీకరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,టౌన్ అధ్యక్షుడు దేవన్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులపై అసభ్య పోస్టింగులు : జనగాం ఏవో విజయ్ రెడ్డి అరెస్ట్!

**బాధితులకు అండగా నిలిచి, తక్షణ చర్యలు తీసుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

**జనగాం, జూన్ 13 (వుదయం ప్రతినిధి):**

కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వేధింపులకు పాల్పడే వారిపై జనగాం జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. తోటి మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ఏవో విజయ్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వివరాల్లోకి వెళ్తే...జిల్లా వ్యవసాయ శాఖలో ఏవోగా పనిచేస్తున్న విజయ్ రెడ్డి, కార్యాలయంలోని మహిళా ఉద్యోగుల అనుమతి లేకుండా వారి ఫోటోలు తీసి, మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరమైన కామెంట్లు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. గతంలోనూ ఇతనిపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలైన ఒక మహిళా ఉద్యోగి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లారు.ఫిర్యాదుపై కలెక్టర్ తక్షణమే స్పందించారు. సైబర్ క్రైమ్, ఐటీ మానిటరింగ్ సెల్ ద్వారా ప్రాథమిక విచారణ జరిపించగా, కేవలం ఒక్కరే కాకుండా అనేక మంది మహిళా అధికారులు ఇతని చేతిలో బాధితులుగా మారినట్లు తేలింది. వెంటనే పోష్ (POSH) చట్టం పరిధిలోని ఇంటర్నల్ కమిటీ ద్వారా పూర్తి విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా లోకల్, సైబర్ క్రైమ్ పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు ఆదేశాలు జారీ చేశారు.నిందితుడు విజయ్ రెడ్డిపై కొత్త చట్టం ప్రకారం BNS సెక్షన్లు 75, 77, 78, 79, 296(b) తో పాటు, ఐటీ చట్టం 66–E, 67A ITA (2000–2008) కింద పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ శాఖలో చాలా కాలంగా ఒకే కార్యాలయంలో తిష్టవేసిన ఏవోలను అందరినీ తక్షణమే బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

**జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు :**

ఫిర్యాదు చేసిన అతి తక్కువ సమయంలోనే స్పందించి, విచారణ జరిపించి నిందితుడిని జైలుకు పంపడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు మహిళా ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మహిళలను అవమానించిన విజయ్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

## కీ.శే. కుంజా బొజ్జికి తగిన గుర్తింపు ఇవ్వాలి – బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్



**భద్రాచలం, 13/06/, వుదయం ప్రతినిధి**

భద్రాచలం నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రజానాయకుడు, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించిన కీ.శే. కుంజా బొజ్జికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తగిన గుర్తింపు కల్పించాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్ డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవకు అంకితమైన నాయకుడిగా కుంజా బొజ్జి సేవలు నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ సమాజం నుంచి ఎదిగి అత్యున్నత ప్రజాప్రతినిధి స్థాయికి చేరుకున్న కుంజా బొజ్జి గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు.1985, 1990, 1995 సంవత్సరాలలో వరుసగా మూడు సార్లు భద్రాచలం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన కుంజా బొజ్జి ప్రాంతీయ అభివృద్ధి కోసం ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్యా సంస్థలు, వైద్య సేవలు మెరుగుపడటానికి ఆయన చేసిన కృషి అపూర్వమని తెలిపారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి విస్తరణకు ఆయన చేసిన కృషి వల్ల వేలాది మంది పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. అలాగే ఐటిడిఏ కార్యాలయాన్ని భద్రాచలానికి తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్ర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలులోకి రావడానికి ఆయన నిరంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారని వివరించారు.గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణం, పేదల కోసం కాలనీల ఏర్పాటు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి, గురుకుల విద్యా సంస్థల స్థాపన వంటి అనేక కార్యక్రమాల్లో ఆయన చొరవ తీసుకున్నారని చెప్పారు. నెహ్రూ మార్కెట్ నిర్మాణం ద్వారా చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంలో ఆయన దూరదృష్టి కీలకంగా పనిచేసిందన్నారు.ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలు తెలుసుకునే నాయకుడిగా కుంజా బొజ్జి ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆయన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ ప్రజల కోసం తెరిచి ఉండేవని పలువురు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించే వ్యక్తిత్వం ఆయనదని అన్నారు.నేటి రాజకీయాల్లో కనిపించని నిబద్ధత, నిజాయితీ, ప్రజా సంక్షేమం పట్ల అంకితభావం కుంజా బొజ్జిలో కనిపించేదని కుంజా సంతోష్ పేర్కొన్నారు. ప్రజాధనాన్ని పవిత్రంగా భావించి ఒక్క అవినీతి ఆరోపణకు కూడా తావులేకుండా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించారని కొనియాడారు. అందుకే ఆయన పేరు నేటికీ ప్రజల నోట వినిపిస్తోందని తెలిపారు.ఆదివాసీ యువతకు కుంజా బొజ్జి జీవితం ఒక స్ఫూర్తిదాయక గాథ అని పేర్కొన్న ఆయన, సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం ద్వారా నిజమైన నాయకత్వం ఎలా ఉండాలో చూపించారని అన్నారు. గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.భద్రాచలం ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక (జేఏసీ) చేసిన తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తున్నామని కుంజా సంతోష్ తెలిపారు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మితమవుతున్న నూతన మార్కెట్‌కు కీ.శే. కుంజా బొజ్జి పేరు పెట్టడం ద్వారా ఆయన సేవలకు నిజమైన గౌరవం లభిస్తుందని అన్నారు.

## బాధితులకు భరోసా, భద్రత కల్పించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం: సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్




**సూర్యాపేట జూన్ 13వుదయం ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి తో కలిసి ఈరోజు జిల్లా పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతలు, కేసుల దర్యాప్తు పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. గత నెలలో నమోదైన కేసుల పూర్వాపరాలను నిశితంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు తక్షణ భరోసా, రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని ఎస్పీ గారు స్పష్టం చేశారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించకూడదని డోర్ స్టెప్ ఎఫ్ఐఆర్ పటిష్టంగా అమలుచేయాలని సూచించారు. కేసుల ఛేదనలో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలతో పని చేయాలి, సాక్ష్యాధారాలను పక్కాగా నమోదు చేయాలి అన్నారు. సాక్షులను చైతన్య పరిచి, నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా కోర్టు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. ప్రజలు, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి, కేసుల సంఖ్యను తగ్గించేలా పనిచేయాలి. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో భద్రతా వలయాలు ఏర్పాటు చేయాలి. నేరాలు జరిగినప్పుడు పక్కా ఆధారాలు లభించేలా సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలి.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## "ప్రజల భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది" - జిల్లా ఎస్పీ నితికా పంత్




**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**

"పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో సోలార్ లైట్ల పంపిణీ కార్యక్రమం శనివారం తిర్యాని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్ హాజరై తిర్యాని మండలంలోని పలు గ్రామాల ఆదివాసి ప్రజలకు 87 సోలార్ లైట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యుత్ సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో సోలార్ లైట్లు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఆదాకు కూడా సోలార్ శక్తి దోహదపడుతుందని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కేవలం చట్ట అమలు, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా ప్రజల సంక్షేమం, భద్రత, సామాజిక అభివృద్ధి కోసం కూడా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన వంటి అంశాలపై నిరంతరం కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సమాజ సేవలో భాగస్వాములవుతూ పోలీస్ శాఖతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ స్మార్ట్ హైదరాబాద్ ప్రతినిధులను ఎస్పీ అభినందించి, జ్ఞాపికలు అందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.అనంతరం సోలార్ లైట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి, వాటి వినియోగం, నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ అనిత రెడ్డి, వెంకటేశ్వరి, రెబ్బెన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంజయ్, తిర్యాని సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, లింగాపూర్ ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

**అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి**

**విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి**

**వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి**




**నిజామాబాద్, జూన్ 13:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు. బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ కు, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

**రాయపట్నం వద్ద ఎదురేగి స్వాగతించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**తరలి వచ్చిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, కాంగ్రెస్ శ్రేణులు**



**ధర్మపురి జూన్13(వుదయం ప్రతినిధి):**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటన నిమిత్తం వెళ్తున్న సందర్భంగా శనివారం ధర్మపురి మండలం రాయపట్నం వద్ద సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,నాయకులు ఘనంగా ఎదురేగి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు పార్టీ శ్రేణులు సత్కరించి, ఘనంగా నినాదాలు చేశారు. ఈ స్వాగత కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ధర్మపురి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతి నిధులు, వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం పలికారు.

## కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

**యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి**

**నూతన కలెక్టరేట్ ను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జూన్ 13 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటుచేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్‌స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజల కు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్అధికారులకు దిశానిర్దేశం చేశా రు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్య టన విజయవంతం చేయాల ని సూచిం చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ జర్నలిస్టుల సమస్యలు ఎట్టకేలకు పరిష్కారం..!

**కలెక్టర్ ప్రత్యేక చొరవకు జర్నలిస్టుల కృతజ్ఞతలు**

**ఆదిలాబాద్, జూన్ 13:**

గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా ప్రత్యేక చొరవ చూపి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడియేషన్లు మంజూరు చేయడంపై టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆదిలాబాద్ జిల్లా యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ తొలి విడత సమావేశంలో అర్హత కలిగిన 206 మంది జర్నలిస్టులకు అక్రిడియేషన్లు మంజూరు కాగా, రెండో విడత సమావేశంలో మరో 150 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడియేషన్లు లభించడం పట్ల యూనియన్ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. ఉట్నూర్ ఐటీడీఏ కేంద్రంతో పాటు ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల అక్రిడియేషన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జిల్లా కలెక్టర్ రాజార్షి షా కీలక పాత్ర పోషించారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థాయిలో జరిగిన చొరవతో ఐటీడీఏ ప్రాంత జర్నలిస్టులకు కూడా అక్రిడియేషన్లు మంజూరు కావ డం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా అధ్యక్షు లు బేత రమేష్ మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాంత జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి సహకరించిన జిల్లా కలెక్టర్ రాజార్షి షాకు, అక్రిడియేషన్ ప్రక్రియను పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించడంలో పూర్తి సహకారం అందించిన జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్ఓ) విష్ణువర్ధన్‌కు టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా యూనిట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్క్రీన్ ప్లేని తలపించిన 'ఆపరేషన్ కవచ్'..

**'పోకిరి' స్టైల్లో దొంగను పట్టుకున్న కామారెడ్డి పోలీసులు..!**

**'ఆపరేషన్ కవచ్' పంజా.. గంటల్లోనే చోరీ కేసు ఛేదన – నిందితుడి అరెస్ట్, సొత్తు స్వాధీనం**

**డయల్-100 అలర్ట్... కంట్రోల్ రూమ్ కమాండ్.. పక్కా స్కెచ్‌తో దొంగను పట్టుకున్న పోలీసులు**

**నేరస్థులకు నిద్రలేకుండా చేస్తున్న 'ఆపరేషన్ కవచ్'..**

**గంటల వ్యవధిలోనే దొంగను కటకటాల వెనక్కి నెట్టిన పోలీసులు**

**అప్రమత్తతకు ప్రతిఫలం.. 'ఆపరేషన్ కవచ్' విజయంతో నిందితుడి అరెస్ట్**

**దొంగను పట్టుకున్న పోలీసు సిబ్బందికి క్యాష్ రివార్డులు అందజేసి అభినందించిన జిల్లా ఎస్పీ**



**కామారెడ్డి, జూన్ 13 (వుదయం ప్రతినిధి):**

మనం ఒకసారి కమిట్ అయితే మన మాట మనమే వినం" అన్న రేంజ్ లో సినిమా స్క్రీన్ ప్లేని తలపించేలా కామారెడ్డి జిల్లా పోలీసులు మెరుపు వేగంతో స్పందించి, రంగంలోకి దిగితే ఎలా ఉంటుందో నిరూపించారు. అర్ధరాత్రి దొంగతనం జరిగితే.. తెల్లవారేసరికి నిందితుని దొంగతనం జరిగిన కొన్ని గంటల్లోనే అది సినిమాటిక్ స్టైల్లో చేజ్ చేసి నిందితుడిని కటకటాల వెనక్కి నెట్టారు. కామారెడ్డి పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఆపరేషన్ కవచ్', 'పోలీస్ కంట్రోల్ రూమ్' సమన్వయం ఎంత పక్కాగా పని చేస్తుందో ఈ ఘటన మరోసారి ప్రూవ్ చేసింది. లింగాపూర్ గ్రామంలో జరిగిన ఇంటి చోరీ కేసును కేవలం గంటల వ్యవధిలోనే 'షార్ప్ అండ్ స్వీట్' గా ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడమే కాకుండా చోరీ సొత్తును రికవరీ చేసి, నేరస్థులకు వెన్నులో వణుకు పుట్టిస్తూ, ప్రజలకు కొండంత భరోసా కల్పిస్తూ "నేరస్థులకు భయం.. ప్రజలకు భరోసా" అనే నినాదాన్ని నిజం చేశారు.ట్విస్టులతో మొదలైన సీన్:-తేదీ 11.06.2026 రాత్రి... దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి తన ఇంటికి తాళం వేసి, హాయిగా ఇంటి ముందు నిద్రపోయాడు. కట్ చేస్తే... తెల్లవారుజామున (12.06.2026) ఇంట్లో ఏదో వింత శబ్దం. కళ్ళు తెరిచి లోపలికి వెళ్లి చూసేసరికి అక్కడొక అపరిచిత వ్యక్తి సామాన్లు వెతుకుతున్నాడు. యజమానిని చూడగానే ఆ దొంగ 'అక్కడి నుంచి తోకముడిచాడు. లోపల చూస్తే ఒక మొబైల్ ఫోన్, రూ.2,500 క్యాష్ మాయమయ్యాయి. ఇక్కడే అసలు సినిమా మొదలైంది. బాధితుడు కంగారు పడకుండా వెంటనే డయల్-100కు కాల్ చేసి, దొంగ పారిపోయేటప్పుడు వేసుకున్న బట్టల వివరాలను (డ్రెస్ కోడ్) పూసగుచ్చినట్లు చెప్పాడు. ఇక అంతే... కామారెడ్డి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ ఒక్కసారిగా యాక్షన్ మోడ్‌లోకి వచ్చింది. నిమిషాల వ్యవధిలో వైర్‌లెస్ సెట్లు గర్జించాయి. కంట్రోల్ రూమ్ సిబ్బంది పక్కా ప్లానింగ్‌తో అలర్ట్ మెసేజ్‌ను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు, నైట్ పెట్రోలింగ్ బృందాలకు, బ్లూ కోల్ట్స్ సిబ్బందికి చేరవేశారు. ముఖ్యంగా గ్రౌండ్ లెవల్‌లో ఉన్న 'ఆపరేషన్ కవచ్' టీమ్స్ మొత్తాన్ని ఒక కంటి న్యూయస్ నిఘా వలయంగా మార్చేశారు. దొంగ ఏ దారిలో వెళ్లినా తప్పించుకోలేనంత పక్కాగా రూట్ మ్యాప్ జియో-ఫెన్సింగ్ లాగా అలర్ట్ చేశారు. చెక్‌పోస్ట్ దగ్గర హై-వోల్టేజ్ నిఘా..లింగాపూర్ నుంచి కామారెడ్డికి వెళ్లే దారిలో 'వసుంధర వెంచర్' సమీపంలో ఆపరేషన్ కవచ్ చెక్‌పోస్ట్‌ను పోలీసులు అప్పటికే లాక్ చేసేశారు. ప్రతి వాహనం తనిఖీ అయితే తప్ప వెళ్లకుండా చేశారు. సరిగ్గా అదే సమయంలో తాడ్వాయి వైపు నుంచి కామారెడ్డికి వస్తున్న ఒక ఆటో అక్కడ ఆగింది. పోలీసుల షార్ప్ ఐస్ ఆటోలో కూర్చున్న ఓ వ్యక్తిపై పడ్డాయి. కంట్రోల్ రూమ్ ఇచ్చిన డ్రెస్ డిస్క్రిప్షన్.. ఆ వ్యక్తి వేసుకున్న బట్టలు వందకు వంద శాతం మ్యాచ్ అయ్యాయి!. ఏమాత్రం చాన్స్ ఇవ్వకుండా అతడిని లౌక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టైల్లో విచారించేసరికి సదరు నిందితుడు తల వంచక తప్పలేదు. తానే లింగాపూర్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి చోరీకి గురైన మొబైల్ ఫోన్, రూ.2,500 నగదును రికవరీ చేశారు. నిందితుడు రాథోడ్ బొజ్జు, కన్నాపూర్ తాండా, రామారెడ్డి మండలంగా గుర్తించారు. ఇతను మామూలోడు కాదు.. పాత నేరస్థుడు! గతంలో దేవునిపల్లి, నిజామాబాద్ ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇతనిపై పలు దొంగతనం కేసులు ఉన్నాయి. జైలు శిక్ష కూడా అనుభవించి వచ్చాడు. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు జైలు గదికి (రిమాండ్) తరలించారు.

జిల్లాలో అమలు చేస్తున్న "ఆపరేషన్ కవచ్" ఒక పక్కా రక్షణ కవచంలా పని చేస్తోందని, నేరాల నియంత్రణకు, అనుమానితుల వేటకూ ఇది బెస్ట్ వెపన్ అని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎల్లప్పు డూ అప్రమత్తంగా ఉండాలని, కాలనీల్లో గానీ, గ్రామాల్లో గానీ ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి భాగస్వాములు కావాలని కోరారు.

## మంథని టాస్క్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రన్‌వే మీట్-అప్ విజయవంతం



**మంథని, జూన్ 13వుదయం ప్రతినిది:**

తెలంగాణ యువతకు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో మంథని టాస్క్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శనివారం "రన్‌వే మీట్-అప్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కృత్రిమ మేధస్సు (AI), సృజనాత్మక సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలను యువతకు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మస్కుల సాయేందర్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ శ్రావంతి రమేష్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తుకు సిద్ధం కావాలని సూచించారు. రన్‌వే కమ్యూనిటీ బిల్డర్ అరవింద్ మాట్లాడుతూ రన్‌వే ప్లాట్‌ఫామ్ ద్వారా వీడియో క్రియేషన్, జనరేటివ్ AI, డిజిటల్ కంటెంట్ తయారీపై అవగాహన కల్పించారు. టాస్క్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ పనకంటి రాకేష్ మాట్లాడుతూ గ్రాఫిక్ డిజైన్, మోషన్ గ్రాఫిక్స్, వీడియో ఎడిటింగ్, డేటా సెంటర్ టెక్నాలజీస్ తదితర కోర్సులు విజయవంతంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో AI, AVGC-XR వంటి రంగాల్లో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, శిక్షణార్థులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని రన్‌వే AI సాంకేతికతలపై ఆసక్తి కనబరిచారు.

## శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

**సాంకేతికతతో నేరాలకు బ్రేక్**

**ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**

**పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవం తం చేయాలి: ఎస్పీ అశోక్ కుమార్**



**ధర్మపురి,జూన్13(వుదయం ప్రతినిధి):**

జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా,పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.శనివారం ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో,ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు.స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది ఘన స్వాగతం పలికారు.అనంతరం కార్యాలయంలోని రికార్డుల నిర్వ హణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశా లను ఆయన సుదీర్ఘంగా పరిశీలించారు.సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు,అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్ల ను,పెండింగ్ ట్రయల్ ఫైళ్లను స్వయంగా తనిఖీ చేసి అధికా రులకు పలు సూచ నలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ కేసుల దర్యాప్తులో నాణ్యత తో పాటు వేగం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. బాధితు లకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచుగా తనిఖీ చేస్తూ,సిబ్బంది పని తీరును నిత్యం పర్యవేక్షించాలని సిఐను ఆదేశించారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, సాంకేతి క పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయో గించుకోవాలని తెలిపారు.ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజలతో మమేకం కావాలి.అక్కడి శాంతిభద్రతల సమస్యలను నేరుగా తెలుసుకో వాలి. విధుల్లో ఉన్న సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలి అని ఎస్పీ కఠిన ఆదేశాలు జారీ చేశారు.గ్రామాల్లో సీసీ కెమెరాల పై అవగాహన పెంచండి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజల్లో చైతన్యం తేవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు,వి విధ సామాజిక అంశాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. నేరాల నియంత్రణలో సీసీ కెమె రాల ప్రాముఖ్యతను గ్రామస్థుల కు వివరించాలి.ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చొరవ చూపాలి. మాదకద్ర వ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అంతా ఒకే తాటిపై సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రాం నరసింహారెడ్డి, ఎస్సైలు మహేష్, రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దళారులకు కాకుండా ప్రభుత్వ కేంద్రాలకే జొన్నలు విక్రయించాలి: క్వింటాల్‌కు రూ.3,699 మద్దతు ధర



**నాగిరెడ్డిపేట్, వుదయం**

మండలంలోని మెల్లకుంట తండాలో తాండూర్ కిచ్చన్నపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తమ జొన్నలను ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ.3,699 మద్దతు ధరకు విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాల ద్వారా విక్రయించాలని కోరారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాణ్యమైన జొన్నలను కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, గ్రామ సర్పంచ్ బాల్య నాయక్, ఉప సర్పంచ్ రామావత్ వసురాం, మాజీ సర్పంచ్ కేస్లి వసురాం, తాండూర్ సొసైటీ ఉపాధ్యక్షులు మిద్దె బాబురావు,వర్జ్యా నాయక్,వార్డు సభ్యులు అంగోత్ రమేష్,లకావత్ వాసురం, హనుమ నాయక్, కిషన్ నాయక్, బన్సీ, రవీందర్ రెడ్డి, సీఈవో మురళి, వివిధ గ్రామాల డైరెక్టర్లు, నాయకులు, రైతులు, సక్రియ నాయక్, నర్సింగ్, అంగోత్ రాజు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోదీజీ పుష్కర సేవా కాలం ప్రజాసేవకు అంకితం : సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )**

కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే గారి నివాసంలో ఈరోజు మోదీజీ 12 సంవత్సరాల పరిపాలనా విజయాలపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయంటే అది కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వ చొరవ వల్లే అని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్నిధి, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన తదితర పథకాలతో సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు దక్కాలనేదే మోదీజీ సంకల్పం అని కొనియాడారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ నిధులు, ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణం వల్ల పుష్కరకాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిందని కొనియాడారు.పైసలు లేని ప్రజా పాలన ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దండగ మారి వేషాలు మాని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. భాజపా స్టేట్ మీడియా ప్యానలిస్టు శ్రీ నామని మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సవివరంగా చెప్పారు. రాష్ట్రంలో కమిషన్ల సర్కార్ నడుస్తుందని, ప్రజల గోడు పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## సమిష్టి కృషితోనే సమ్మె విజయం- యూనియన్ అధ్యక్షులు కల్లేపల్లి రవి



**పెద్దపల్లి, జూన్ 13:(వుదయం ప్రతినిధి )**

మార్బుల్, టైల్స్ అండ్ గ్రానైట్ యూని యన్ చేపట్టిన బంద్ కార్యక్రమం 5వ రోజుకు చేరుకుంది. జూన్ 10న ప్రారం భమై జూన్ 20 వరకు కొనసాగనున్న ఈ బంద్‌ను యూనియన్ అధ్యక్షులు కల్లేపల్లి రవి నేతృత్వంలో అత్యంత ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం శాంతినగర్,బంధంపల్లి,గొల్లపల్లి, రాఘవాపూర్,గౌరెడ్డిపేట,ముత్తారం,హనుమంతునిపేట,చీకురాయి గ్రామాల్లో పర్యటించిన రవి,బంద్ కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బంద్‌ను విజయవంతం చేస్తున్న మేస్త్రీలందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో రాబోయే మరో ఆరు రోజుల పాటు అందరూ సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల్, మధు, రవీందర్ రావు, శంకర్, రమేష్, మనీష్, లోకేష్, రాజేష్‌లతో పాటు ఇతర యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాప ఏమయింది ? అన్నీ ప్రశ్నలే !

**వికారాబాద్ జూన్ 13 (వుదయం బ్యూరో)**
కాకినాడ జిల్లా తుని మండలం సిహెచ్ అగ్రహారానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. సెన్సేషనల్ కేసుగా మారిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో ఎవరూ ఊహించని ట్విస్ట్ నమోదైంది. పెంపుడు కుక్క.. అకస్మాత్తుగా చనిపోయింది.వందల మంది పోలీస్ సిబ్బంది, డ్రోన్లు, ప్రత్యేక బృందాలతో కొండలు, లోయలు, తోటలు జల్లెడ పట్టినా పాప ఆచూకీ దొరకలేదు. ఆ కుక్కపైనే ఆశలు పెట్టుకుంటే.. అది కాస్తా చనిపోయింది. అసలే పాప ఆచూకీ తెలియక పోలీసులు నానా తిప్పలు పడుతుంటే.. ఇప్పుడు కుటుంబం పెంచుకునే కుక్క చనిపోవడం అనేది మరో షాకింగ్ అంశంగా మారింది. ఆ కుక్కకు ఎవరైనా మత్తు మందు లాంటిది పెట్టి చనిపోయేలా చేశారా అనే సందేహం కలుగుతోంది.

**కుక్కలో వింత ప్రవర్తన**
చిన్నారి కనిపించకపోయినప్పటి నుంచి కుక్క ప్రవర్తనలో మార్పు వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్పారు. ఇదివరకు ఎప్పుడూ కుటుంబ సభ్యులతో ప్రేమగా ఉండే కుక్క.. చిన్నారి మిస్సింగ్ అయిన జూన్ 6 తర్వాత నుంచి కోపంగా, తిక్కతిక్కగా ప్రవర్తిస్తూ, కుటుంబ సభ్యులనే కరిచేందుకు ప్రయత్నించిందని వారు చెప్పారు. ఆ కుక్క ద్వారా.. పాప ఆచూకీ కనుక్కోవాలి అనుకున్న పోలీసులకు.. కుటుంబ సభ్యులు చెప్పిన ఈ విషయాలు షాకయ్యేలా చేశాయి. కుక్క ప్రవర్తనలో మార్పు ఎందుకు వచ్చింది అనేది మరో సందేహంగా మారింది.జూన్ ఆరున.. పాపతో పాటూ.. వెళ్లిన కుక్క.. ఆ తర్వాత ఒక్కటే వెనక్కి వచ్చింది. అందుకే పోలీసులు ఆ కుక్కపై ఆధారపడ్డారు. ఇప్పుడు అది కాస్తా చనిపోవడంతో.. ఈ కేసు మరింత మిస్టరీగా మారింది.



**ప్రతిదీ ప్రశ్నగా .....**
కాకినాడ జిల్లా, తుని మండలం, దొండవాక సీహెచ్ అగ్రహారంలో జూన్ 6న పాప మిస్సింగ్ అయ్యింది. అప్పటి నుంచి పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. టెక్నాలజీని కూడా ఉపయోగించారు. కుక్కకు జీపీఎస్ ట్రాకర్ తగిలించి..
వదిలేశారు. అది.. ఎక్కడెక్కడో, అడవంతా తిరిగి.. 3 రోజుల తర్వాత ఇంటికి వచ్చింది. కానీ ఎలాంటి క్లూ లేదు. పైగా ఆ కుక్క ఇప్పుడు చనిపోయింది. దాంతో.. అడవుల్లో ఎవరైనా దానికి విషం లాంటిది ఇచ్చారా అనే సందేహం కలుగుతోంది.

**ఈ కేసు ఎలా మొదలైంది?**
జూన్ 6న పాప తమ పెంపుడు కుక్కతో పాటూ.. ఆడుకుంటూ, ఇంటి సమీపంలోని పామాయిల్ తోటలు లేదా అడవిలోకి వెళ్ళిపోయిందని భావిస్తున్నారు. పాపతో వెళ్లిపోయిన కుక్క.. 5 రోజుల తర్వాత తిరిగి వచ్చింది. దానికి జీపీఎస్ ట్రాకర్ తగిలిస్తే.. మరో 3 రోజులు ఎక్కడెక్కడో తిరిగి వచ్చింది. ఇప్పుడు అది చనిపోయింది. పాప ఏ మై పో యిం దో తెలియక.. తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఊరు మొత్తం ఆశ్చర్యపోతోంది. ఎక్కడా జాడ తెలియట్లేదు.మరోవైపు చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. అయితే ఆకస్మాత్తుగా వచ్చిన ఆ కుక్క కళ్ళలో భయం కనిపించింది. కానీ పోలీసులతో పాటు అక్కడ ఉన్న వారిని చూసి కొంత భయపడుతూ ఉంది. ఉత్తరప్రదేశ్ కు చెందిన కొందరు యువకుల సహాయంతో చాకచక్యంగా ఆ కుక్కను పట్టుకున్నారు. అప్పుడు తీవ్ర ఆందోళనతో, రౌద్రంగా కనిపిస్తోంది ఆ కుక్క. అయితే ఆ కుక్కకు జిపిఎస్ పరికరాన్ని అమర్చి పోలీసులు మళ్లీ అడవిలోకి ఆ కుక్కను వదిలారు. అయితే కొంత దూరం వెళ్లిన ఆ కుక్క తిరిగి మళ్ళీ చిన్నారి ఇంటి చుట్టూ తిరిగి ఆగిపోయింది. దీంతో పోలీసులు రూటు మార్చారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏమైనా ఘటన జరిగి ఉంటుందా అన్న కోణంలో దర్యాప్తు చేయడం ప్రారంభించారు. అందులో భాగంగా చిన్నారి తండ్రిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు .అయితే వారం రోజులు దాటుతున్న చిన్నారి ఆచూకీ దొరకకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది... ఇప్పుడు అదే కుక్క మృతి చెందింది.. దీంతో పోలీసులకు ఏమి చేయాలో అవసరం లేదు.. వివిధ కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

పోలీసులు ఎవర్ని అనుమానించాలో, కేసును ఎలా డీల్ చెయ్యాలో తెలియట్లేదు. చిన్న క్లూ ఉన్నా.. దాని ఆధారంగా ముందుకు వెళ్తుంటారు. ఈ కేసులో ఒక్క క్లూ కూడా లేదు. కుక్క ద్వారా కేసు సాల్వే అవుతుంది అనుకున్నారు. తీరా చూస్తే.. అది చనిపోవడం మరో కలకలం రేపింది. పైగా.. చనిపోయే ముందు.. కుక్క ప్రవర్తనలో వచ్చిన మార్పుల్ని చూస్తే.. కచ్చితంగా ఏదో కుట్ర ఉండే ఉంటుందనే సందేహాలు కలుగుతున్నాయి. ఎవరో కావాలనే ఇదంతా చేస్తున్నారా అనే డౌట్స్ ఉన్నాయిపోలీసుల ముందు ఉన్నది టెక్నాలజీ మాత్రమే. దాని ద్వారానే ఇప్పుడు పాప ఆచూకీ కనిపెట్టాల్సి ఉంటుంది. ఎవరైనా ఎత్తుకుపోయారా, లేక.. అడవిలో ఏవైనా జంతువులు పట్టుకుపోయాయా? నక్కలు లాక్కుపోయాయా? ఇలా ఎన్నో అనుమానాలు ఉన్నాయి. కేసును సాల్వ్ చేస్తే తప్ప.. ప్రజల్లో సందేహాలు వీడవు. కానీ.. ఇప్పటికీ చిన్నారి క్షేమంగా దొరుకుతుందనీ, దొరకాలనీ అందరూ కోరుకుంటున్నారు. ఆ తల్లిదండ్రుల ఆశలు ఫలించి.. చిన్నారి క్షేమంగా దొరికితే.. అదే చాలు.. వారం రోజులు దాటుతున్న ఎటువంటి క్లూ లభించడం లేదు. ఆ చిన్నారి కోసం వందలాది మంది పోలీసులు గట్టిగానే గాలిస్తున్నారు. భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అయినా సరే ఆచూకీ దొరకకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే పోలీసులు తమ దర్యాప్తును వేగవంతం చేస్తూ.. రోజుకో కోణంలో దర్యాప్తు చేయడం ప్రారంభించారు. అయితే చివరకు పూర్తి కిడ్నాప్ కోణంలోని ఈ ఘటన జరిగినట్లు అంచనాకు వచ్చి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు కుటుంబ కలహాల అనుమానాల నేపథ్యంలో తండ్రిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. ఇలా రకరకాల కోణాల్లో దర్యాప్తు చేస్తున్న ఏది కూడా కొలిక్కి రావడం లేదు. చిన్నారి ఆచూకీ దొరకడం లేదు.

**తల్లి ఇచ్చిన వాంగ్మూలంతో...**
చిన్నారి తల్లి భవాని ఇచ్చిన వాంగ్మూలం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. గత జనవరి నెలలో ఒక కారు విషయంలో తన భర్తకు కొందరితో పెద్ద గొడవ జరిగిందని ఆమె పోలీసులకు వెల్లడించారు. ఆ సమయంలో ఐదుగురు వ్యక్తులు వచ్చి తన భర్తను చంపేస్తామని తీవ్రంగా బెదిరించారని ఆయన పేర్కొన్నారు. అక్కడ కొద్ది రోజులకే మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహించారని ఆమె తెలిపారు. దీంతో పోలీసులు కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేయడం ప్రారంభించారు. ఇంకోవైపు కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్నారి తండ్రిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సాధారణంగా ఎంత చిన్న వయసున్న చిన్నారులు పూర్తిగా పరిచయం ఉన్న వారితోనే వెళ్తారు. అందుకే ఈ కిడ్నాప్ వ్యవహారం వెనుక తెలిసిన వారి పని అయి ఉంటుందన్న పోలీస్ అనుమానాలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో పాటు బంధువుల కాల్ డేటా సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు. దొరకని ఆనవాళ్లు..పాప అదృశ్యమైన మొదటి రెండు నుంచి మూడు గంటల సమయాన్ని పోలీసులు గట్టిగా గమనిస్తున్నారు. గ్రామంలో సిసి పుటేజీలు పరిశీలిస్తున్నారు. కానీ ఎక్కడ చిన్నారి ఆనవాళ్లు దొరకలేదు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సీసీ కెమెరాలకు చిక్కకుండా చిన్నారిని ఎక్కడైనా దాచారా? లేకుంటే గ్రామాన్ని దాటించేసారా అనే కోలంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం సైతం ఆరా తీయడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.



## గ్రామస్తులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ రాజ్ కుమార్**
**కోహీర్ జూన్ 13 (వుదయం ప్రతినిధి)**
కోహీర్ మండల పరిధిలో ని మనియార్పల్లి గ్రామం లో ఆ గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్ ఉపాధిహమి పనులను పరిశీలించారు వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కల్పిస్తున్న పలు పనులపై అవగాహనా కల్పించారు కర్షకులు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున సద్వినియోగం చేసి గ్రామ అభివృద్ధికి పాటు పడాలని మనియర్ పల్లి గ్రామ సర్పంచ్ బ్యాగారి రాజ్ కుమార్ కోరారు. మధ్యాహ్నం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట గ్రామ సర్పంచ్ బృందం నేరుగా వెళ్లి పథకంపై అవగాహనా కల్పించి ఎంత ఎక్కువ సంఖ్యలో హాజరు ఉంటే అంత అదికా నిధులు మంజూరు

అవుతాయని అన్నారు. ఈ పథకం లో అనేక ఉపయోగాలు ఉన్నాయి అన్నారు సకాలంలో పని కల్పించకపోతే ప్రభుత్వం నిరుద్యోగ భృతి కల్పిస్తుంది అన్నారు పని చేసిన పదిహేను రోజులలో వేతనం చెల్లిస్తారు అన్నారు కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కందన్ పల్లి లో నేడు టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**నారాయణపేట జూన్13**
**(వుదయం ప్రతినిధి)**
దామరగిద్ద మండలం కందన్ పల్లి గ్రామంలో నేడు టిఆర్ఎస్ జండా ఆవిష్కరణ ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటన లో తెలిపారు. గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని పార్టీ శ్రేణులకు నాయకులకు, కార్యకర్తలకు, ప్రజల కు యువత, మహిళలు, రైతులు నిరుద్యోగులు, విద్యార్థుల కు, ఉద్యమ కారులకు ఇదే సాదర ఆహ్వానంగా భావించి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నారాయణ పేట్ జిల్లా పార్టీ అధ్యక్షులు గవి నోళ్ల శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ పరిశీలకుడు పుల్లూరు శ్రీనివాస్ రావు ,కృష్ణా కిషోర్,దామర



గిద్ద మండలం అధ్యక్షులు నర్సింహా రెడ్డి,యువత అధ్యక్షులు మనోజ్ గౌడ్ ,నారాయణ పేట్ పట్టణ అధ్యక్షులు చంద్రు ముదిరాజ్,కొడంగల్ ఇంచార్జి నీలి జనార్దన్, మక్తల్ నియోజకవర్గం నాయకులు సిహెచ్ వెంకటన్న, జిల్లా లోని ప్రజలు పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



తొలకరి దయతో ఊపందుకున్న వ్యవసాయం

## రైతుల ముఖాల్లో సంతోషం, విత్తనాల వేత ముమ్మరం

**నాగర్ కర్నూల్, జూన్ 13**
**(వుదయం బ్యూరో)**
రోహిణి కార్తె ముగిసి మృగశిర ప్రారంభమైన తర్వాత కురిసిన తొలకరి వర్షాలు నాగర్‌కర్నూల్ జిల్లా రైతులకు ఊరటనిచ్చాయి. గత నాలుగైదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురిసిన సమృద్ధిగా వర్షాలతో పొలాలకు తగిన తడి అందడంతో రైతులు విత్తనాల వేత పనులను ముమ్మరం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం అన్ని మండలాల్లో విత్తనాలు వేసేందుకు అనుకూలంగా ఉందని రైతులు, వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు బోర్ల ద్వారా నీరు పెట్టి పరుస సాగు చేసినా, ప్రస్తుత వర్షాలు పంటలకు అదనపు బలాన్నిస్తాయని ఆశిస్తున్నారు.

వరి, పత్తి, మొక్కజొన్న వైపు మొగ్గు
ఈ ఖరీఫ్‌లో జిల్లాలో సుమారు 1,92,796 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. పత్తి 3,08,845 ఎకరాలు, మొక్కజొన్న 96,992 ఎకరాల్లో సాగు కానుంది. వర్షాల అనుకూలతతో రైతులు వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు జొన్న తదితర పంటల విత్తనాల కోసం కూడా సిద్ధమవుతున్నారు. వర్షాల అనంతరం అచంపేటలో 70.5 మి.మీ, ఉప్పునంతలలో 81.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అవసరమైన విత్తనాల సరఫరాకు కూడా శాఖ సిద్ధంగా ఉంది - వరి 48,199 క్వింటాళ్లు, పత్తి 2,780 క్వింటాళ్లు, మొక్కజొన్న 7,759 క్వింటాళ్లు.

కొని రోజుల తర్వాత పడిన ఈ వర్షం పంటలకు ప్రాణం పోసింది. ఇంకో మూడు నాలుగు రోజులు ఇలాగే కురిస్తే విత్తనాల వేత పూర్తవుతుంది" అని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు జిల్లా వ్యాప్తంగా ఊపందుకున్నాయి.

## కోటకొండ రోడ్డు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే, కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం

**రోడ్డు కోసం బిజెపి, బి ఆర్ ఎస్ రాస్తారోకో**
**నారాయణపేట టౌన్**
**జూన్13(వుదయం ప్రతినిధి)**
నారాయణపేట మండ లం కోటకొండ రోడ్డు ను వెంట నే పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తాం అని బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు హెచ్చ రించారు.అప్పక్ పల్లి నుంచి కోటకొండ,కోయిల్ కొండ రోడ్డులో అమిరెడ్డి పల్లి, బొమ్మనుపాడ్ మధ్య 4 కిలో మీటర్ల రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బిజెపి,బి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం కోటకొండ,అభంగపూర్,బందగొండ,తిరుమలాపూర్,ఉంటకుంట తాండా,బోమన్ పాడ్ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అప్పక్ పల్లి వద్ద హైదరాబాద్ రోడ్డుపై భారీ రాస్తారోకో నిర్వహించారు.దాంతో వాహనాలు నిలిచి పోయి ప్రయాణికులు అవస్థలు పడ్డారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసు లు ,జిల్లా బిజెపి ఉపాధ్యక్షు డు కంచె శ్రీనివాసులు,బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీ పీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షు డు వేపూర్ రాములు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అప్పక్ పల్లి నుంచి కోటకొండ మీదుగా



కోయిల్ కొండ వరకు డబుల్ రోడ్డు మంజూరు అయి పనులు జరిగా యని అన్నారు.కానీ అమిరె డ్డి పల్లి నుంచి బొమ్మను పాడు వరకు 4 కిలోమీటర్ల రోడ్డును అసంపూర్తిగా ఉంచారన్నారు.దాంతో గత రెండు ఏళ్లుగా రోడ్డు పూర్తికా క ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా అవస్థలుపడుతున్నారన్నారు.వర్షాకాలంలో రొడ్డు గుంతలమయం అయి అనేక ప్రమాదాలు జరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశా రు. ఏ అత్యవసర పరిస్థితి ఉన్న తొందరగా వెళ్లడానికి విలుకాకగర్భిణీలు,విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 ఏళ్లు కావస్తున్న ఎమ్మెల్యేకు అధికారులకు ఏమాత్రం ఈ రోడ్డుపై పట్టింపు లేదన్నా రు.పక్కనే సి ఎం నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి డబుల్ రోడ్డు పూర్తి అవు తున్నా కేవలం 4 కిలోమీటర్ల రోడ్డును ఎమ్మెల్యే పట్టించు కోవడం లేదని విమర్శించా రు.వెంటనే రోడ్డు ను పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మె ల్యే,కలెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచు లు,బిజెపి,బి ఆర్ ఎస్ నాయకులు, మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.



బీవీఆర్ఐటీలో విజయవంతంగా ముగిసిన

## వామ్స్2026 అంతర్జాతీయ సదస్సు

**హత్నూర జూన్13**
**(వుదయం ప్రతినిధి)**
బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఐదు రోజుల పాటు నిర్వహించిన 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్2026) అంతర్జాతీయ సదస్సు ఘనంగా ముగిసింది. శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమ-విద్యా సంస్థల భాగస్వామ్యం, వృత్తిపరమైన అభివృద్ధి, అంతర్జాతీయ సహకారాలకు ఈ సదస్సు వేదికగా నిలిచింది. ముగింపు కార్యక్రమంలో వామ్స్ సలహాదారు డా. సుధాకర్ కె. రావు ముఖ్య అతిథిగా పాల్గొని, సదస్సు విజయానికి సహకరించిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణురాజుకు కృతజ్ఞతలు తెలిపారు. వామ్స్ జనరల్ చైర్ డా. బి.ఆర్. సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డా. పి. సతీష్ రామచౌదరి, డా. వి. సమీర్ చక్రవర్తి, బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.సదస్సులో అత్యున్నత గౌరవంగా భావించే డా. సుధాకర్ రావు స్పెషల్ రికగ్నిషన్ అవార్డును రూ.1 లక్ష నగదు బహుమతితో ప్రొఫెసర్ సమీర్ చక్రవర్తి, ప్రొఫెసర్ పి. సతీష్ రామ చౌదరిలకు సంయుక్తంగా ప్రదానం చేశారు. బెస్ట్ పేపర్ అవార్డును రూ.50 వేల నగదు బహుమతితో ఇస్రో-స్పేస్ అప్లికేషన్స్ సెంటర్‌కు చెందిన రోహిత్ నంద్వానీ అందుకున్నారు. సాంకేతిక ఆవిష్కరణలకు గుర్తింపుగా 60కిపైగా ప్రతిష్ఠాత్మక అవార్డులను ప్రదానం చేశారు.

దేశ విదేశాల శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొన్న ఈ సదస్సు ద్వారా బీవీఆర్ఐటీకి అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరిగిందని ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే తెలిపారు.

# బాయి కాదు.. 'బుసల' కొంప!

**కొండాపురంలో పడగవిప్పుతున్న ప్రమాదం**
**ఎస్సీ ఘేర్ చెదురు బాయి వద్ద పాముల స్వైరవిహారం**
**ఇప్పటికే ఆరు పాముల హతం..**
**ప్రాణభయంలో స్థానికులు**
**సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి తక్షణమే స్పందించండి!**
**కేటీ దొడ్డి జూన్ 13 (వుదయం బ్యూరో)**
జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామంలోని ఎస్సీ ఘేర్ నివాసితులు ప్రస్తుతం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడి స్థానిక చెదురు బాయి పరిసరాలు విషసర్పాలకు నిలయంగా మారడంతో, ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతు న్నారు. పిచ్చిమొక్కలు, దట్టమైన పొదలతో అడవిని తలపిస్తున్న ఈ ప్రాంతం ఇప్పుడు పాముల స్థావరంలా మారింది.

ఇళ్లపైకి వస్తున్న సర్పాలు..
గత కొన్ని రోజులుగా ఈ బాయి పరిసరాల్లో చిన్న చిన్న





పాములు విపరీతంగా తిరుగులాడుతున్నాయి. అవి కాస్తా ఇప్పుడు జనావాసాల్లోకి, ఇళ్ల నడిబొడ్డున ఉన్న వంట గదుల్లోకి చొరబడుతుండటంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు భయాందోళనతో వణికిపోతున్నారు. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతూ.. ప్రాణరక్షణ కోసం స్థానికులు ఇప్పటికే ఆరు పాములను చంపాల్సి వచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంకా నిర్లక్ష్యం వహిస్తే ఇక్కడ పెద్ద ప్రమాదమే జరిగేలా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంటిమీద కునుకు లేదు.. ప్రాణాలుగాల్లో దీపాలే!
"చీకటి పడితే చాలు బయటకు రావాలంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. చిన్న పిల్లలను బయటకు పంపాలన్నా భయమే. ఏదైనా అనర్థం జరిగితే కానీ అధికారులు కళ్లు తెరవరా? మా ప్రాణాలకు రక్షణ కల్పించండి"
- స్థానిక బాధితులు, కొండాపురం.

పంచాయతీ యంత్రాంగం మేల్కొనేది ఎప్పుడు?
పెను ప్రమాదం పొంచివున్న ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ శ్రీ ఎస్. పవన్ కుమార్ రెడ్డి గారు యుద్ధప్రాతిపదికన స్పందించాలని గ్రామం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది. ప్రజా భద్రత దృష్ట్యా, తక్షణమే సదరు చెదురు బాయి చుట్టూ ఉన్న పొదలను, పిచ్చి మొక్కలను జెసిబి సాయంతో తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఏదైనా ఊహించని ప్రాణనష్టం జరగకముందే స్థానిక పంచాయతీ యంత్రాంగం మరియు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని కొండాపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా సెయింట్ ఆంథోనీస్ ఫీస్ట్ వేడుకలు

**సంగారెడ్డి వుదయం**
సంగారెడ్డి పట్టణం లో ని శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల్లో నూతన విద్యా సంవత్సరం 2026-27కు స్వాగతం పలుకుతూ శనివారం (జూన్ 13) పునీత ఆంథోనీవారి ఫీస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ ఫీస్ట్, సెయింట్ ఆర్నాల్డ్స్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పుష్పరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం పునీత ఆంథోనీవారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల ఫౌండర్ & చైర్మన్ డా. ఈదర సోలోమన్ రెడ్డి, డైరెక్టర్ ఈదర విజయ్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతిభావంతమైన ఫలితాలను సాధించడంలో విశేషకృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఫౌండర్ & చైర్మన్

**సెయింట్ ఆర్నాల్డ్స్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పుష్పరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం పునీత ఆంథోనీవారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల ఫౌండర్ & చైర్మన్ డా. ఈదర సోలోమన్ రెడ్డి, డైరెక్టర్ ఈదర విజయ్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతిభావంతమైన ఫలితాలను సాధించడంలో విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్నిప్రత్యేకంగా అభినందించారు.**

డా. ఈదర పాపులమ్మ సోలోమన్ రెడ్డి, డైరెక్టర్ ఈదర విజయ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ & ప్రిన్సిపల్ ఈదర అరుణా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈదర జయబాల రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ లక్కి శెట్టి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఈ. జ్యోతి రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.
వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ నిబంధనలు

## తప్పనిసరిగా పాటించాలి: ఎంఈఓ విద్యాసాగర్

**సంగారెడ్డి, జూన్13**
**(వుదయం ప్రతినిధి)**
ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంగారెడ్డి మండల విద్యాధికారి (ఎంఈఓ) విద్యాసాగర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.పాఠశాలల్లో అమలు చేస్తున్న ఫీజుల వివరాలను పారదర్శకంగా నోటీస్ బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. అలాగే పాఠశాల ప్రాంగణాల్లో పుస్తకాలు, యూనిఫామ్లు విక్రయాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని సూచించారు.
విద్యాశాఖ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగానే తరగతుల నిర్వహణ జరగాలని, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఎంఈఓ పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.



ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొని విద్యాశాఖ సూచనలను పాటిస్తామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలని ఎంఈఓ విద్యాసాగర్ పిలుపునిచ్చారు.

## ఎడ్ల గురువారెడ్డి సేవలు మరిచిపోలేనివి: నందిని సిద్ధారెడ్డి

**సిద్దిపేట, జూన్ 13**
**(వుదయం బ్యూరో)**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే, ప్రజా రక్షకుడు కామ్రేడ్ ఎడ్ల గురువారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, రచయిత నందిని సిద్ధారెడ్డి హాజరై, గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. యన జీవితం ఆదర్శప్రాయం. తెలంగాణ చరిత్రలో ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఆయన జీవిత చరిత్రను రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో చేర్చాలి అన్నారు.సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ, ఎడ్ల గురువారెడ్డి కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతాంగ పోరాటాలకు చేసిన సేవలు అపారమన్నారు. ప్రజా సమస్యలపై రాజీపడకుండా పోరాడిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనమిచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ వర్ధంతి వేడుకల్లో ఎడ్ల గురువారెడ్డి స్మారకార్థం పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. డాక్టర్ పాపయ్య (తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు), అంజయ్య(సీనియర్ ప్రాతికేయులు రంగాచారి (TUWJ జిల్లా అధ్యక్షులు) కడవేరుగు రాజనర్సు (మాజీ మున్సిపల్ చైర్మన్)ఎడ్ల వెంకటరామిరెడ్డి(సీపీఐ సీనియర్ నాయకులు) కిష్టపురం లక్ష్మణ్ (సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు)
సీపీఐ నాయకులు గజాభీమకర్ బన్సీలాల్, హరిఫ్, చంద్రం, మల్లేశం, భిక్షపతి తదితరులు. పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించినపథకాలు

## ప్రతి ఇంటికి చేరినాయి బిజెపి

**మరికల్ జూన్ 13**
**( వుదయం ప్రతినిధి)**
మరికల్ మండల కేంద్ర పరిధిలోని ఎలిగండ్ల గ్రామంలో శనివారం నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి పథకాలు అందించిందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తెలిపారు
ఈ సమావేశం నాయన మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి ప్రతి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పథకాలు పంపిణీ చేసిందని మన తెలంగాణ రాష్ట్రానికి ఎన్నో పథకాలు ముట్టినావి అని ఇంటింటి ప్రచారం చేశారు రాబోయే కాలంలో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి సర్పంచ్ అశ్విని నరేష్ గౌడ్ మండల నాయకుడు వేణుగోపాల్ భాస్కర్ రెడ్డిరాజేష్ నరేష్ తో పాటు బిజెపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఇలా దువ్వితే.. జుట్టు రాలదట..!

జుట్టును అదే పనిగా దువ్వుకుంటే ఎక్కువగా రాలిపోతుందనుకుంటాం.. అందుకే ఏదో అలా పైపైన దువ్వుకుని జడ వేసేసుకుంటాం. అయితే ఇలా చేయడం వల్ల కూడా చిక్కులు కట్టి జుట్టు రాలిపోతుంటుంది. అందుకే హడావిడిగా కాకుండా.. కుదుళ్ల నుంచి చివర్ల దాకా నెమ్మదిగా జుట్టును దువ్వుకోవాలంటున్నారు నిపుణులు.

## నెమ్మదిగానే ఎందుకు?

సాధారణంగా మనం రోజూ జుట్టు దువ్వుకునే క్రమంలో సుమారు 50 నుంచి 100 వెంట్రుకల దాకా రాలిపోతాయంటున్నారు నిపుణులు. అయితే కాస్త సమయం వెచ్చించి నెమ్మదిగా దువ్వుకోవడం వల్ల జుట్టు రాలే సమస్య క్రమంగా తగ్గుతుందని చెబుతున్నారు.

కుదుళ్లలో సహజసిద్ధమైన నూనెల్ని విడుదల చేసే సెబేషియస్ గ్రంథులుంటాయి. దువ్వే క్రమంలో అవి ప్రేరేపితమై అవసరమైన మొత్తంలో నూనెల్ని విడుదల చేస్తాయట. ఫలితంగా కుదుళ్లు, జుట్టు తేమను కోల్పోకుండా ఉంటాయి. ఇది జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తుందంటున్నారు నిపుణులు.



జుట్టులో దుమ్ము–ధూళి చేరి.. సరిగ్గా దువ్వకపోతే చిక్కులు కట్టినట్లుగా తయారవుతుంది. జుట్టు రాలడానికి ఇదీ ఓ కారణమే! కాబట్టి ఇలాంటప్పుడు చిక్కులు తొలగిస్తూ జుట్టును దువ్వుకోవడం వల్ల జుట్టు రాలకుండా ఉండడంతో పాటు వెంట్రుకలు–కుదుళ్లలో చిక్కుకున్న దుమ్ము–ధూళి కూడా తొలగిపోతాయంటున్నారు నిపుణులు.

## ఎన్నిసార్లు దువ్వుకోవాలి?

జుట్టు దువ్వుకోవడం మంచిదన్నాం కదా అని ఎలా పడితే అలా.. ఎంతసేపు పడితే అంతసేపు దువ్వుకోవడం కూడా మంచిది కాదంటున్నారు నిపుణులు. దువ్వెన కుదుళ్లకు తాకేలా, వెంట్రుకల్లో చిక్కులు తొలగించుకుంటూ పైనుంచి కింది వరకు నెమ్మదిగా దువ్వుకోవాలి. ఈ క్రమంలో చెక్కతో చేసిన ప్యాడిల్ బ్రష్/దువ్వెన ఉపయోగిస్తే వెంట్రుకలు, కుదుళ్లు డ్యామేజ్ కాకుండా ఉంటాయంటున్నారు నిపుణులు.

### తడి జుట్టు ఇలా!

తడిగా ఉన్న జుట్టును ఆరాక దువ్వుకుందాంలే అని వదిలేస్తుంటారు చాలామంది. తద్వారా వెంట్రుకలు చిక్కులు కట్టే అవకాశం ఉంటుంది. అందుకే తడిగా ఉన్న జుట్టును ఇలా దువ్వుకోవాలి. తలస్నానం చేశాక కండిషనర్ రాసుకోవాలి. ఒకవేళ ఈ అలవాటు లేని వారు దీన్ని వదిలేయచ్చు.

ఇప్పుడు బ్రిజిల్స్ మధ్య గ్యాప్ ఎక్కువగా ఉన్న, చివర్ల వద్ద మృదువైన బొడిపెల్లా ఉన్న దువ్వెన తీసుకొని కుదుళ్ల వద్ద నుంచి చివర్ల దాకా దువ్వుతూ రావాలి. ఈ క్రమంలో ఎక్కడైనా చిక్కులు కట్టినట్లు అనిపిస్తే వేళ్లతో వాటిని తొలగించాలి.

చిక్కులన్నీ తొలగిపోయాక.. మరోసారి జుట్టును పైనుంచి కింది వరకు దువ్వుకుంటే సరిపోతుంది. తడి జుట్టు బలహీనంగా ఉంటుంది కాబట్టి చిక్కులు తొలగించుకునేలా దువ్వుకుంటే చాలు.

### పొడి జుట్టు కోసం..!

జడ వేసుకున్నా, ముడేసుకున్నా, వదిలేసినా.. జుట్టు ఎక్కువగా చిక్కులు కట్టేది చివర్ల వద్దే.. కాబట్టి ముందుగా ఆ భాగంలో చిక్కులు తొలగించుకోవాలి. ఇందుకోసం జుట్టు మధ్య భాగం నుంచి కింది వరకు చిక్కులు తొలగించుకుంటూ నెమ్మదిగా దువ్వాలి.

ఇప్పుడు ఇంకాస్త పై నుంచి కింది వరకు నెమ్మదిగా దువ్వుకుంటూ రావాలి. ఆ తర్వాత ఇంకాస్త పై నుంచి.. ఆఖరుగా కుదుళ్ల నుంచి కింది దాకా మరోసారి జుట్టు మొత్తాన్ని దువ్వాలి. ఇలా చేయడం వల్ల చిక్కులు తొలగిపోతాయి.. జుట్టు కూడా ఎక్కువగా రాలకుండా ఉంటుందంటున్నారు నిపుణులు.

# బాత్‌రూమ్‌లో బొద్దింకలా?



బొద్దింకల బెడద చాలా ఇళ్లలో ఉంటుంది. వంటగది మూలల్లో, కిచెన్ క్యాబినెట్స్‌లోనే ఇవి ఎక్కువగా కనిపిస్తాయనుకుంటాం. కానీ బాత్‌రూమ్‌లోనూ ఇవి నక్కి ఉంటాయి. ఇందుకు బాత్‌రూమ్ అపరిశుభ్రంగా ఉండడం కూడా ఓ కారణమే అంటున్నారు నిపుణులు. అందుకే స్నానాల గది శుభ్రత విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల బొద్దింకల సమస్యను దూరం చేసుకోవచ్చంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం రండి..

తేమగా ఉన్న చోటికి బొద్దింకలు గుంపులుగా చేరతాయి. బాత్‌రూమ్‌లోనూ ఇలాంటి వాతావరణమే ఉంటుంది కాబట్టి అక్కడ కూడా వీటి బెడద ఎక్కువగానే ఉంటుంది. అందుకే పని పూర్తయ్యాక బాత్‌రూమ్‌ని పొడిగా ఉంచడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వైపర్‌తో ఫ్లోర్‌పై ఉన్న నీళ్లను లాగేయడం, గోడల్ని మాప్‌తో తుడిచేయడం, కుళాయిలు లీకవకుండా జాగ్రత్తపడడం.. ఇవన్నీ బొద్దింకల్ని తరిమికొట్టే మార్గాలే అంటు న్నారు. బాత్‌రూమ్‌లో హ్యూమిడిటీ స్థాయిలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి దీన్ని తగ్గించడానికి సరైన వెంటిలేషన్ ఏర్పాటుచేయడంతో పాటు ఎగ్జాస్ట్ ఫ్యాన్ అమర్చడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా బాత్‌రూమ్‌ని పొడిగా ఉంచుతూనే బొద్దింకలు రాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. టైల్స్ మధ్య ఖాళీలు, డ్రైనేజీ పైపుల్లో బొద్దింకలు నక్కి ఉంటాయి. కాబట్టి ఇలాంటి గ్యాప్స్‌ని నాణ్యమైన సీలెంట్‌తో ఎప్పటికప్పుడు మూసేయడం మంచిది. అలాగే డ్రైనేజీ జాలీపై మెష్ కవర్స్‌తో సీల్ చేయడం, రాత్రుళ్లు పడుకునే ముందు సిలికాన్ డ్రెయిన్ కవర్స్‌ని అమర్చడం వల్ల డ్రైనేజీ ద్వారా బొద్దింకలు బాత్‌రూమ్‌లోకి రాకుండా జాగ్రత్తపడచ్చు.

బాత్‌రూమ్ అపరిశుభ్రంగా ఉండడం వల్ల కూడా బొద్దింకలు ఎక్కువగా చేరుతుంటాయి. కాబట్టి ఫ్లోర్, టైల్స్, మూలల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. అలాగే వాడగా మిగిలిపోయిన సబ్బు ముక్కలు, షాంపూ బాటిల్స్, కండిషనర్ బాటిల్స్, డ్రైనేజీ జాలీపై పేరుకున్న చెత్త.. వంటివి తొలగించాలి. ఫలితంగా బాత్‌రూమ్ నీట్‌గా కనిపిస్తుంది.. బొద్దింకల బెడద కూడా ఉండదు. కొంతమంది బాత్‌రూమ్‌లో చెత్తబుట్ట ఏర్పాటుచేసుకుంటారు. ఇందులో వేసిన చెత్తను రోజూ తొలగించడం, డస్ట్‌బిన్‌ని పరిశుభ్రంగా ఉంచడం వల్ల బొద్దింకలు చేరకుండా జాగ్రత్తపడచ్చు. బాత్‌రూమ్‌లో బొద్దింకల బెడద లేకుండా ఉండాలంటే కొన్ని వంటింటి చిట్కాలు కూడా మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. నీళ్లలో కొన్ని చుక్కల పెప్పర్‌మెంట్ నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి.. బాత్‌రూమ్ డ్రైనేజీ, మూలల్లో స్ప్రే చేయాలి. నీళ్లలో వేప నూనె కలిపి.. బాత్‌రూమ్ మూలల్లో పోయాలి. నీళ్లు, వినెగర్ సమపాళ్లలో తీసుకొని.. ఈ మిశ్రమంతో బాత్‌రూమ్ ఫ్లోర్‌ని, గోడల్ని, టైల్స్‌ని శుభ్రం చేయాలి. బిర్యానీ ఆకు పొడిని బాత్‌రూమ్ మూలల్లో, డ్రైనేజీ వద్ద చల్లడం వల్ల బొద్దింకలు రాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు.

# చక్కని ఆరోగ్యం

## ఒత్తిడిని పోగొట్టే నీళ్ల ఆటలు...

ఏడాదంతా చదువులతో కుస్తీ పట్టిన పిల్లలకు ఉపశమనం ఇచ్చేది వేసవే. అందుకే, ఈ సెలవుల్లో పిల్లలను కేవలం ఏసీ గదులకో, టీవీ, మొబైల్ ఫోన్లకో పరిమితం చేయకండి. ఎండను సైతం పట్టించుకోకుండా ఆటలు ఆడేస్తుంటారు. ఈ తీవ్రమైన వేడి వారికి అనారోగ్యాలను కలగచేయకుండా ఉండాలంటే సాయంత్రం పూట చల్లటి నీళ్లల్లో ఆడించేయండి. స్ప్రింక్లర్ పెట్టి నీటి జల్లులో డ్యాన్స్ చేయించండి. వాటర్ బెలూన్స్ విసురుకోవడం, ఇంట్లో చిన్న ప్లాస్టిక్ పూల్స్ ఏర్పాటుచేయడం, వాటర్ గన్స్ వాడటం లేదా తోటలోని పైప్ ద్వారా నీళ్లు చల్లుకోవడం లాంటి ఆటలను మీరే దగ్గరుండి ఆడించండి. లేదంటే కనీసం స్విమ్మింగ్ అయినా నేర్పించండి. ఇవన్నీ వాళ్లలో ఉత్సాహాన్ని నింపుతాయి. మానసికంగా, శారీరకంగానూ ఉపశమనం అందిస్తాయి. రోజంతా ఉండే అలసటను, చికాకును దూరం చేసి, అద్భుతమైన ఒత్తిడి నివారిణిలా పనిచేస్తాయి. ఇలా ఆడటం వల్ల సహజంగా వ్యాయామమూ అందుతుంది. రాత్రిపూట హాయిగానూ నిద్రపడుతుంది. అంతేకాదు, మీరు కూడా కాసేపు మీ పనులను పక్కనపెట్టి వారితో కలిసి నీటి ఆటలు ఆడితే, పిల్లలు ఎంతో సంతోషిస్తారు. ఇది వాళ్ల మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది. అలాగే మీ దైనందిన ఒత్తిడి కూడా ఇట్టే మాయమవుతుంది.



## గోధుమపిండి... నల్లబడుతోందా?

రాత్రి అన్నం మానేయడం, ఒకేసారి ఎక్కువ కలిపేయడం, సమయం కలిసొస్తుంది... కారణమేదైతేనేం, మిగిలిన చపాతీ పిండిని ఫ్రిజ్‌లో పెడుతుంటాం. మామూలుగానే ఇది త్వరగా రంగు మారుతుంది లేదా నల్లబడుతుంది. అదేంటో వేసవిలో ఇంకా త్వరగా పాడవుతుంది. శ్రమ, పిండి రెండూ వృథా. అలా కావొద్దంటే... ఇలా రంగు మారడానికి ప్రాథమిక కారణం పిండి ఆక్సీకరణం చెందడం. పిండిలోని సహజ ఎంజైమ్‌లూ ఇందుకు కారణమే. దీంతో ఫ్రిజ్‌లో పెట్టినా పులిసే ప్రక్రియ కొనసాగుతుంది. ఒక్కోసారి నీళ్లు ఎక్కువైె కూడా పాడవుతుంది. అలా కూడా రంగు మారుతుంది. అసలే వేసవి... పిండి ఇంకా వేగంగా పులుస్తుంది. చెత్తబుట్ట పాలవుతుంది. అలా జరగొద్దంటే పిండి కలిపాక కాస్త వంటనూనెను పైన పట్టించండి. ఇది సురక్షిత పొరగా ఏర్పడి పిండి రంగు మారకుండా చూస్తుంది. అలాగే దాన్ని ఉంచే పాత్ర కూడా శుభ్రంగా ఉండాలి. గాలి చొరబడకుండా ఉంటే ఇంకా మేలు. పిండిని మొత్తంగా అలా ఉంచేయకూడదట. చిన్న చిన్న ముద్దలుగా విభజించి పెడితే మేలు. అప్పుడు త్వరగా పాడవకుండా ఉంటుంది. ఏదేమైనా మూడు నాలుగు రోజులకు ఒకేసారి కలపకండి. రెండు రోజులకోసారి వరకూ ప్రయత్నించవచ్చు. దాదాపుగా కలిపిన పిండిని రెండు రోజుల్లోగా వాడటం మేలు. అప్పుడు ఏ అనారోగ్యాలూ దరిచేరవు.



## సెలవులైనా లేపాల్సిందే!

వేసవి సెలవులొస్తే పిల్లలకీ హాయి, మనకీ ప్రశాంతత. హోమ్‌వర్క్, పరీక్షలు, వేళకు స్కూలుకి పంపాలన్న కంగారు మనకుండదు. చదివే బాధ తప్పింది, ఎంతసేపైనా చక్కా ఆడుకోవచ్చని వాళ్లూ సంతోషిస్తుంటారు. అలాగని ఆలస్యంగా పడుకుని, లేటుగా లేస్తున్నా ఊరుకుంటున్నారా? అదే పొరపాటు. ‘ఆ ఏముందిలే సెలవులేగా’ అని అసలే అనుకోవద్దు. సెలవులతో సంబంధం లేకుండా నిద్రావేళలు పాటించేలా చూడండి. లేదంటే వాళ్ల జీవగడియారం అస్తవ్యస్తం అవుతుంది. తిరిగి స్కూళ్లు ప్రారంభమయ్యాక ఇబ్బంది పడతారు. అదే ఒక సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేసి చూడండి. నాణ్యమైన నిద్ర అందుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. పైగా ఉదయాలు చాలా ప్రశాంతంగా ఉంటాయి. చల్లగాలి, పక్షుల కిలకిలరావాలు మనసుని ప్రశాంతంగా ఉంచుతాయి. ఆ సమయంలో వ్యాయామం, చదవడం, ఆరుబయట నడక, ఆడటం వంటివన్నీ వాళ్లకి సాయపడేవే. ముఖ్యంగా ఉదయపు ఎండ నుంచి వాళ్లకి విటమిన్ డి అందుతుంది. ఇది పిల్లల ఎముక ఆరోగ్యానికీ, రోగనిరోధకతను పెంచడానికీ మేలు చేస్తుంది. ముఖ్యంగా సమయానికి తింటారు దీంతో జీర్ణప్రక్రియ బాగుంటుంది. ఒక క్రమమైన జీవనశైలిని పాటించే పిల్లలు శాంతంగా, ఏకాగ్రతతో ఉంటారు. బద్ధకం, ఊరికే చిరాకు పడటం వంటివి ఉండవు. సెలవులు విశ్రాంతికే! అలాగని క్రమశిక్షణను పూర్తిగా పక్కన పడేయాల్సిన పనిలేదు. ఆడుకోనివ్వండి, ఆనందంగా ఉండనీయండి... పర్లేదు. కానీ ఆరోగ్యాన్నీ పట్టించుకోవాలి కదా! కాబట్టి, వేళలు పాటించండి. అప్పుడే తిరిగి స్కూళ్లు ప్రారంభమైనా ఇబ్బందిపడరు. సరేనా?



## ఈ మొక్క వల్ల ఉపయోగాలెన్నో..!

వంటలకు కమ్మని సువాసన, అమోఘమైన రుచిని అందించే ఆకుకూరలనగానే పుదీనా, కొత్తిమీర, మెంతి.. ఇవే గుర్తొస్తాయి. అయితే రోజ్‌మేరీలో కూడా ఈ గుణాలన్నీ ఉన్నాయి. అందుకే కొంతమంది ఈ మొక్క ఆకుల్ని కొత్తిమీరకు బదులుగా వాడుతుంటారు. ఈ క్రమంలోనే ఇది కిచెన్ గార్డెన్‌లోనూ ఓ భాగమైంది. అయితే ఇలా వంటకాలకు రుచిని అందించడమే కాదు.. దీనివల్ల ఇంట్లో, పెరట్లో బోలెడన్ని ఉపయోగాలున్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. పెరట్లో పెంచే కాయగూర మొక్కలకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ఈ మొక్కలకు దగ్గర్లో రోజ్‌మేరీ మొక్కని నాటమని సలహా ఇస్తున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ మొక్క వాసన మనకు పరిమళభరితంగానే అనిపిస్తుంది. కానీ చీడపీడలకు కారణమయ్యే క్రిములు, పురుగులు ఈ వాసనను భరించలేవట! అందుకే కాయగూరల మొక్కలకు దగ్గర్లో అక్కడక్కడా వీటిని నాటడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు. వార్డ్‌రోబ్స్‌లో చేరిన సిల్వర్‌ఫిష్ వంటి చిన్న చిన్న పురుగులను తరిమికొట్టడంలోనూ రోజ్‌మేరీ చక్కగా ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఎండిపోయిన రోజ్‌మేరీ ఆకుల్ని వార్డ్‌రోబ్ మూలల్లో ఉంచడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు. ఈ మొక్కలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు అధికంగా ఉంటాయి. కొద్దిగా వైట్ వినెగర్‌లో కొన్ని నిమ్మతొక్కలు, కొన్ని రోజ్‌మేరీ ఆకుల్ని వేసి కాసేపు మరిగించాలి. ఈ మిశ్రమాన్ని చల్లారాక స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. ఇది సహజసిద్ధమైన క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. దీంతో ఆయా ఉపరితలాల్ని శుభ్రం చేసుకోవచ్చు. కావాలంటే సువాసన కోసం ఇందులో కొన్ని చుక్కల ఏదైనా అత్యవసర నూనె కూడా కలుపుకోవచ్చు. చాలా ఇళ్లలో బొద్దింకల బెడద ఎక్కువగా ఉంటుంది. దీన్నుంచి విముక్తి పొందాలంటే ఎండబెట్టిన రోజ్‌మేరీ ఆకుల్ని ఇంట్లో అక్కడక్కడా ఉంచాలి. దీనివల్ల ఫలితం ఉంటుంది. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో ఇంటి అలంకరణ కోసం కూడా ఈ ఆకుల్ని ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పూలతో కలిపి ఇంటి గుమ్మాలు, పూజా మండపాన్ని డెకరేట్ చేసుకోవచ్చని చెబుతున్నారు. నీళ్లు, నిమ్మరసం, రోజ్‌మేరీ ఆకులు.. ఈ మూడింటినీ కొద్ది మోతాదుల్లో తీసుకొని కాసేపు మరిగించుకోవాలి. ఈ క్రమంలో వెలువడే వాయువుల వల్ల ఇల్లంతా పరిమళభరితంగా మారుతుంది. ఇలా ఇంటిని సువాసనభరితం చేయడంలోనూ రోజ్‌మేరీ కీలక పాత్ర పోషిస్తుంది. రోజ్‌మేరీ ఆకుల్ని ఎండబెట్టి పొడి చేసి రూపొందించే హెర్బల్ శాషేలు, ఎండిన ఆకులు నింపిన గాజు జార్స్.. మొదలైన వాటిని బహుమతులుగా కూడా అందించవచ్చంటున్నారు నిపుణులు. ఈ ప్రయత్నం పర్యావరణహితంగానూ ఉంటుంది.



## విహారాల్లో... స్టైల్‌గా!

వేసవి అంటేనే విహారాల సమయం. దానికోసం ఎక్కడికి ఎలా వెళ్లాలంటూ ముందు నుంచే ప్రణాళికలు వేసుకుంటాం. అన్నీ ఆలోచిస్తాం కానీ... చిన్న చిన్న ఇబ్బందులు ఉంటాయి. అవి త్వరగా తట్టవు. అలాగని వదిలేసేవీ కావు. అలాంటి కొన్ని చిట్టి సమస్యలకు స్టైలిష్ పరిష్కారాలివి... అన్ని ప్రదేశాలనూ చుట్టేయాలని ఎవరికి మాత్రం ఉండదు? కానీ కొందరికి కారు, బస్సు, రైలు... ఎక్కడం ఆలస్యం వాంతులు మొదలు. ఏమీ తినకుండా, తాగకుండా ఎన్ని గంటలని ప్రయాణిస్తారు. ఇది వాళ్లకే కాదు... పక్కనున్న వాళ్లకీ ఇబ్బందే. దీనికోసం ట్యాబ్లెట్లు, ఇంటి చిట్కాలంటూ ఎన్నెన్నో ప్రయత్నిస్తుంటారు. అయినా కొందరికి ప్రయోజనం ఉండదు. ఈసారి ఈ ‘యాంటీ నాసియా బ్యాండ్’లను ప్రయత్నించండి. బ్రేస్‌లెట్‌లా చేతికి పెట్టుకోవడమే. ఆక్యుప్రెజర్ పాయింట్‌కి దగ్గరగా బటన్ వచ్చేలా చేసి, దాన్ని నొక్కడమే. అది ఆక్యుప్రెజర్ పాయింట్‌మీద పనిచేసి, వాంతులు రాకుండా ఆపుతుంది. వీటిలోనూ వాచ్, బ్యాండ్...



ఇలా చాలారకాలే వస్తున్నాయి. భిన్నరంగుల్లోనూ టెక్ తరహావీ దొరుకుతున్నాయి. కావాలంటే తెప్పించుకుని చూడండి. వేసవిలో బీచ్‌లను మించిన ఉపశమనం ఏముంటుంది? పిల్లలతో అలా సరదాగా పార్క్‌లు, వాటర్ గేమ్స్‌కి వెళ్లడమూ సరదాగా ఉంటుంది. ఆ సమయంలో పెద్ద అడ్డు ఏదంటే కళ్లజోడు అనే చెప్పాలి కదూ! వీలైతే ఎలాగూ తీసేస్తాం. కానీ కొన్ని సందర్భాల్లోనే కష్టం. అందుకని ఇంట్లో పెట్టి వెళ్లలేం. మరి తీసినప్పుడు ఎక్కడ పెట్టాలి? పొరపాటున కిందపడి పగిలితే అదో ఖర్చు. అందుకే ‘ఐ గ్లాస్ హోల్డింగ్ బ్రూచ్’ని కొనుక్కోండి. దీన్ని దుస్తులకు ఒక బటన్‌లా పెట్టుకోవడమే. అవసరం లేదనుకున్నప్పుడు కళ్లజోడు తీసి, దీనికి తగిలిస్తే సరి. చూడటానికి స్టైలిష్‌గానూ ఉంటుంది. కళ్లజోడు తిప్పలూ తప్పుతాయి. ఏ దుస్తుల మీదకైనా సరిపోయే హెయిర్ స్టైల్ అంటే హెయిర్‌లీవ్ లేదంటే పోనీ అనే చెబుతాం కదూ! పైగా



విహారాల్లో ఫొటోలు క్లిక్ మనాల్సిందే. స్టైల్‌గా ఉంటుందని జుట్టు విరబోస్తాం లేదంటే క్లిప్ పెట్టి వదిలేస్తాం సరే! తరవాతే తిప్పలు. అసలే వేసవి... ఉక్కబోతకి జుట్టు మెడకి అతుక్కుపోతుంటే చిరాకేయడం మామూలే. ఇకప్పుడు వెతుకుతాం బ్యాండు కోసం. అదేమో బ్యాగులో ఏ మూలో పడి ఎంతకీ దొరకదే! అందుకే చాలామంది చేతికి పెట్టేస్తుంటారు. కొన్నిసార్లు రక్తప్రసరణకి ఇబ్బందైతే ఇంకొన్నిసార్లు చూడటానికీ ఇబ్బంది. ఈ రబ్బర్‌బ్యాండ్ హోల్డర్ బ్రేస్‌లెట్ ప్రయత్నించండి. చక్కగా గాజు లేదంటే మెటల్ బ్రేస్‌లెట్‌లా ఉంటుంది. దానికే హెయిర్ బ్యాండ్‌నీ పెట్టేసుకోవచ్చు. చూడటానికీ స్టైల్‌గా ఉంటుంది. అవసరానికీ పనికొస్తుంది. ఏ దుస్తులకైనా నప్పేస్తుంది. భిన్నరంగులవి కలిపి వేసుకుంటే వేరే గాజుల అవసరమూ ఉండదు. బాగున్నాయి కదూ! ప్రయత్నించండి మరి.




## ఈక్విటీ విభాగంలో దీర్ఘకాలిక ఫ్యూచర్స్, ఆప్షన్స్ కాంట్రాక్టులు




దేశీయ డెరివేటివ్స్, క్యాష్ మార్కెట్‌లను విస్తృతం చేయడంపై దృష్టి సారిస్తున్నామని సెబీ ఛైర్‌పర్సన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. కేపిటల్ మార్కెట్లను బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా, ఈక్విటీ విభాగంలో దీర్ఘకాలిక ఫ్యూచర్స్, ఆప్షన్స్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టే అంశాన్ని సెబీ పరిశీలిస్తున్నట్లు వివరించారు. 'దీర్ఘకాలిక ఫ్యూచర్స్, ఆప్షన్ల కాంట్రాక్టుల వల్ల మార్కెట్‌లో మదుపర్ల భాగస్వామ్యాన్ని పెరుగుతుంది. నష్ట నిర్వహణ సామర్థ్యం మెరుగుపడుతుంద'ని ఓ కార్యక్రమంలో పాండే అన్నారు. క్యాష్, డెరివేటివ్స్ మార్కెట్ మధ్య అనుసంధానతను సులభతరం చేయడానికి, ద్రవ్యలభ్యతను పెంచడానికి సెక్యూరిటీల లావాదేవీలు, షార్ట్ సెల్లింగ్ ఫ్రేమ్‌వర్క్‌లను సమగ్రంగా సమీక్షిస్తున్నామని తెలిపారు.

# నాస్‌డాక్-100 నుంచి కాగ్నిజంట్ బయటకు..




ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ(ఏఐ) విప్లవం రాకతో ఐటీ కంపెనీల షేర్లు ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ఐటీ దిగ్గజం కాగ్నిజంట్‌పైనా ఈ ప్రభావం కాస్త ఎక్కువగానే పడుతోంది. అమెరికాలోని నాస్‌డాక్-100 సూచీ నుంచి కాగ్నిజంట్ బయటకు వస్తోంది. ఏఐ బూమ్ నుంచి ప్రయోజనం పొందే కంపెనీలకు ఐటీ కంపెనీలు దారి ఇస్తున్నాయి. కాగ్నిజంట్‌తో పాటు, చార్టర్ కమ్యూనికేషన్స్, ఇన్స్‌మెడ్, వరిస్క్ అనలిటిక్స్, స్కేలర్ వంటి సంస్థలను సూచీ నుంచి తొలగిస్తున్నట్లు నాస్‌డాక్ జూన్ 11న ప్రకటించింది. నాస్‌డాక్-100 సూచీ అనేది 100 అతిపెద్ద బ్యాంకింగేతర కంపెనీల పనితీరును లెక్కలోకి తీసుకుంటోంది.

ఇదీ కారణం: ఇన్వెస్టర్లు ఎక్కువగా ఏఐ మౌలిక వసతులు, అధునాతన సెమీకండక్టర్ సాంకేతికతలు, సెమీకండక్టర్ సంస్థలపై దృష్టి సారిస్తుండడంతో వాటి మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ప్రామాణిక సూచీలో చేరడానికి అవి అర్హత సాధించాయి. అందులో అస్టెరా ల్యాబ్స్, కోర్‌వీవ్, నెబియస్ గ్రూప్, రాకెట్ ల్యాబ్స్, టెరాడైన్ వంటివి ఉన్నాయి.

భారత్‌లోనూ: దేశీయంగానూ ఐటీ కంపెనీల షేర్లలో ఊగిసలాటలు కనిపిస్తున్నాయి. విప్రో కూడా నిఫ్టీ-50 నుంచి ఈ ఏడాది సెప్టెంబరులో బయటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. దాని స్థానంలో బీఎస్ఈ షేరు చేరొచ్చు. 2026 ప్రారంభం నుంచీ చూస్తే నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 25% నష్టపోయింది. రూ.7 లక్షల కోట్ల విలువను కోల్పోయింది. దేశీయ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా కూడా ఎంచదగ్గరీతిలోనూ మార్కెట్ విలువను కోల్పోయాయి

# మేలో 13.39 లక్షల టన్నుల వంట నూనెల దిగుమతి

దేశంలోకి వంట నూనె దిగుమతులు మేలో 6.7% పెరిగి 13.39 లక్షల టన్నులకు చేరాయి. 2025 మేలో ఇవి 12.54 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. ప్రధానంగా ముడి సోయాబీన్ నూనె దిగుమతులు పెరగడమే ఇందుకు కారణమని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) నివేదిక తెలిపింది. ఏడాది వ్యవధిలో ముడి సోయాబీన్ నూనె దిగుమతులు 3,98,585 టన్నుల నుంచి 4,93,854 టన్నులకు పెరిగాయి. నాన్- ఎడిబుల్ నూనెల దిగుమతులు 12,040 టన్నుల నుంచి రెట్టింపునకు పైగా పెరిగి 26,202 టన్నులకు చేరాయి. మొత్తం వెజిటేబుల్ ఆయిల్ (వంట నూనెలు, నాన్ ఎడిబుల్ నూనెలు కలిపి) దిగుమతులు 12.67 లక్షల టన్నుల నుంచి 8% పెరిగి 13.65 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. 2025-26 నూనెల సంవత్సరం (నవంబరు - అక్టోబరు) తొలి ఏడు నెలల్లో వెజిటేబుల్ ఆయిల్ దిగుమతులు 12% పెరిగి 93.65 లక్షల టన్నులకు చేరాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 83.39 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. 2025-26 తొలి 7 నెలల్లో వంట నూనెల దిగుమతులు 92.17 లక్షల టన్నులకు చేరాయి. ఏడాది



క్రితం

ఇదే సమయంలో జరిగిన 81.31 లక్షల టన్నుల కంటే ఇవి 13% అధికం. నాన్ ఎడిబుల్ ఆయిల్ దిగుమతులు 2,07,505 టన్నుల నుంచి 1,47,710 టన్నులకు తగ్గాయి.

# పెట్రోల్ బంకుల్లో బల్క్ వినియోగదారులపై నిషేధం



డీజిల్ రిటెయిల్ విక్రయాలపై ప్రభుత్వం పరిమితులు విధించింది. రోజుకు ఒక వాహనానికి గరిష్ఠంగా 200 లీటర్లు మాత్రమే డీజిల్ విక్రయించాలని ఆదేశించింది. పారిశ్రామిక, వాణిజ్య, సంస్థాగత వినియోగదారులు ఇకపై బంకుల నుంచి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయడాన్ని పూర్తిగా నిషేధించారు. వారు తమ అవసరాల కోసం సొంతంగా ఉన్న కన్జ్యూమర్ పంప్స్ ద్వారానే ఇంధనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. బంకుల్లో డీజిల్‌ను నేరుగా వాహనం ఇంధన ట్యాంక్ లేదా పెసో (పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్) ఆమోదించిన కంటెయినర్లలో మాత్రమే నింపాలి. ఈ విధంగా కొనుగోలు చేసిన డీజిల్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ మరొకరికి తిరిగి విక్రయించకూడదు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా తలెత్తిన సరఫరా ఇబ్బందుల వల్ల, దేశంలో డీజిల్‌కు కొరత రాకుండా చూడటానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి జరిగే బల్క్ కొనుగోళ్లను నియంత్రించాలని జూన్ 11న చమురు మార్కెటింగ్ కంపెనీలను పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ కొత్త నిబంధనలు ప్రాథమికంగా 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధర భారీగా పెరిగింది. కానీ ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను అదుపులో ఉంచాయి. దీంతో వాణిజ్య అవసరాలకు విక్రయించే (బల్క్), రిటెయిల్ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడింది. ఉదాహరణకు దిల్లీలో లీటర్ డీజిల్ రిటెయిల్ ధర రూ.95.20 కాగా.. బల్క్ ధర లీటరు రూ.134.50. ఈ నేపథ్యంలోనే టెలికాం టవర్లు, ఫ్యాక్టరీలు, విద్యుత్తు జనరేటర్ల కోసం పారిశ్రామిక సంస్థలతో పాటు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ బస్సులు, ట్రక్ కంపెనీలు కూడా మార్కెట్ రేటుకు ఇంధనాన్ని కొనుగోలు చేయకుండా, సాధారణ పెట్రోల్ బంకులను ఆశ్రయించడం మొదలుపెట్టాయి. ప్రైవేట్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ధర ఎక్కువగా ఉంచడంతో.. అత్యధికులు ప్రభుత్వ రంగ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ బంకులకే పోటెత్తుతున్నారు. ఫలితంగా మేలో ప్రభుత్వ కంపెనీల పెట్రోల్ అమ్మకాలు 4.8%, డీజిల్ విక్రయాలు 6.4% అసాధారణంగా పెరిగాయి. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, ఇంధన తరలింపులు వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ కొత్త ఉత్తర్వుల్లోని నిబంధనలను ఉల్లంఘిస్తే, నిత్యావసరాల వస్తువుల చట్టం కింద శిక్షార్హులు అవుతారని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఏదైనా ఒక ప్రత్యేక ప్రాంతానికి, నిర్దిష్ట వినియోగదారులకు లేదా అత్యవసర లావాదేవీలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం కేంద్రానికి ఉంటుంది.

# మళ్లీ బ్యాంకు డిపాజిట్ల వైపు ఇన్వెస్టర్లు..

స్టాక్ మార్కెట్లో ఒడుదొడుకులు, భౌగోళిక - రాజకీయ ఆందోళనల నేపథ్యంలో.. భారతీయ కుటుంబాలు తమ పొదుపు మొత్తాలను తిరిగి బ్యాంకు డిపాజిట్ల (ఎఫ్‌డీ) వైపు మళ్లిస్తున్నాయి. మార్కెట్లలో నష్టభయం ఎక్కువగా ఉండటంతో, సురక్షిత పెట్టుబడుల వైపు మదుపరులు ఆసక్తి చూపుతున్నార'ని యెస్ బ్యాంక్ సీఈఓ వినయ్ టోన్సే వెల్లడించారు. రుణాలకు డిమాండు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, డిపాజిట్లు క్రమంగా పెరగడం బ్యాంకులకు ఊరటనిచ్చే అంశమని తెలిపారు.

రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) గణాంకాల ప్రకారం మే 15 నాటికి బ్యాంకుల రుణాల వృద్ధి 16.2% కాగా, ఇదే సమయంలో డిపాజిట్ల వృద్ధి 12.2 శాతానికే పరిమితమైంది. 'పరిశ్రమ వ్యాప్తంగా, మా బ్యాంకులోనూ పొదుపు మొత్తాలు తిరిగి డిపాజిట్ల రూపంలోకి వస్తున్నట్లు కనిపిస్తోంది' అని ఆయన తెలిపారు. ఈక్విటీల నుంచి వెనక్కి..: 2024 సెప్టెంబరులో రికార్డు స్థాయికి చేరుకుని, ప్రపంచంలోనే అత్యుత్తమ పనితీరు చూపించిన భారత స్టాక్ మార్కెట్లు (నిఫ్టీ 50), ఆ తర్వాత తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. షేర్ల విలువలు అధికం కావడం, ఇతర దేశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) రంగానికి వస్తున్న ఆదరణ కారణంగా విదేశీ పెట్టుబడిదారులు మనమార్కెట్లలో షేర్లు అమ్మేసి, నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు ధర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా మేలో భారత ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడుల




ప్రవాహం మూడేళ్ల కనిష్ఠానికి తగ్గింది. ఒక నివేదిక ప్రకారం.. నిఫ్టీ 200 ఇండెక్స్ ఆధారిత సిప్ రాబడులు రెండేళ్ల వ్యవధిలో ప్రతికూల స్థాయికి పడిపోగా, అయిదేళ్ల వ్యవధిలో బాండు రాబడుల కంటే తక్కువగా నమోదయ్యాయి. కొన్నేళ్లుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే, ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో రాబడులు ఎక్కువగా ఉండటంతో కుటుంబాలు అటువైపు మొగ్గు చూపిన విషయం తెలిసిందే. విస్తరణ దిశగా: గతంలో తక్కువ రాబడి రుణాలకు దూరంగా ఉన్న యెస్ బ్యాంక్.. ఇకపై గృహ, వాహన, రిటెయిల్ రుణాల విభాగంలో భారీగా విస్తరించే ప్రయత్నాల్లో ఉన్నట్లు టోన్సే తెలిపారు. డిపాజిట్లు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.






## ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500.. సెమీస్‌లో సింధు ఓటమి

ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు మరోసారి నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్లో టాప్ సీడ్ యమగుచి (జపాన్) చేతిలో సింధు ఓటమిపాలైంది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అయిన యమగుచి చేతిలో 22-20, 21-12 తేడాతో భారత స్టార్ షట్లర్ పరాజయం చవిచూసి ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి గేమ్‌లో చాలాసేపు సింధు ఆధిక్యంలో నిలిచింది. కానీ, యమగుచి పట్టువదలకుండా పోరాడటంతో 20-20తో స్కోరు సమం అయింది. ఆ తర్వాత యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి జోరు కొనసాగించి సునాయసంగా విజయం సాధించింది.

# యశస్వి జైస్వాల్ ఆల్‌ఫార్మాట్ ప్లేయర్: సెహ్వాగ్



ఇప్పుడున్న యువ క్రికెటర్లలో అన్ని ఫార్మాట్లలోనూ ఆడగలిగే ప్లేయర్ యశస్వి జైస్వాల్. ఇటు టెస్టులతోపాటు పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ నాణ్యమైన ప్రదర్శన చేయగలడు. అయితే, అతడికి ఇటీవల తెల్లబంతి క్రికెట్‌లో అవకాశాలు పెద్దగా రావడం లేదు. వన్డేల్లో రోహిత్ శర్మతో కలిసి గిల్ ఓపెనర్‌గా వస్తుండటంతో యశస్వి ఎక్కువగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తోంది. తాజాగా అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కూ విరాట్ స్థానంలో యశస్వికి అవకాశం దక్కింది. అయితే, తుది జట్టులో ప్లేస్ వస్తుందా? లేదా? అనేది అనుమానమే. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ మాత్రం భవిష్యత్తులో యశస్వి మూడు ఫార్మాట్లలోనూ ఆడతాడని నమ్మకంగా చెబుతున్నాడు. ''యశస్వి జైస్వాల్ ఇప్పటివరకు కేవలం నాలుగు వన్డేలు మాత్రమే ఆడాడు. అందులో ఒక సెంచరీ కూడా ఉంది. కానీ, తర్వాత అవకాశాలు రాలేదు. ఎందుకంటే కెప్టెన్ శుభమన్ గిల్ ఓపెనర్‌గా వస్తున్నాడు. రోహిత్ శర్మ ఇంకా వన్డేల్లోనూ కొనసాగుతున్నాడు. దీంతో ఓపెనర్ స్లాట్ ఖాళీగా లేదు. త్వరలోనే రోహిత్ వన్డేలకూ వీడ్కోలు పలికే అవకాశం ఉంది. అప్పుడు యశస్వి జైస్వాల్ ఓపెనర్‌గా రావచ్చు. అయితే, అతడికి రుతురాజ్ గైక్వాడ్ నుంచి పోటీ తప్పదు. జట్టులోకి ముగ్గురు ఓపెనర్లను తీసుకుంటే మాత్రం యశస్వి జైస్వాల్ తప్పకుండా ఉంటాడు. ఇప్పుడు కూడా రోహిత్ లేదా గిల్ లేదా ఇతర క్రికెటర్ ఎవరైనా అందుబాటులో లేనప్పుడే యశస్వి జట్టులోకి వస్తున్నాడు. అంతేకానీ, అవకాశం వచ్చి సరిగా ఆడకపోవడం వల్ల పక్కన పెట్టడం లేదు. ఛాన్స్ వచ్చినప్పుడు చక్కగా ఆడాడని మాత్రం మరువకూడదు'' అని సెహ్వాగ్ తెలిపాడు. ''మరో ఆటగాడు ఇషాన్ కిషన్‌కు కూడా ఎక్కువగా వన్డే జట్టులో చోటు దక్కడం లేదు. ఈ ఫార్మాట్‌లో అతడు డబుల్ సెంచరీ చేశాడు. అదీనూ వేగవంతమైన ద్విశతకం సాధించాడు. కాబట్టి.. అతడూ పరిగణనలోకి తీసుకోవాల్సిన క్రికెటర్. అయితే, యశస్వి జైస్వాల్‌కు రాబోయే కాలంలో అన్ని ఫార్మాట్లలోనూ చోటు కల్పించాల్సిన అవసరం ఉంది'' అని సెహ్వాగ్ విశ్లేషించాడు. సెహ్వాగ్ వ్యాఖ్యలను మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ కూడా సమర్థించాడు. యశస్వి జైస్వాల్‌ను తప్పకుండా జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ తర్వాత ఇద్దరు సీనియర్ ప్లేయర్లు రిటైర్‌మెంట్ తీసుకుంటారని.. ఆ ప్లేస్‌లను భర్తీ చేసే క్రమంలో యశస్వికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని తివారీ పేర్కొన్నాడు.

## బ్రెజిల్‌కు భారీ షాక్..

ఫిఫా ప్రపంచ కప్‌లో ప్రధాన ఆకర్షణ కలిగిన ప్లేయర్లలో నెయ్‌మర్ ఒకరు. బ్రెజిల్‌కు చెందిన ఈ స్టార్ ఆటగాడి ఆటను చూడాలని ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉవ్విళ్లూరుతారు. కానీ, వరల్డ్ కప్ 2026 తొలి మ్యాచ్‌లో నెయ్‌మర్ బరిలోకి దిగడం లేదు. బ్రెజిల్‌కు కీలక ప్లేయర్ అయిన 34 ఏళ్ల నెయ్‌మర్ లేకపోవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బే. మొరాకోతో ఆదివారం




వేకువజామున 3.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) బ్రెజిల్ తలపడనుంది. టైటిల్ ఫేవరెట్ అయిన బ్రెజిల్ నెయ్‌మర్ లేకుండా తమ తొలి మ్యాచ్‌లో ఎలా ఆడుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పిక్క గాయం కారణంగా నెయ్‌మర్ తమ జట్టు మొదటి మ్యాచ్‌కు దూరంగా ఉంటాడని బ్రెజిల్ కోచ్ కార్లో వెల్లడించాడు. అయితే, అతడు కోలుకోవడానికి ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉందని ఫిఫా వర్గాలు పేర్కొన్నాయి. గ్రూప్ స్టేజ్ మ్యాచులన్నింటినీ మిస్ అయ్యే ప్రమాదం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే ఐదుసార్లు ఛాంపియన్ అయిన బ్రెజిల్ కప్ ఆశలు ఇబ్బందుల్లో పడినట్లే. గ్రూప్ Fలో ఉన్న బ్రెజిల్.. జూన్ 19న హైతీతో, జూన్ 24న స్కాట్లాండ్‌తో తలపడనుంది. అప్పటికైనా కోలుకుని వస్తాడనే గ్యారంటీని బ్రెజిల్ కోచ్ కూడా ఇవ్వలేదు. ''వీలైనంత త్వరగా ఫిట్‌నెస్ సాధించడానికి నెయ్‌మర్ ప్రయత్నిస్తున్నాడు. తప్పకుండా వచ్చేవారం నాటికి కోలుకుని సిద్ధమవుతాడని ఆశిస్తున్నాం. జట్టులోని కుర్రాళ్లకు అతడు స్ఫూర్తి. ఆరో టైటిల్‌ను నెగ్గాలనే బ్రెజిల్ కలను సాకారం చేసుకొనేందుకు నెయ్‌మర్ అనుభవం పనికొస్తుంది. అతడు లేకుండా ఎలా ఆడాలనే దానిపైనా మేం సన్నద్ధమయ్యాం. మా ఆటతీరులో ఎలాంటి మార్పు ఉండదు'' తెలిపాడు.

## ఫిఫా వరల్డ్ కప్‌లో అమెరికా అరుదైన ఘనత

ఆతిథ్య అమెరికా ఫిఫా వరల్డ్ కప్‌లో శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. ఇప్పటివరకు ఎన్నడూ ఈ ఫీట్‌ను సాధించలేదు. మొదట్నుంచీ దూకుడుగానే ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. మ్యాచ్ ముగిసేనాటికి 4-1 తేడాతో పరాగ్వేను అమెరికా చిత్తు చేసింది.

సొంత ప్రేక్షకుల మధ్య అమెరికా చెలరేగింది. పరాగ్వేపై ఎదురుదాడి చేసింది. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఇక



ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో అమెరికా ముందు పరాగ్వే నిలవలేకపోయింది. దీంతో తొలి అర్ధభాగం సమయానికే 3-0 ఆధిక్యంలోకి అమెరికా వెళ్లిపోయింది. రెండో హాఫ్‌లో 73వ నిమిషం వద్ద పరాగ్వే ఆటగాడు మౌరిసియో గోల్ కొట్టాడు. దీంతో అమెరికా లీడ్ 3-1కి తగ్గింది. ఆట అదనపు సమయంలో అమెరికా (90+8 నిమిషాల వద్ద) ప్లేయర్ గివోన్ని రీనా అదిరిపోయే గోల్ కొట్టి.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 4-1 తేడాతో తన జట్టును గెలిపించాడు. పరాగ్వే (37 శాతం)తో పోలిస్తే బంతిపై నియంత్రణ అమెరికాకే (63 శాతం) ఎక్కువగా ఉంది. అంతకుముందు అర్ధరాత్రి మరో ఆతిథ్య దేశం కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. గ్రూప్ Bలో బోస్నియాతో జరిగిన పోరులో 1-1తో కెనడా సమంగా నిలిచింది. అయితే ఫిఫా ప్రపంచ కప్‌లో తొలిసారి కెనడా పాయింట్‌ను సాధించడం గమనార్హం. గత ఎడిషన్లలో ఆరు మ్యాచుల్లోనూ ఓడిపోయిన కెనడా.. ఈసారి డ్రా చేసుకుని పాయింట్‌ను సొంతం చేసుకుంది.

## అదంతా ఫ్రాంచైజీలు - ఆటగాళ్లే చూసుకోవాలి: బీసీసీఐ

ఐపీఎల్‌కు సంబంధించి పలు కీలక అంశాలపై బీసీసీఐ సమీక్ష నిర్వహించింది. క్రికెట్ వర్గాల సమాచారం ప్రకారం.. విదేశీ



ఆటగాళ్లు, ఫ్రాంచైజీల విషయంలో బీసీసీఐ జోక్యం చేసుకోదని స్పష్టత ఇచ్చింది. అలాగే వచ్చే వేలం కోసం పర్స్ విలువను పెంచాలనే విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇక 2027 సీజన్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభించడంపైనా కసరత్తు చేస్తున్నట్లు బీసీసీఐ పేర్కొంది. అలాగే రెండేళ్ల తర్వాత నుంచి ఐపీఎల్ మ్యాచులను పెంచేందుకూ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. విదేశీ ఆటగాళ్ల అందుబాటు విషయంలో ఇటీవల ముగిసిన సీజన్ సమయంలో ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై బీసీసీఐ చర్యలు తీసుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. కానీ, ఈ విషయంలో జట్లకు, ఆటగాళ్లకు మధ్య వారధిగా వ్యవహరించాలనే ఉద్దేశం తమకు లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఎవరైనా విదేశీ ప్లేయర్ వేలంలో సదరు ఫ్రాంచైజీకి వెళ్లాక.. సీజన్‌కు అందుబాటులో ఉండకపోతే రెండేళ్లపాటు బ్యాన్ విధించే అవకాశం ఉంది. అదీనూ గాయం కారణంగా చూపిస్తే మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోనక్కర్లేదు. ''ఆటగాళ్లకు కస్టోడియన్స్ ఫ్రాంచైజీలే. అందుబాటులో ఉండటంపై వారికే వదిలేస్తున్నాం. కొందరు తమ జాతీయ జట్టు కోసం ఐపీఎల్‌లో పాల్గొనకూడదని నిర్ణయించుకుంటారు. కానీ, మా రూల్స్ మాత్రం స్పష్టంగా ఉన్నాయి. గాయం మినహా.. మరే ఇతర కారణమైనా సరే రెండేళ్లపాటు బ్యాన్ విధిస్తాం'' అని బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి.

వుదయం సినిమా MOVIE TIME!

## రాజుబాబు జయంతి అందరికీ స్ఫూర్తినివ్వాలి స్మారక అవార్డుల ప్రదానంలో టి.డి. జనార్ధన్

వుదయం సినిమా రాజుబాబు జయంతిని ప్రతీసంవత్సరం ఆయన మిత్రులు జరపటం ఎంతో సముచితంగా ఉందని, ఇది అందరికీ మార్గదర్శనం కావాలని పలువురు వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. టి.వి., సినిమా నటుడు రాజుబాబు 69వ స్మార్థక అవార్డుల కార్యక్రమం శనివారం నాడు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో జరిగింది. వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులను ఈ సందర్భంగా సత్కరించారు.

తెలుగు దేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు టి.డి. జనార్ధన్ పురస్కారాన్ని స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ రాజబాబు జయంతిని ఆయన మిత్రులు జరపటం ఎంతో ఆనందంగా ఉందని, ఇది ప్రతీ వారికీ ఆదర్శం కావాలని తాను ఆకాంక్షిస్తున్నాని చెప్పారు.



## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ లాంచ్



**వుదయం:** వద్దే జిష్ణు సమర్పణలో వద్దే క్రియేషన్స్ బ్యానర్ మీద వద్దే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో వద్దే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వద్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో..వి.వి. వినాయక్ మాట్లాడుతూ .. ''వద్దే నవీన్ గారు ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నవీన్ గారితో సినిమా చేస్తున్న టైంలోనే 'ఆది'కి నాంది పలికినట్టు అయింది. నవీన్ గారు నన్నెంతో ఇష్టంగా చూసుకునేవారు. ఆయన కెరీర్‌లోని 90 శాతం సినిమాలు మనస్ఫూర్తిగా ఇష్టంతో చేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. సినిమాల పట్ల ఆయనెప్పుడూ తృప్తిగా ఉండరు. ఓ సందర్భంలో ఆయన పరపతి చూసి షాక్ అయ్యాను. ఇకపై ఆయన తన మనసుకు నచ్చిన చిత్రాలే చేయాలని కోరుకుంటున్నాను. 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.వద్దే నవీన్ మాట్లాడుతూ .. ''వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. ఆయన జర్నీ నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. మా కోసం వచ్చిన వినయ్‌కి థాంక్స్. సినిమా కోసం టీం అంతా ఇష్టపడి చేశారు. ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. ఏ ఫ్రైడే అయినా కూడా సింగిల్‌గా సినిమా రాలేదు.

## జూలై 10న వస్తోన్న అఖిల్ అక్కినేని 'లెనిన్'..



**వుదయం:**అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'లెనిన్'. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకుడు. ఈ సినిమాను జూన్ 26న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అయితే ఆ తేది మారింది. ఇప్పుడు సినిమా జూలై 10న రిలీజ్ కానుంది.తన అధికారిక ఎక్స్ అకౌంట్ ద్వారా ఈ విషయాన్ని నిర్మాత కింగ్ నాగార్జున తెలియజేశారు.

## ఓ..! సుకుమారి' పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్




**వుదయం:** యంగ్ ట్యాలెంట్ తిరువీర్, వెర్సటైల్ ఐశ్వర్య రాజేష్ తొలిసారిగా 'ఓ..! సుకుమారి' అనే గ్రామీణ నేపథ్యంలో సాగే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాతో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'శివం భజే' చిత్రాన్ని నిర్మించిన గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి దీనిని నిర్మిస్తున్నారు. ప్రధాన నటీనటుల ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన తర్వాత, చిత్ర బృందం ఇప్పుడు సినిమా టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తెచ్చింది.స్థానిక రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ, మంచి మనసున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కంటుంటాడు తిరువీర్ . అలాంటి సమయంలో దామిని అనే అమ్మాయిని చూసిన వెంటనే ఆమెనే తన జీవిత భాగస్వామిగా భావించి పెళ్లి ఏర్పాట్లు మొదలుపెడతాడు. అయితే ఆమె కుటుంబం ఆమెను తాకిన ఎవరికైనా విద్యుత్ షాక్ కొడుతుందనే ఒక విచిత్రమైన రహస్యాన్ని దాచిపెడుతుంది.దర్శకుడు భరత్ ధర్శన్ గ్రామీణ వాతావరణం, స్థానిక రాజకీయాలు, వినూత్నమైన ట్విస్ట్‌ను తో వినోదభరితమైన కథను తెరకెక్కించారు. గ్రామీణ నేపథ్యాన్ని సినిమాటోగ్రాఫర్ సీహెచ్ కుషేందర్ అందమైన విజువల్స్‌తో ఆకట్టుకునేలా చూపించారు. భరత్ మంచిరాజు అందించిన సంగీతం టీజర్‌కు ఉత్సాహభరితమైన అనుభూతిని తీసుకొచ్చింది. బలగం ఫేమ్ తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్‌గా, క ఫేమ్ శ్రీ వరప్రసాద్ ఎడిటర్‌గా, స్వయంభు ఫేమ్ అను రెడ్డి అక్కటి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పూర్ణాచారి పాటలు రాశారు.

## 'హిట్ అండ్ రన్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

**వుదయం:** సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతోన్న ఈ సినిమాను శ్రీ ఉరుకుంద ఈరణ్ణ స్వామి సమర్పణలో సతీష్ రెడ్డి అల్లం ఎంటర్టైన్మెంట్, శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్రియేషన్స్ బ్యానర్ల మీద సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా లుక్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది.



## "దీవాన" ట్రైలర్ లో మేకర్స్ ఫ్యాషన్ తెలుస్తోంది.. స్టార్ హీరో విజయ్ దేవరకొండ



**వుదయం:** శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్ధ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పి నేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన" సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది.

ఇటీవల దీవాన చిత్ర ట్రైలర్ రిలీజై ప్రేక్షకుల నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. తాజాగా దీవాన మూవీ ట్రైలర్ బాగుందంటూ ప్రశంసలుకురిపించారు స్టార్ హీరో విజయ్ దేవరకొండ. ట్రైలర్ తోనే సినిమాపై మేకర్స్ కు ఉన్న ప్యాషన్ తెలుస్తోందని విజయ్ దేవరకొండ సోషల్ మీడియా ద్వారా అభినందించారు. హర్షిత్ రెడ్డి పర్ఫామెన్స్ తనకు బాగా నచ్చిందని విజయ్ పేర్కొన్నారు.

## నాగబంధం రెండేళ్ల పాటు శ్రమించి అద్భుతంగా తీసిన సినిమా

**వుదయం సినిమా** విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్,



ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సావ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమా కథలోని ట్రెజర్ హంట్ కాన్సెప్ట్‌కు అనుగుణంగా ఈ ప్రచార యాత్రను రూపొందించారు. ఈ రోజు అనంత పద్మనాభ స్వామి వారి రథ యాత్రని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామి వారి రథయాత్ర ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇంత వర్షంలో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ థాంక్స్. ఇది కేవలం సినిమా ప్రమోషన్స్ మాత్రమే కాదు, మన సంస్కృతి, మన మూలాలను నెక్స్ట్ జనరేషన్‌కు పరిచయం చేయడానికి చేస్తున్న ఒక ప్రయత్నం. ఇది మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. ఇందుకు మీ అందరి సపోర్ట్ కావాలి. ఇంత పెద్ద విజన్‌ను సపోర్ట్ చేసిన నిషిత గారికి, కిషోర్ గారికి ధన్యవాదాలు. విరాట్‌ను చాలా కష్టపెట్టాను. తీవ్ర జ్వరంలో కూడా అతను ఈ సినిమా కోసం ఎంతో కష్టపడి పనిచేశాడు. ఈ సినిమా తర్వాత విరాట్ అంటే ఏంటో అందరికీ తెలుస్తుంది. మా టీమ్ అందరికీ థాంక్యూ. జునైద్, అభి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. వారి మ్యూజిక్ మీ అందరికీ నచ్చుతుంది. ఈ రథయాత్రను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను. ఓం నమో నారాయణాయ. హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం.

## 'నాట్ ఎ టీజర్' లాంచ్ ఈవెంట్

**వుదయం:** జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రజెంట్స్, సత్యదేవ్, వెంకటేష్ మహా, ఏ+ఎస్ మూవీస్ & శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'రావు బహదూర్' నెవర్ బిఫోర్ 'నాట్ ఎ టీజర్' లాంచ్సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'



చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, అలాగే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. 'ఇంటు ది వరల్డ్ ఆఫ్ రావు బహదూర్' వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. ఈ రోజు, చిత్ర నిర్మాతలు 'నాట్ ఎ టీజర్'ను లాంచ్ చేశారు.మూడు నిమిషాల పది సెకన్ల నిడివి గల ఈ వీడియో, కథానాయకుడి విచిత్రమైన, రహస్యాలతో నిండిన ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్తుంది. జీవిత చరమాంకంలో ఉన్న వ్యక్తి.. ప్రాణాంతకమైన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ, మరణం నీడలో జీవిస్తున్నప్పటికీ, వైద్యుల అంచనాలను తలకిందులు చేస్తూ అతడు బతికే పోరాటాన్ని కొనసాగిస్తాడు. ఆ ప్రయాణం ఒక అద్భుతంగా మారుతుంది. అనంతరం కథ గతం, వర్తమానం మధ్య ప్రయాణిస్తూ అతని యవ్వన దశ, ఒక అందమైన యువతితో ప్రేమకథ, అలాగే అతని అసాధారణ జీవితంలోని ఎన్నో రహస్యాలని ఆవిష్కరిస్తుంది.ఈ వీడియోలో సత్యదేవ్ చేసిన అద్భుతమైన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. క్లిష్టమైన పాత్రల్లో పూర్తిగా లీనమయ్యే నటుడిగా పేరున్న సత్యదేవ్, ఈ పాత్రలో అద్భుతమైన నటన కనబరిచారు. వాస్తవం, భ్రమల మధ్య చిక్కుకుని ఒంటరితనం, అంతర్మథనం, భావోద్వేగాలతో సతమతమయ్యే వ్యక్తిగా ఆయన నటన ఆకట్టుకుంటుంది. ఇప్పటివరకు తన కెరీర్‌లో కనిపించని కొత్త లుక్, కొత్త హావభావాలతో సత్యదేవ్ ఈ పాత్రకు ప్రాణం పోశారు.సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా కనిపించగా, వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాకా, మాస్టర్ కిరణ్ కీలక పాత్రలు పోషించారు.సాంకేతికంగా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో రూపొందుతోంది. వెంకటేష్ మహా తన ప్రత్యేకమైన విజన్‌తో కథనానికి సరికొత్త సినీ అనుభూతిని అందించారు. 'రావు బహదూర్' ఒక క్లాసిక్ చిత్రంగా నిలిచే అన్ని లక్షణాలు కలిగి ఉందనే ఫీలింగ్ ఈ వీడియో కలిగిస్తుంది.ప్రొడక్షన్ డిజైనర్ రోహన్ సింగ్ సృష్టించిన ప్రపంచం ఎంతో సహజంగా, గొప్పగా, దృశ్యపరంగా ఆకట్టుకునేలా ఉంది.

## 14 నుండి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానున్న "ఇల్లు"

**వుదయం:** మనోహర ఆర్ట్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా సమర్పిస్తూ కిషోర్ మారిశెట్టి నిర్మాతగా రోహిత్, శశి దర్శకత్వంలో ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న కథ సుధ చిత్రం




ఇల్లు. వివేక్ సాగర్ సంగీతాన్ని అందించిన ఈ కథ సుధకు శశాంక్ రాఘవుల సినిమాటోగ్రఫీ చేయగా అవంతి రుయా ఎడిటింగ్ చేశారు. హర్షవర్ధన్, బిందు చంద్రమౌళి ప్రముఖ పాత్రలో కనిపించిన చిత్రంలో అనీష్ కురువిల్ల, పవన్ రమేష్, క్యాంప్ శశి తదితరులు కీలకపాత్రలు పోషించారు. జూన్ 14వ తేదీ నుండి ఈటీవీ విన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ కథ సుధ చిత్ర బృందం మీడియా వారికి ఎక్స్క్లూజివ్ స్ట్రీమింగ్ తో పాటు ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. ఈ స్ట్రీమింగ్ కు హాజరైన నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఒక సాధారణ కథను సహజ సిద్ధంగా అదేవిధంగా చాలా అందంగా ప్రేక్షకులు ముందుకు తీసుకుని రావడం అనేది ఎంతో క్లిష్టమైన విషయం.

## 'ఒక్క చూపుతో మొదలైన..' చిత్రం ట్రైలర్ విడుదల

**వుదయం:** శివచౌదరి, జశ్విక హీరో హీరోయిన్లుగా చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో శ్రీ ఆంజనేయ క్రియేషన్స్ పతాకంపై పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న చిత్రం 'ఒక్క చూపుతో మెదలైన..'. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదలయింది. ఈ ట్రైలర్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హీరో శ్రీకాంత్ , నటుడు శివాజీ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఒక్క చూపుతో మెదలైన..' ట్రైలర్‌ను విడుదల చేసిన హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ .." చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఒక్క చూపుతో మెదలైన..' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సినిమా ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.